www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 19-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 333 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి: పంచమి రా.12:37 తదుపరి షష్ఠి, నక్షత్రం: విశాఖ రా.8.50 తదుపరి అనూరాధ, వర్జ్యం: రా.1:17-3:03, అమృతఘడియలు: ఉ.10:56-12:44, దుర్ముహూర్తం: ఉ.11:58-12:46, రాహుకాలం: మ. 12.00-1.30, సూర్యోదయం: 6:23, సూర్యాస్తమయం: 6:22 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులు

419 మంది మృతి.. అత్యధికులు పౌరులే

మృతుల్లో హమాస్ ప్రధాని, మంత్రులు, పోలీసు చీఫ్ తదితరులు.. 660 మందికి గాయాలు

కాల్పుల విరమణకు అంగీకరించనందుకే ఈ దాడులు.. నెతన్యాహు వెల్లడి 2




స్వాగతం సునీతా!

ఎట్టకేలకు ఐఎస్ఎస్ నుంచి భూమ్మీదికి సునీతా విలియమ్స్!

మంగళవారం ఉదయం 10.35కు స్పేస్ ఎక్స్ డ్రాగన్‌లో తిరుగుప్రయాణం

నేడు తెల్లవారుజామున 3.27కు ఫ్లోరిడా సముద్ర జలాల్లో దిగనున్న వ్యోమనౌక

దిగగానే వ్యోమగాములను స్ట్రెచర్‌పై తరలించి.. వైద్యపరీక్షల నిర్వహణ

ఆరు వారాల రిహ్యాబిలిటేషన్ ప్రోగ్రామ్

వాషింగ్టన్, మార్చి 18: ఎనిమిది రోజుల మిషన్ కోసం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లి.. వ్యోమనౌకలో సాంకేతిక సమస్యల కారణంగా 286 రోజులపాటు అక్కడే చిక్కుకుపోయిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్‌మోర్ ఎట్టకేలకు మంగళవారం

మిగతా 2వ పేజీలో...

పట్టర పట్టు..



విజయవాడలో ప్రజాప్రతినిధుల ఆటల పోటీల్లో భాగంగా నిర్వహించిన 'టగ్ ఆఫ్ వార్'లో మహిళా మంత్రులు, ఎమ్మెల్యేల పోటాపోటీ

ప్రతి జిల్లాలో క్రీడా స్టేడియం 12

అట్టహాసంగా ప్రజాప్రతినిధుల క్రీడా పోటీలు

ఉత్సాహంగా పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

కబడ్డీలో అచ్చెన్న, వాలీబాల్‌లో అయ్యన్న జట్ల గెలుపు

బెట్టింగ్ యాప్‌లపై ఫైటింగ్!



'సే నో టూ బెట్టింగ్ యాప్స్' హ్యాష్‌ట్యాగ్‌తో బెట్టింగ్ నివారణ ఉద్యమం

సోషల్ మీడియాలో భారీ స్పందన

ఇన్‌ఫ్లుయెన్సర్లూ జాగ్రత్త

కాసులకు కక్కుర్తిపడి మోసపూరిత యాప్‌లకు ప్రచారం చేస్తే కటకటాలే

ఒకే రోజు 11 మందిపై కేసులు.. నోటీసులు

మంచు లక్ష్మిపైనా కేసుకు రంగం సిద్ధం?

కేసుల భయంతో దిగొస్తున్న ఇన్‌ఫ్లుయెన్సర్లు

ప్రచారం చేయబోమంటూ సెల్ఫీ వీడియోలు!

హైదరాబాద్ సిటీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్‌లకు వ్యతిరేకంగా సీనియర్ ఐపీఎస్, టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రారంభించిన ఉద్యమం ఉధృతరూపం దాల్చింది. మోసపూరిత యాప్‌ల తరఫున ప్రచారం చేస్తున్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై కేసులు నమోదవుతున్నాయి. "భారత

మిగతా 13వ పేజీలో...



రన్యానే సూత్రధారి!

బంగారం స్మగ్లింగ్ కేసులో కీలక అంశాలు

డీఆర్ఐ విచారణలో హవాలా, ఆర్థిక నేరాల గుట్టురట్టు

స్నేహితుడు తరుణ్ రాజ్‌తో కలసి దుబాయ్‌లో కంపెనీ స్థాపన

విదేశాల నుంచి బంగారం దిగుమతి

అక్కడి నుంచి భారత్‌కు తరలింపు ప్రణాళిక

ఏడాదిలో 27సార్లు దుబాయ్‌కు ట్రిప్‌లు

ఎంత స్మగ్లింగ్ జరిగిందో డీఆర్ఐ ఆరా

బెంగళూరు, మార్చి 18: బంగారం స్మగ్లింగ్ చేస్తూ దొరికిన కన్నడ నటి రన్యా రావు కేసు విచారణలో సంచలన అంశాలు వెలుగులోకి వచ్చాయి. తనను స్మగ్లింగ్ కోసం గుర్తుతెలియని వ్యక్తులు వాడుకున్నారని గతంలో ఆమె చెప్పిన విషయం అబద్ధం అని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ విచారణలో బయటపడింది. ఆమే నేరుగా స్మగ్లింగ్‌కు పాల్పడ్డారని, ఈ కేసులో ఆర్థిక నేరాలు, హవాలా వ్యవహారాలు, కుట్ర కోణాలు ఉన్నాయని డీఆర్ఐ వర్గాలు తెలిపాయి. ఓ కంపెనీని స్థాపించి

మిగతా 2వ పేజీలో...



యూనిఫాంలో స్కూలుకెళ్లే సన్నక్కి చిన్నారి.. వలస వెళ్లి మిరపకాయలు కోస్తున్న దృశ్యం



పరీక్ష హాలులో కాదు.. 'వలస' వెళ్లి పొలంలో!

పది పరీక్షలు రాయాల్సిన చేతులతో మిర్చి కోతలు

సన్నక్కి చిన్నారి అనే ఈ విద్యార్థినికి వచ్చిన పెద్ద కష్టం వివరాలు 13లో..

స్కూళ్లు.. సవాళ్లు

బడులకు దూరంగా పిల్లలు

రాష్ట్రంలోని అన్ని రంగాలూ వృద్ధిలో పరుగులు పెడుతుంటే.. పాఠశాల విద్య మాత్రం ఒకింత తిరోగమనంలో పయనిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని విద్యాలయాల్లో ఏటా ఎంతో కొంత సంఖ్యలో చదువుకునే చిన్నారులు పెరగాల్సి ఉండగా.. దానికి భిన్నంగా వీరి సంఖ్య తగ్గుతోంది. ప్రాథమిక స్థాయిలో కొత్తగా చేరే విద్యార్థుల సంఖ్య తగ్గుతుంటే, ఆశ్చర్యకరంగా పైతరగతులకు వెళ్లాల్సిన వారూ చదువులకు దూరమవుతున్నారు. దీనికి గత ప్రభుత్వ నిర్ణయాలకు తోడు జననాల సంఖ్య తగ్గడమూ కారణమేనని తెలుస్తోంది.

ఏటా భారీగా తగ్గుతున్న విద్యార్థులు

ఒక్క ఏడాదిలో 2.63 లక్షల మంది తగ్గుదల

ప్రాథమిక స్థాయిలో పడిపోతున్న అడ్మిషన్లు

ప్రాథమికోన్నత, ఉన్నతస్థాయిలోనూ అంతే

బాలికల విద్యలోనూ ప్రతికూల గణాంకాలు

ప్రభుత్వ-ప్రైవేటు స్కూళ్లలో ఇదే పరిస్థితి

దెబ్బతీసిన వైసీపీ ప్రభుత్వ ప్రయోగాలు

జననాల రేటు తగ్గుదల కూడా కారణమే

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో పాఠశాల విద్యలో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. 2023-24 విద్యా సంవత్సరంతో పోలిస్తే 2024-25లో మొత్తంగా 2,63,094 మంది విద్యార్థులు తగ్గిపోయారు. వీరిలో ప్రాథమికోన్నత స్థాయిలో 64,830 మంది, ఉన్నత

మిగతా 13వ పేజీలో...

పీఠం వెనుక మోసం



శారదా పీఠంలో భారీ ఆక్రమణలు

జగన్ హయాంలో 270 కోట్ల విలువైన భూముల కేటాయింపు

అక్కడ వాణిజ్య అవసరాలకూ అనుమతి

అయినా, తీరని పీఠం భూదాహం

చుట్టూ ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణ

రోడ్డు భూమినీ వదలకుండా నిర్మాణాలు

అప్పట్లోనే సర్వేకు రెవెన్యూ ప్రయత్నాలు

అడ్డుకున్న నాటి సీఎంవో, పెద్దలు

కూటమి ప్రభుత్వంలోనూ 'పీఠం' దౌర్జన్యం

అధికారులు లోపలికి వెళ్లకుండా అడ్డగింత

సాంకేతికత ఆధారంగా రెవెన్యూ శాఖ సర్వే

బయటపడ్డ రూ.కోట్ల ఆక్రమణలు..

సర్కారుకు నివేదిక

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

వైసీపీ హయాంలో ఆ స్వామీజీ అడగడమే తడవుగా ప్రభుత్వ భూములను అప్పటి సీఎం జగన్ భక్తితో సమర్పించుకున్నారు. అయినా.. అవి చాలలేదు. తిరుమలలో మఠం పేరిట స్థలం పుచ్చుకున్నారు. నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేశారు. ఇవన్నీ కాదని.. విశాఖలోని తన అసలు పీఠం చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములనూ కలిపేసుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా.. సర్వే చేయడానికి రెవెన్యూ అధికారులను పీఠంలోకి రానీయలేదు. ఆ స్వామీజీ మరెవరో కాదు.. జగన్‌కు అత్యంత ప్రీతిపాత్రుడైన విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి. ఈయన పీఠంలోని ఆక్రమణలను సాంకేతికత సాయంతో లెక్కగట్టి రెవెన్యూశాఖ తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

విశాఖ శారదా పీఠం అక్రమాలు తవ్వేకొద్దీ బయట పడుతున్నాయి. జగన్ హయాంలో ఈ పీఠానికి భీమిలిలో 270 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కట్టబెట్టారు. ఆ భూములను వాణిజ్య అవసరాలకు కూడా వాడుకుంటామంటే... సరే అని జగన్ అనుమతులు ఇచ్చారు. అయితే... ఇటు భీమిలిలో, అటు పెందుర్తి మండలం చినముషిడివాడలో పీఠానికి ఎన్ని భూములు ఉన్నాయి? ఆ చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూమి ఎంత? ప్రభుత్వం నుంచి తీసుకున్న భూమిలో భారీ నిర్మాణాలు ఎందుకు చేయాలనుకుంటోందన్న అనుమానాలపై 2024లో ఎన్నికలకు ముందే అధికారులు విచారణ చేశారు. అప్పట్లో పెందుర్తిలో ఉన్న పీఠం ప్రధాన భూములను సర్వేచేయాలని రెవెన్యూ అధికారులు ప్రయత్నించగా

మిగతా 14వ పేజీలో...



అశోక్ లేల్యాండ్ బస్సులు ఇక ఏపీ నుంచే

నేడు ప్లాంట్‌ను ప్రారంభించనున్న లోకేశ్

'అమరావతి'లో తొలి ఆటోమొబైల్ ప్లాంట్

మల్లవల్లిలో ఎలక్ట్రికల్, డీజిల్ బస్సులకు అత్యాధునిక బాడీ బిల్డింగ్

ఏడాదికి 2,400 బస్సుల ఉత్పత్తి సామర్థ్యం

విజయవాడ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో ప్రఖ్యాత ఆటోమొబైల్ కంపెనీ ప్రారంభం కాబోతోంది. దేశంలోనే రెండో అతిపెద్ద వాహన తయారీ సంస్థ హిందూజా గ్రూప్ అనుబంధ సంస్థ అయిన అశోక్ లేల్యాండ్ ఎలక్ట్రికల్, డీజిల్ బస్సులకు అత్యాధునిక బాడీ బిల్డింగ్ యూనిట్‌ను ఏపీలో ప్రారంభిస్తోంది. భారీ పరిశ్రమల కేటగిరీలో విజయవాడ మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ఆ ప్లాంట్‌ను మంత్రి లోకేశ్ బుధవారం

మిగతా 12వ పేజీలో...

కొత్తగా 2 వేల కోట్ల అప్పు

రాష్ట్రానికి అనుమతి ఇచ్చిన కేంద్రం

మరో 5,600 కోట్ల రుణానికి త్వరలో అనుమతి: మంత్రి కేశవ్ 12



అసెంబ్లీలో అరకు కాఫీ స్టాల్‌ను ప్రారంభించి డిప్యూటీ సీఎం పవన్‌కు కాఫీ అందజేస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

గేట్స్‌తో బాబు భేటీ నేడు

ఇరువురి సమక్షంలో పలు ఒప్పందాలు

ఉదయం పార్లమెంటులో ప్రధానితో సీఎం సమావేశం?

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో కూడా

బనకచర్ల డీపీఆర్ అందించే అవకాశం 12

నాతో మాట్లాడించింది 'సాక్షి' మీడియానే!



అనవసరంగా రాజకీయాల్లోకి వచ్చానని ఆవేదన

స్క్రిప్టు, ఫొటోలు నాకు వారే ఇచ్చారు

నా కుటుంబం గురించి మాట్లాడటం వల్లే నేను కూడా ఆవేశంలో మాట్లాడాల్సి వచ్చింది

ఫిలిం కార్పొరేషన్ చైర్మన్‌గా 8 నెలలే ఉన్నా

వైసీపీ నుంచి ఎటువంటి లబ్ధి పొందలేదు

సీఐడీ కస్టడీలో పోసాని కృష్ణ మురళి వెల్లడి

సాక్షి మీడియాకు సీఐడీ నోటీసులు! 14



విజయసాయి రెడ్డికి మళ్లీ సీఐడీ పిలుపు!

కాకినాడ పోర్టు వ్యవహారంలో విచారణకు రావాలని త్వరలో నోటీసులు 14

సీనరేజీ కాంట్రాక్టు 3 నెలలు పొడిగింపు

రూ.190 కోట్ల బకాయిలు మాఫీ.. గనుల శాఖకు సర్కారు అనుమతి

ఇసుక అక్రమ తవ్వకాలపై సీఎం సీరియస్.. కఠిన చర్యలకు ఆదేశం

'ఆంధ్రజ్యోతి' కథనాలకు స్పందన



అమరావతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సీనరేజీ వసూలు కాంట్రాక్టుపై ఎట్టకేలకు సర్కారు స్పందించింది. కాంట్రాక్టు కాలపరిమితిని మరో మూడు నెలలు పొడిగించాలని నిర్ణయించింది. మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద జరిగిన సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. కాంట్రాక్టు సంస్థల వినతి మేరకు రూ.190 కోట్ల మేర బకాయిల మాఫీకి సీఎం ఆమోదం తెలిపినట్లు తెలిసింది. అయితే, ఇవన్నీ నిబంధనలకు లోబడే జరిగేలా చూడాలని సీఎం గనుల శాఖను ఆదేశించినట్లు సమాచారం. జగన్ ప్రభుత్వంలో చిత్తూరు, అనంతపురం, కడప, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు

మిగతా 11వ పేజీలో...

600 ఎకరాలు.. 400 కోట్లు

పీలేరులో వైసీపీ భూఅక్రమాల చిట్టా.. సీఎంవో ఆదేశాలతో 'ప్రత్యేక' విచారణ

కలెక్టర్‌కు ప్రాథమిక నివేదిక.. నెలాఖరులో సీఎంకు పూర్తిస్థాయి రిపోర్టు!

ఆక్రమణదారులు, అధికారుల గుండెల్లో గుబులు.. 2021లోనే ఈ కబ్జాలు, దోపిడీపై విచారణ.. ఎక్కడెక్కడ జరిగాయో నాటి సబ్‌కలెక్టర్ నివేదిక

పట్టా, ప్రభుత్వ, చుక్కల భూముల్లో అనధికార లేఔట్లు 12

ప్లాట్లు వేసి అమ్మి వైసీపీ నేతల దోపిడీ.. అయినా చర్యలు అంతంత మాత్రమే

ప్రభుత్వం మారాక పెద్దఎత్తున ఫిర్యాదులు.. స్వయంగా రంగంలోకి సీఎంవో

ఓటరు ఐడీ-ఆధార్ అనుసంధానం..

నకిలీ ఓటర్లను అడ్డుకోవడానికే..

ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాల ప్రకారమే చర్యలు

త్వరలో ఈసీ- ఉడాయ్ నిపుణుల సంప్రదింపులు

ఆన్‌లైన్‌లో బూత్‌ల వారీ ఓటింగ్‌పై చర్చలకు సిద్ధం

కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన 2

పాక్‌లోకి చైనా సైనిక సంస్థలు!

బీఎల్ఏ దాడుల నేపథ్యంలో నిర్ణయం

సీపెక్‌లో భాగంగా పాక్‌లో పని చేస్తున్న వేలాది మంది చైనీయులు

వారిపై విరుచుకుపడుతున్న బీఎల్ఏ

సిబ్బంది రక్షణకు 3 ప్రైవేటు సెక్యూరిటీ, మిలిటరీ ఏజెన్సీలతో చైనా ఒప్పందం

భవిష్యత్తులో సైన్యాన్నీ దించే చాన్స్

ఇస్లామాబాద్, మార్చి 18: పాకిస్థాన్‌లో పని చేస్తున్న చైనా వారిపై బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) దాడులు పెరుగుతున్న నేపథ్యంలో.. వారి రక్షణకు చైనా రంగంలోకి దిగింది. 3 ప్రైవేటు మిలిటరీ, సెక్యూరిటీ సంస్థలతో ఒప్పందం చేసుకుంది. డేవ్ సెక్యూరిటీ ఫ్రాంటియర్ సర్వీస్ గ్రూప్, చైనా ఓవర్సీస్ సెక్యూరిటీ గ్రూప్, హువాగ్జిన్ జోంగ్‌షన్ సెక్యూరిటీ సర్వీస్ సంస్థలు

మిగతా 2వ పేజీలో...

'ఉపాధి' వేతనం రూ.400 ఇవ్వాలి

» ప్రతి కుటుంబానికి 150 పనిదినాలు కల్పించాలి: సోనియా



న్యూఢిల్లీ, మార్చి 18: గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎంజీఎన్ఆర్ఈజీఏను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ఆరోపించారు. ఉపాధి కూలీలకు రోజువారీ కనీస వేతనాన్ని రూ.400కు పెంచాలని, ప్రతి కుటుంబానికి ఏడాదికి 150 పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాజ్యసభలో మంగళవారం జీరో అవర్‌లో సోనియా మాట్లాడుతూ.. 2005లో తమ యూపీఏ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ఈ చరిత్రాత్మక చట్టం.. కోట్లాది మందికి ఉపాధి భద్రత కల్పిస్తోందని, అయితే నేటి ఎన్డీయే ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేయడం ఆందోళనకరమని అన్నారు.

ట్రంప్ 'అమెరికాయే ముందు'పై అపార్థాలొద్దు

» అది 'భారతదేశమే ముందు'పై మోదీ నిబద్ధత లాంటిదే: గబ్బార్డ్

న్యూఢిల్లీ, మార్చి 18: 'అమెరికాయే ముందు' అనే ట్రంప్ విధానాన్ని 'అమెరికా మాత్రమే' అని అపార్థం చేసుకోవద్దని అమెరికా ఇంటెలిజెన్స్ చీఫ్ తులసి గబ్బార్డ్ కోరారు. ఇది 'భారతదేశమే ముందు' అనే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిబద్ధత లాంటిదేనని తేల్చిచెప్పారు. ఢిల్లీలో జరుగుతున్న రైజీనా డైలాగ్ కార్యక్రమంలో మంగళవారం ఆమె ప్రసంగించారు. హిందూ మతాన్ని పాటిస్తున్న గబ్బార్డ్.. 'నమస్తే.. జై శ్రీకృష్ణ' అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఈ పదాలు మనందరి హృదయాల్లో ఉన్న అంతర్గత ఆధ్యాత్మిక భావాలను ప్రతిబింబిస్తున్నాయని, ఇది జాతి, తెగ, మతంతో నిమిత్తం లేకుండా మనందరి మధ్య ఉన్న సంబంధాన్ని గుర్తు చేయడమేనని ఆమె తెలిపారు.

కృష్ణా ప్రాజెక్టులపై కౌంటర్ వేయండి: సుప్రీం

న్యూఢిల్లీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదిపై నిర్మించిన ప్రాజెక్టులను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) అధీనం చేసే అంశంపై రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రాన్ని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆ ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగిస్తూ 2021లో కేంద్రం జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ రిట్ పిటిషన్ దాఖలు చేయగా.. తెలంగాణ తెచ్చిన జీవో 34ను రద్దు చేయాలని, దాని పేరుతో అపరిమితంగా విద్యుదుత్పత్తి చేస్తోందని ఏపీ కూడా పిటిషన్ వేసింది. రెండు పిటిషన్లనూ కలిపి మంగళవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం విచారణ జరిపింది.

రన్యానే సూత్రధారి!

(మొదటి పేజీ తరువాయి)

దాని ద్వారా బంగారం స్మగ్లింగ్ చేశారని తేలినట్లు వెల్లడించాయి. రన్యా రావు కేసులో రెండో నిందితుడిగా ఉన్న నటుడు తరుణ్ రాజ్ కొండూరుని కూడా డీఆర్ఐ విచారించింది. డీఆర్ఐ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. తరుణ్ రాజ్‌తో కాలేజీ రోజుల నుంచి రన్యా రావుకు పరిచయం ఉంది. వారిద్దరూ కలసి వీర డైమండ్స్ ట్రేడింగ్ ఎల్ఎల్‌సీ పేరుతో 2023లో దుబాయ్‌లో చెరిసగం భాగస్వామ్యంతో ఓ బంగారం వ్యాపారం కంపెనీని నెలకొల్పారు. అమెరికా పౌరసత్వం ఉన్న తరుణ్ రాజ్ ఆ కంపెనీలో వర్కింగ్ పార్టనర్‌గా ఉంటూ.. రన్యా తరఫున వ్యవహారాలు నడిపాడు. అంతర్జాతీయంగా బంగారం వ్యాపారాన్ని విస్తరించడానికి రన్యా రావు తన కుటుంబ సంబంధాలను వినియోగించుకుంది. తన వ్యాపారాన్ని సజావుగా కొనసాగించేందుకు బ్యాంకాక్, జెనీవాల్లోని ముఖ్యమైన క్లయింట్లతో ఆమె గట్టి సంబంధాలు నెరిపింది. దోహా, జెనీవాల్లో ఆమె హోల్ సేల్ సప్లయర్ల నుంచి బంగారం కడ్డీలను కొనుగోలు చేసి.. దుబాయ్ ఖాతాల ద్వారా విదేశీ కరెన్సీని చెల్లించింది.

హవాలా మార్గంలో చెల్లింపులు

దుబాయ్‌కి బంగారం దిగుమతి చేసుకుని అక్కడ పెట్టుబడి పెట్టడం, ఆ తర్వాత బంగారాన్ని భారత్‌కు తరలించడం.. ఇదే రన్యా, తరుణ్ ప్రణాళిక. వీరి కంపెనీకి ప్రధాన పెట్టుబడిదారు రన్యానే. ఆ కంపెనీలో పెట్టిన రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షలను ఆమె తన హెచ్‌డీఎఫ్‌సీ ఖాతా నుంచి మళ్లించారు. ఆమె దుబాయ్ రెసిడెంట్ కార్డును కూడా పొందడంతో ఇక యూఏఈ వీసా అవసరం లేకపోయింది. ఆ కార్డు ద్వారా తరచూ బంగారం కొనుగోళ్లు కూడా సులువయ్యాయి. ఏప్రిల్ 2024 నుంచి ప్రధానంగా జెనీవా, బ్యాంకాక్‌ల నుంచి బంగారం ఆమె కంపెనీకి దిగుమతులు జరిగాయి. దీనికోసం తరుణ్ రాజ్‌కు ఉన్న అమెరికా పాస్‌పోర్టును కూడా రన్యా రావు వినియోగించుకున్నారు. ఈ స్మగ్లింగ్ రాకెట్‌లో పెద్దఎత్తున ఆర్థిక నేరాలు కూడా ఉన్నాయి. గడిచిన ఏడాదిలో రన్యా రావు కనీసం 27 సార్లు విదేశాలకు వెళ్లి వచ్చారు. కస్టమ్స్‌కు సమాచారం ఇవ్వకుండా ప్రతిసారి ఆమె బంగారాన్ని స్మగ్లింగ్ చేశారు. సోదాల్లో ఆమె ఇంటి నుంచి డీఆర్ఐ అధికారులు పలు కీలకపత్రాలు స్వాధీనం చేసుకున్నారు. దానిలో రెండు దుబాయ్ కస్టమ్స్‌కు సంబంధించిన పత్రాలు కూడా ఉన్నాయి. జెనీవాకు గోల్డ్ ఎక్స్‌పోర్టు చేస్తున్నట్లు ఆ పత్రాల్లో ఉంది. అయితే జెనీవాకు ఆ బంగారం చేరలేదని విచారణ అధికారులు గుర్తించారు. రన్యా రావు పెంపుడు తండ్రి, సీనియర్ ఐపీఎస్ అధికారి రామచంద్రరావును డీఆర్ఐ విచారించనుంది.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం.. ఇంధన వనరులపై కాల్పుల విరమణ

» 30 రోజుల ఒప్పందానికి పుతిన్ అంగీకారం

వాషింగ్టన్, మార్చి 18: మూడేళ్లకు పైగా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి కొంత మేర విరామం లభించనుంది..! ఉక్రెయిన్‌కు చెందిన ఇంధన వనరులపై 30 రోజుల పాటు దాడులు చేయబోమని రష్యా అధినేత పుతిన్ ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, పుతిన్ మధ్య మంగళవారం సుమారు గంటన్నర పాటు ఫోన్‌లో జరిగిన చర్చల్లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు క్రెమ్లిన్ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. నిజానికి 30 రోజుల పాటు కాల్పుల విరమణకు పుతిన్‌ను ఒప్పించాలని ట్రంప్ నిర్ణయించినా.. ఆ మేరకు అంగీకారం కుదరలేదని తెలుస్తోంది. దీంతోపాటు.. ఇరు దేశాల పరస్పర ఆక్రమణల్లో ఉన్న భూభాగాలను తిరిగి ఇప్పించడం.. ముఖ్యంగా జాపోరీజియా అణువిద్యుత్తు ప్లాంట్ నుంచి రష్యాను ఖాళీ చేయించడం వంటి అంశాలను పుతిన్ ముందు పెట్టినట్లు తెలుస్తోంది. అయితే.. చర్చల సమగ్ర వివరాలను అటు వైట్‌హౌస్ గానీ, ఇటు క్రెమ్లిన్ గానీ వెల్లడించలేదు. యుద్ధ ఖైదీల పరస్పర బదిలీకి రష్యా అధినేత అంగీకరించినట్లు క్రెమ్లిన్ వర్గాలు విడుదల చేసిన పత్రికాప్రకటన స్పష్టం చేస్తోంది. యుద్ధంలో తీవ్రంగా గాయపడి, తమ చెరలో చికిత్స పొందుతున్న 23 మంది ఉక్రెయిన్ సైనికులను బుధవారం అప్పగించేందుకు రష్యా సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

ఆంధ్రజ్యోతి వేదికగా 'తెలుగు జాడలు' పుస్తకావిష్కరణ

హైదరాబాద్ సిటీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వివిధ దేశాల్లోని తెలుగు వారి భాషా సంస్కృతులు, ఆచార వ్యవహారాలు, జీవన విధానంపై ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం. ఉమామహేశ్వరరావు రాసిన 'తెలుగు జాడలు' యాత్రానుభవాల సంపుటిని మంగళవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆంధ్రజ్యోతి కార్యాలయంలో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ ఆవిష్కరించారు. ఇందులోని వ్యాసాలన్నీ ఇది వరకు ఆంధ్రజ్యోతి ఆదివారం సంచికలో ప్రచురితమయ్యాయి. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి ఎడిటర్ రాహుల్ కుమార్, అసిస్టెంట్ ఎడిటర్ వక్కలంక రమణ, తెలంగాణ నెట్‌వర్క్ ఇంచార్జి ఆర్. కృష్ణప్రసాద్, జర్నలిజం కళాశాల ప్రిన్సిపాల్, కవి యార్లగడ్డ రాఘవేంద్రరావు, ఏబీఎన్ అసోసియేట్ ఎడిటర్ సువర్ణకుమార్, ఆర్ఎం. ఉమామహేశ్వరరావు జీవిత సహచరి విష్ణుప్రియ, కుమార్తె రాగలీన పాల్గొన్నారు.



ఉమామహేశ్వరరావు రాసిన 'తెలుగుజాడలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ, చిత్రంలో ఆంధ్రజ్యోతి ఎడిటర్ రాహుల్‌కుమార్, ఎడిటోరియల్ విభాగాధిపతులు, ఉమామహేశ్వరరావు కుటుంబసభ్యులు

గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులు

419 మంది మృతి.. అత్యధికులు పౌరులే



ఇజ్రాయెల్ దాడుల్లో నేలమట్టమైన భవనాలు

టెల్అవీవ్, మార్చి 18: హమాస్ ప్రభుత్వం దాదాపుగా పతనమైంది..! గాజాపై సోమవారం అర్ధరాత్రి నుంచి ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో 419 మంది మృతిచెందగా.. 660 మంది గాయాలపాలయ్యారు. వందల సంఖ్యలో భవనాలు నేలమట్టమయ్యాయి. మృతుల్లో హమాస్ ప్రధాని ఇసామ్ దాలిస్ సహా.. కీలక మంత్రులు, మిలటరీ/పోలీసు కమాండర్లు ఉన్నారు. ముందు నుంచి హమాస్‌కు సహకరిస్తూ వస్తున్న 'ఇస్లామిక్ జిహాద్' సంస్థ కీలక నేత అబూ హమ్జా కూడా ఈ దాడుల్లో అంతమైనట్లు ఇజ్రాయెల్ వార్తాసంస్థ యెదిహోత్ అహ్రోనోత్(వైనెట్) తెలిపింది. సౌదీ అరేబియాకు చెందిన ప్రముఖ వార్తా సంస్థ అల్-హదత్ కూడా హమాస్ ప్రభుత్వంలోని కీలక వ్యక్తుల మరణాలను నిర్ధారించింది. అమెరికా, ఖతార్, ఈజిప్ట్ ప్రతిపాదించిన కాల్పుల విరమణ ఒప్పందానికి తాము అంగీకరించినా.. హమాస్ నుంచి స్పందన లేకపోవడంతో సోమవారం అర్ధరాత్రి నుంచి వైమానిక దాడులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఎక్స్‌లో పోస్టు చేశారు. పౌరులు తూర్పు గాజాను ఖాళీ చేయాలని ఆదేశించారు. ఇజ్రాయెల్ తమకు ముందుగానే సమాచారమిచ్చిందని, ట్రంప్ ఓకే చెప్పాకే దాడులను ప్రారంభించిందని వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి. గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ కూడా ఇజ్రాయెల్ దాడుల్లో 419 మంది మృతిచెందినట్లు నిర్ధారించింది. మృతుల్లో మహిళలు, చిన్నారులు ఉన్నట్లు తెలిపింది. గాజాలోని ఖాన్‌యూనిస్‌తో పాటు.. రఫా, ఉత్తరగాజా, సెంట్రల్ గాజా సిటీలనే లక్ష్యంగా చేసుకుని సుమారు 200 విమానాలు దాడులకు పాల్పడ్డట్లు వివరించింది.

హమాస్‌కు భారీ నష్టం

ఇజ్రాయెల్ దాడులతో హమాస్‌కు కోలుకోలేని దెబ్బ తగిలింది. హనియే, సిన్వర్ వంటి హమాస్ అగ్రనాయకులు అంతమైనా.. వ్యూహాత్మక పోరాటాలకు సహకరిస్తున్న ఇస్లామిక్ జిహాద్ నేత అబూ హమ్జా తాజా దాడుల్లో హతమైనట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. క్షిపణుల కమాండర్‌గా పనిచేస్తున్న హమ్జా భార్య, ఇతర కుటుంబ సభ్యులూ చనిపోయినట్లు తెలిపింది. ఇక హనియేకు కుడిభుజంగా ఉంటూ.. ఆయన మరణం తర్వాత హమాస్ ప్రధాని పదవిని చేపట్టిన ఇసామ్ డాలిస్, ఆయన భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు మనవరాళ్లు కూడా మృతి చెందారు. డాలిస్ మరణంతో హమాస్ దారితెన్నూ లేకుండా పోతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి జరిపిన సమయంలో ఇజ్ అద్-దీన్ అల్-ఖాసమ్ బ్రిగేడ్లకు సీనియర్ నేతగా.. రఫా బ్రిగేడ్‌కు డిప్యూటీ కమాండర్‌గా డాలిస్ పనిచేశారు. డాలిస్ మరణాన్ని ఆయన సోదరుడు ధ్రువీకరిస్తూ.. మంగళవారం అల్-జజీరాకు ఓ ఇంటర్వ్యూ ఇచ్చారు.



ఇస్లామిక్ జిహాద్ నేత అబూ హమ్జా



హమాస్ ప్రధాని ఇసామ్ దాలిస్

దాడుల్లో మృతి చెందిన ఇతర నేతలు



బహ్జత్ అబూ సుల్తాన్: ఈయన హమాస్ లెఫ్టినెంట్ జనరల్. ఇజ్రాయెల్‌పై దాడుల్లో కీలకంగా వ్యవహరించారు



అహ్మద్ ఒమర్ అల్-హట్టా: హమాస్ న్యాయశాఖ మంత్రిగా పనిచేస్తూ.. ఇస్లామిక్ చట్టాల అమలులో కీలక పాత్ర పోషించారు. గాజా అంతర్గత వ్యవహారాల ఇన్‌చార్జిగా కూడా కొనసాగారు. 2021 వరకు గాజాలోని 'రబాత్ పోలీసు శిక్షణ కళాశాల'కు డీన్‌గా పనిచేశారు.



మహమ్మద్ అబూ వత్ఫా: హమాస్ పోలీసు, భద్రత విభాగాల అధిపతిగా.. అంతర్గత వ్యవహారాల డీజీగా సేవలందించారు. సెంట్రల్ గాజాలోని ఈయన ఇంటిపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో.. వత్ఫా కుటుంబమంతా చనిపోయింది.



యాసిర్ హర్బ్: ఈయన హమాస్ పొలిట్‌బ్యూరో సభ్యుడు. ఇజ్రాయెల్ తాజా దాడుల్లో ఈయన ఐదుగురు కుమారులు కూడా మరణించారని ఖతార్ వార్తాపత్రిక అల్-అరబీ అల్-జదీద్ వెల్లడించింది.



అబూ ఒబేదా మహమ్మద్ అల్-జమాసీ: ఈయన హమాస్‌లో మానవహక్కులను పర్యవేక్షించేవారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు కూడా. దక్షిణ గాజాకు ప్రభుత్వాధినేతగా పనిచేశారు.

పాక్‌లోకి చైనా మిలిటరీ సంస్థలు!

(మొదటి పేజీ తరువాయి)

ఇక మీదట పాక్‌లో చైనా జాతీయుల రక్షణ బాధ్యతలు చూసుకోనున్నాయి. వేల కోట్ల డాలర్ల వ్యయంతో నిర్మిస్తున్న 'చైనా-పాకిస్థాన్ ఎకనమిక్ కారిడార్'(సీపెక్)లో పలువురు చైనా జాతీయులు పని చేస్తున్నారు. కాగా, పాకిస్థాన్ నుంచి స్వాతంత్ర్యాన్ని కోరుతూ సాయుధ పోరాటం జరుపుతున్న బీఎల్ఏ.. చైనా-పాక్ కారిడార్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ ప్రాజెక్టులో భాగంగా బలూచిస్థాన్‌లోని ఖనిజ సంపదను దోచుకోనున్నారన్నది ఆ సంస్థ ఆరోపణ. ఈ నేపథ్యంలో చైనీయుల మీద దాడులు జరిపి వారిని భయభ్రాంతులకు గురిచేస్తోంది. తాజాగా బీఎల్ఏ ఏకంగా ఓ రైలునే హైజాక్ చేసి, పలువురు పాక్ సైనికులను హతమార్చింది. సైన్యం కాన్వాయ్ మీద దాడి చేసి 90 మంది జవాన్లను ఊచకోత కోసింది. ఈ వరుస ఘటనలతో చైనీయుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. దీంతో చైనా ప్రభుత్వం స్వయంగా రంగంలోకి దిగి తమ వారి రక్షణ బాధ్యతను తన చేతుల్లోకి తీసుకుంది. చైనా ఒత్తిడి మేరకు పాకిస్థాన్ తన రక్షణ బడ్జెట్‌లో.. చైనా జాతీయుల భద్రత కోసం భారీగా కేటాయింపులను పెంచింది. అయినప్పటికీ, చైనా పాక్‌ను నమ్మకుండా తానే స్వయంగా రంగంలోకి దిగటం గమనార్హం. కాగా బలూచ్ తిరుగుబాటు దారులు మరిన్ని దాడులు జరిపే ప్రమాదం ఉన్న దృష్ట్యా 2,500 మందికి పైగా సైనికులు పాక్ ఆర్మీకి రాజీనామా చేశారన్న వార్త మరోవైపు పెను సంచలనం సృష్టిస్తోంది.



శిల్పకళా సౌందర్యం.. అద్భుతం!

» యాదగిరిగుట్ట' ఆలయ సందర్శన అనిర్వచనీయం.. విశ్వసుందరి విక్టోరియా

యాదగిరిగుట్ట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): యాదిగిరి గుట్ట లక్ష్మీ నృసింహుడి ఆలయంలో శిల్పకళా సౌందర్యం ఉట్టిపడుతోందని విశ్వ సుందరి-2024 విక్టోరియా కెజార్ హెల్విగ్ అన్నారు. మంగళవారం హిందూ సంప్రదాయ రీతిలో అచ్చమైన చీర కట్టుతో వచ్చిన ఆమె.. స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం తిరువీధుల్లో అఖండ దీపారాధన చేశారు. సనాతన హిందూ ధర్మం, ఆలయ విశిష్టత, సంప్రదాయాలను ఈవో ఆమెకు వివరించారు.

ఓటరు ఐడీ-ఆధార్ అనుసంధానం..

నకిలీ ఓటర్లను అడ్డుకోవడానికే..

» ఆన్‌లైన్‌లో బూత్‌ల వారీ ఓటింగ్ వివరాలపై చర్చలకు సిద్ధం: ఈసీ

న్యూఢిల్లీ, మార్చి 18: ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాల ప్రకారం మాత్రమే ఓటరు గుర్తింపు కార్డు-ఆధార్ అనుసంధానంపై నిర్ణయం తీసుకుంటామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. నకిలీ ఓటర్ల బెడద నివారణ కోసం ఈ కార్యక్రమాన్ని చేపడుతామని, అయితే అది చట్టాలకు అనుగుణంగానే ఉంటుందని తెలిపింది. ఇందుకు సంబంధించి ఆధార్ కార్డులు జారీ చేసే 'ఉడాయ్' సంస్థ, ఎన్నికల కమిషన్ (ఈసీ)కు చెందిన సాంకేతిక నిపుణులు త్వరలో చర్చలు జరపనున్నట్లు ప్రకటించింది. ఇది కాకుండా మరో 2 కీలక ప్రకటనలు చేసింది. ఒక ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ నెంబరు)పై పలువురి ఓటర్ల పేర్లు నమోదయి ఉంటే దానిని ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికార్లే గుర్తించేలా సాఫ్ట్‌వేర్‌లోనే ప్రత్యేక ఆప్షన్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపింది. పోలింగ్ ముగిసిన అనంతరం బూత్‌ల వారీగా ఓటింగ్ వివరాలను ఆన్‌లైన్‌లో పెట్టే విషయమై చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించింది. ఆధార్- ఎపిక్ అనుసంధానంపై ఎన్నికల కమిషన్ మంగళవారం కేంద్ర హోం శాఖ కార్యదర్శి, చట్టసభల వ్యవహారాల కార్యదర్శి, ఐటీ శాఖ కార్యదర్శి, ఉడాయ్ సీఈవోలతో చర్చలు జరిపింది. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులకు అనుగుణంగా అనుసంధానం ప్రక్రియను చేపట్టాలని నిర్ణయించారు. బెంగాల్‌లో పెద్దయెత్తున 'నకిలీ ఓటర్ల' పేర్లను చేర్చారంటూ తృణమూల్ కాంగ్రెస్ ఫిర్యాదులు చేసిన నేపథ్యంలోకమిషన్ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. 'నకిలీ ఓటర్ల'ను గుర్తించి, వారి పేర్లను తొలగించేందుకు సాఫ్ట్‌వేర్‌లోనే ప్రత్యేక 'ఆప్షన్'ను ఏర్పాటు చేసింది. ఈసీ నిర్ణయాన్ని కాంగ్రెస్ స్వాగతించింది.

ఆన్‌లైన్‌లో బూత్‌ల వారీ వివరాలు

పోలింగ్ జరిగిన 48 గంటల అనంతరం బూత్‌ల వారీ ఓటింగ్ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఈసీ సుప్రీంకోర్టుకు నివేదించింది. ఓటింగ్ వివరాలను ఆన్‌లైన్‌లో పెట్టేలా ఆదేశాలు జారీ చేయాలని తృణమూల్ ఎంపీ మహువా మొయిత్రా, అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ దాఖలు చేసిన వ్యాజ్యాలపై మంగళవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. విచారణను జూలైకి వాయిదా వేసింది.

లోకం తీరు



మహాకుంభ్.. ఓ జాతీయ చైతన్యం

లోక్‌సభలో ప్రధాని ప్రకటన



న్యూఢిల్లీ, మార్చి 18: ప్రయాగరాజ్‌లో ఈ దఫా జరిగిన మహా కుంభమేళాకు ప్రజలే సారథ్యం వహించారని, వారి సంకల్పం, అంకితభావంతోనే విజయవంతంగా సాగిందని ప్రధాని మోదీ అన్నారు. ఇది జాతీయ చైతన్యానికి నిదర్శనమని తెలిపారు. పలు చారిత్రక ఉద్యమాలు, విప్లవాలు, ఘటనలతో దానిని పోలుస్తూ మంగళవారం లోక్‌సభలో ఆయన ప్రకటన చేశారు. మహాకుంభమేళా దేశ సమైక్యతా స్ఫూర్తిని మరింత బలోపేతం చేసిందని ప్రధాని పేర్కొన్నారు. 45 రోజుల కార్యక్రమంలో 66 కోట్ల మందికిపైగా ప్రజలు త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు చేశారన్నారు. ఇంత భారీ జనసమ్మేళనం నిర్వహించే సత్తా భారత్‌కు ఉందా అని ప్రశ్నించినవారికి దీటైన జవాబిచ్చిందని ఆయన చెప్పారు.

మృతులకు నివాళులు అర్పించాల్సింది: రాహుల్

మహాకుంభమేళా మన చరిత్ర, సంస్కృతి అని.. సాంస్కృతిక వారసత్వంపై ప్రధాని ప్రకటనతో తాము ఏకీభవిస్తున్నామని, మద్దతిస్తున్నామని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. అయితే కుంభమేళా తొక్కిసలాటలో చనిపోయిన 30 మందికి శ్రద్ధాంజలి ఘటించడంలో ఆయన విఫలమయ్యారని విమర్శించారు. పార్లమెంటు ప్రాంగణంలో రాహుల్ విలేకరులతో మాట్లాడుతూ.. సభలో ప్రధాని ప్రకటన చేశాక తనకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదన్నారు. 'కుంభమేళాకు హాజరైన లక్షల మంది యువత కోరుకునేది ప్రశంసలు కాదు.. ఉద్యోగాలు. ప్రధాని నుంచి ఉపాధి కోరుతున్నారు' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత

» బిల్లుకు తెలంగాణ ఉభయసభల ఆమోదం

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఎస్సీలను మూడు గ్రూపులుగా వర్గీకరించిన ప్రభుత్వం.. ఆ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించింది. ఇందుకు సంబంధించి సోమవారం మంత్రి దామోదర రాజనర్సింహ ప్రవేశపెట్టిన 'తెలంగాణ షెడ్యూల్డ్ కులాలు (రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ) బిల్లు-2025'ను మంగళవారం అసెంబ్లీ ఉభయసభలు ఆమోదించాయి. దీనిపై శాసనసభ, శాసనమండలిలో చర్చించిన అనంతరం సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా శాసనసభలో జరిగిన చర్చలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను ప్రకటిస్తున్నందుకు గర్వంగా భావిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ పోరాటంలా.. ఎస్సీ వర్గీకరణ పోరాటం సైతం 30 ఏళ్లుగా సంక్లిష్టంగా మారుతూ వచ్చిందని అన్నారు. ఈ సమస్యకు సభ పరిష్కారం చూపడం చరిత్రాత్మకమైన సందర్భమని, ఇది వ్యక్తిగతంగా తన మనసుకు దగ్గరగా ఉన్న అంశమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సోనియాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రకటించినట్టుగా.. నేడు ఎస్సీ వర్గీకరణను ప్రకటించామన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ప్రకటించిన గంటలోపే.. తమ ప్రభుత్వం విధానాన్ని స్పష్టంగా ప్రకటించిందని గుర్తుచేశారు. ఇందుకు పార్టీలకతీతంగా మద్దతు పలికారంటూ ధన్యవాదాలు తెలిపారు. ఈ బిల్లుకు గవర్నర్ దానికి ఆమోదం తెలిపిన తరువాత రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు ఆయా కులాలకు కేటాయించిన రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం కానుంది.

స్వాగతం సునీతా!

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం (భారత కాలమానం ప్రకారం) భూమ్మీదకు తిరుగు ప్రయాణమయ్యారు. వారి కోసం ప్రత్యేకంగా పంపిన స్పేస్ ఎక్స్ క్రూ-9 డ్రాగన్ క్యాప్సూల్ మంగళవారం ఉదయం 10.35 గంటలకు ఐఎస్ఎస్ నుంచి విడిపోయి భూమి దిశగా పయనమైనట్లు నాసా వెల్లడించింది. అందులో సునీత, విల్‌మోర్‌తోపాటు మరో ఇద్దరు వ్యోమగాములు అలెగ్జాండర్ గోర్బనోవ్ (రష్యా), నిక్ హేగ్ (అమెరికా) కూడా ఉన్నారు. ఈ నౌక 17 గంటలపాటు ప్రయాణించి ఫ్లోరిడా తీరంలోని సముద్ర జలాల్లో బుధవారం తెల్లవారుజామున 3.27 గంటలకు దిగుతుందని నాసా వెల్లడించింది. దిగగానే నాసా రికవరీ బృందాలు అక్కడికి వెళ్లి వారిని వ్యోమనౌక నుంచి బయటకు తెచ్చి.. హ్యూస్టన్‌లోని జాన్సన్ స్పేస్ సెంటర్‌కు తరలించి వైద్యపరీక్షలు చేయనున్నట్టు తెలిపింది. దాదాపు 9 నెలలపాటు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో, భార రహిత స్థితిలో ఉన్న నేపథ్యంలో సునీత, విల్‌మోర్ భూమ్మీదికి తిరిగి రాగానే మామూలుగా నడవలేరని నాసా మాజీ వ్యోమగామి లెరోయ్ చియావో వెల్లడించారు. రోదసిలో ఉన్నప్పుడు శరీరంలోని రక్తం, ఇతర స్రావాలన్నీ పైభాగంలో ఎక్కువగా చేరుతాయని.. దీనివల్ల భూమ్మీదికి వచ్చాక వారు నిలబడితే రక్తపోటు పడిపోయి, కళ్లు తిరిగి పడిపోతారని వివరించారు. ఈ నేపథ్యంలో.. వైద్యపరీక్షలు పూర్తయిన అనంతరం సునీతకు, విల్‌మోర్‌కు ఆరువారాల పాటు రీహ్యాబిలిటేషన్ ప్రోగ్రామ్ నిర్వహిస్తారని, నడక, కండరాల బలోపేతానికి సంబంధించి శిక్షణ ఇస్తారని, పౌష్టికాహారం ఇస్తారని వైద్యనిపుణులు తెలిపారు.




ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం..

అంతరిక్షంలో ఎక్కువ కాలం ఉంటే అక్కడి భారరహిత వాతావరణం వల్ల వ్యోమగాముల ఎముకల సాంద్రత తగ్గిపోతుంది. వారి కండరాలు క్షీణిస్తాయి. రక్తనాళాలు సంకోచానికి గురవుతాయి. గుండె, మెదడు, రక్తప్రసరణ వ్యవస్థ ప్రభావితమవుతాయి. మెదడులో స్రావాలు పెరిగి.. వినికిడి శక్తి, చూపు మందగిస్తాయి. వ్యోమగాముల మెదడుపై ఒత్తిడి పెరిగి.. 'స్పేస్ ఫ్లైట్ అసోసియేటెడ్ న్యూరో-ఆక్యులార్ సిండ్రోమ్ (శాన్స్)' బారిన పడే ప్రమాదం ఉంటుంది. సగటున నెలకు 1-2% చొప్పున వారి ఎముకల సాంద్రత తగ్గి చాలా బలహీనపడిపోతారు. రక్తప్రసరణ వ్యవస్థ సరిగా పనిచేయక.. వారి రక్తపోటు పెరుగుతుంది. స్పేస్ రేడియేషన్‌కు ఎక్కువగా గురవడం వల్ల దీర్ఘకాలంలో వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుంది. వారు క్యాన్సర్ బారిన, కేంద్ర నాడీ వ్యవస్థకు సంబంధించిన సమస్యల బారిన పడే ముప్పు పెరుగుతుంది.

62 గంటల స్పేస్ వాక్

ఈ తొమ్మిది నెలల కాలంలో సునీత తొమ్మిదిసార్లు (62 గంటలపాటు) స్పేస్ వాక్‌లు నిర్వహించి, ఆ ఘనత సాధించిన మహిళా వ్యోమగామిగా చరిత్ర సృష్టించారు.





అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి సునీతవిలియమ్స్, బుచ్ విల్‌మోర్‌లను తీసుకొస్తున్న స్పేస్‌ఎక్స్ క్యాప్సూల్

కొత్తగా మరో నలుగురు..

డ్రాగన్ క్యాప్సూల్‌లో భూమ్మీదికి తిరిగొచ్చిన నలుగురు వ్యోమగాముల స్థానంలో మరో నలుగురు ఆస్ట్రోనాట్లు.. అన్నే మెక్ క్లెయిన్, నికోల్ అయెర్స్(అమెరికా), టకుయ ఒనిషి (జపాన్), కిరిల్ పెస్కో (రష్యా) ఐఎస్ఎస్‌లో బాధ్యతలు స్వీకరించారు. సాధారణంగా కొత్తగా వచ్చిన సిబ్బంది.. అప్పటికే ఉన్న సిబ్బందితో కలిసి ఐదురోజులు ఐఎస్ఎస్‌లో ఉంటారు. దీన్ని 'హ్యాండోవర్ పీరియడ్' అంటారు.

4500 భూప్రదక్షిణలు!

ఐఎస్ఎస్‌లో 286 రోజులపాటు ఉన్న సునీత, విల్‌మోర్.. ఆ సమయంలో 4,500 భూప్రదక్షిణలు చేశారు.

కుక్కలతో వాకింగ్‌కి వెళ్తా

మామూలుగా మనం ఏదైనా పని మీద వేరే ఊరెళ్తే.. ఇంటికి ఎప్పుడెప్పుడు వెళ్దామా, మనకు ఇష్టమైన పనులు ఏమేం చేద్దామా అనే ఆలోచన వస్తుంది. సునీత, విల్‌మోర్‌కు కూడా అలాంటి ఆలోచనలు ఉన్నాయి. భూమ్మీదికి వచ్చాక.. తన రెండు పెంపుడు శునకాలతో వాహ్యాళికి వెళ్లాలని ఉందని, సముద్రంలో ఈత కొడతానని సునీత విలియమ్స్ చెప్పగా.. తనకు గడ్డిపై నడవాలని, తన కుటుంబంతో కలిసి సమయాన్ని గడపాలని ఉన్నట్టు బుచ్ విల్‌మోర్ వెల్లడించారు.

పునరుత్పాదక విద్యుత్ ఒప్పందాలు సరికాదు: సీపీఎం

అనంతపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పునరుత్పాదక విద్యుత్ ఒప్పందాలు రైతులకు నష్టం చేకూరుస్తాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. సీపీఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మంగళవారం ఆయన అనంతపురం జిల్లాలో పర్యటించారు. తాడిపత్రి మండలం తలారి చెరువు వద్ద ఉన్న ఏపీ జెన్ కో పవర్ ప్లాంట్‌ను పరిశీలించారు. అనంతపురంలో విలేకరులతో మాట్లాడుతూ రెన్యూవబుల్ ఎనర్జీ పేరుతో వేలాది ఎకరాల భూములను ప్రైవేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని, ఇందులో రైతుకు భద్రత కల్పించే చర్యలేవీ లేవని తెలిపారు.

తొక్కిసలాట బాధ్యులను గుర్తించారా?

- ఇంత వరకు ఏం చర్యలు తీసుకున్నారు?
- టీటీడీ ఈవోను ప్రశ్నించిన విచారణ కమిషన్



కమిషన్ ఎదుట విచారణకు హాజరవుతున్న టీటీడీ ఈవో శ్యామలరావు, తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): 'తొక్కిసలాట ఘటనకు బాధ్యులను గుర్తించారా? ఇంతవరకూ ఏం చర్యలు తీసుకున్నారు?' అంటూ టీటీడీ అధికారులను న్యాయ విచారణ కమిషన్ ప్రశ్నించింది. మంగళవారం తిరుపతి కలెక్టరేట్‌లోని న్యాయ విచారణ కమిషన్ కార్యాలయంలో టీటీడీ లా ఆఫీసర్ వరప్రసాద్, ఈవో శ్యామలరావు విచారణకు హాజరయ్యారు. వారిని 55 నిమిషాలపాటు కమిషన్ చైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి ప్రశ్నించారు. బైరాగిపట్టెడలోని టోకెన్ల జారీ కేంద్రం వద్ద భద్రతా వైఫల్యానికి కారణమేమిటని టీటీడీ ఈవోను అడిగారు. ఎలాంటి ఏర్పాట్లు చేశారు? ఎంతమంది సిబ్బందిని నియమించారు? ఎందుకు వైఫల్యం జరిగింది? తదితర వివరాలు నమోదు చేసుకున్నారు. భద్రత కోసం నియమించిన టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ, పోలీసు విభాగాలను ఎలా సమన్వయం చేశారు? ఘటనకు బాధ్యులు ఎవరు? అసలు బాధ్యులను గుర్తించారా? అని ఆరా తీశారు. ఘటన జరిగినప్పటి నుంచి ఇప్పటి దాకా టీటీడీలో ఎంతమందిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. తొక్కిసలాట ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారని అడిగారు. ఉదయం 10.45 గంటల నుంచి 11.40 గంటల వరకూ వారిని విచారించారు. తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు విచారణకు హాజరయ్యారు. ఘటన గురించి కమిషన్ ఆయనను పలు ప్రశ్నలు అడగ్గా, నెలన్నర కిందటే ఎస్పీగా వచ్చానని, సంబంధిత రికార్డులు పరిశీలించేందుకు కొంత వ్యవధి కావాలని కోరారు. ఫైళ్లు పరిశీలించి పూర్తి వివరాలు అందజేస్తానని చెప్పారు. కాగా, ఎస్పీతోపాటు వచ్చిన శాంతిభద్రతల విభాగం అదనపు ఎస్పీ రవి మనోహరాచారి.. కమిషన్ ఎదుట హాజరు కాలేదు.


టీటీడీ అదనపు ఈవోకు రూ.1.23 కోట్ల విరాళాల చెక్కులను అందజేస్తున్న దాతలు

శ్రీవారికి రూ.1.33 కోట్ల విరాళం

తిరుమల, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ట్రస్టులకు మంగళవారం రూ.1.33 కోట్లు విరాళంగా అందింది. కర్ణాటకలోని బళ్లారికి చెందిన శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు రూ.1.23 కోట్లు అందజేశారు. రూ.1.01 కోట్లు ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు, రూ.11.11 లక్షలు ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు, రూ.11.11 లక్షలు ఎస్వీ విద్యాదానం ట్రస్టుకు వినియోగించాలని కోరారు. అలాగే తిరుపతికి చెందిన కేఎస్పీ టాకీస్ చైర్మన్ కేతన్ శివ ప్రీతమ్ కూడా అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు అందజేశారు. ఈమేరకు దాతలు విరాళాల చెక్కులను తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా తిరుమలలో ఒక రోజు అన్నప్రసాద వితరణ

- టీటీడీకి రూ.44 లక్షలు అందజేసిన సీఎం కుటుంబీకులు

తిరుమల, మార్చి 18(ఆంధ్రజ్యోతి): నారా దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 21వ తేదీన (శుక్రవారం) తిరుమలలో ఒక రోజు అన్నప్రసాద వితరణ చేయనున్నారు దీనికయ్యే ఖర్చు రూ.44 లక్షలను ఇప్పటికే సీఎం చంద్రబాబు కుటుంబీకులు టీటీడీకి అందించారు. ఏటా దేవాన్ష్ పుట్టినరోజున తిరుమలలోని వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో ఒకరోజు అన్నప్రసాద వితరణకు అయ్యే ఖర్చును టీటీడీకి విరాళంగా అందజేసి భక్తులకు అన్నప్రసాదాలను వడ్డించడం చంద్రబాబు కుటుంబానికి ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే రూ.44 లక్షల విరాళాన్ని టీటీడీకి అందజేశారు. ఈక్రమంలో సీఎం కుటుంబ సభ్యులతో కలిసి 20వ తేదీ రాత్రి తిరుమల చేరుకుని పద్మావతి అతిథి గృహంలో బస చేస్తారు. 21వ తేదీన దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా ఉదయం 7.55 గంటలకు శ్రీవారిని దర్శించుకుంటారు. ఆ తర్వాత అన్నప్రసాద భవనానికి చేరుకుని అన్నప్రసాద వితరణ చేయనున్నారు. ఈమేరకు టీటీడీ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

తిరుమలలో సాధువుల ధర్నాపై పోలీసులు సీరియస్

- 118 మందిపై కేసులు నమోదు

తిరుమల, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రశాంతమైన తిరుమలలో నిబంధనలకు విరుద్ధంగా సాదువులు ధర్నాకు దిగడంపై పోలీసులు సీరియస్ అయ్యారు. ముందస్తుగా నోటీసులు జారీ చేసినప్పటికీ ఆలయ చట్టాలకు వ్యతిరేకంగా శ్రీవారి ఆలయం ముందు ధర్నా చేసిన 118 మందిపై బీఎన్ఎస్ ప్రివెంట్ అరెస్ట్ సెక్షన్ 151 కింద కేసులు నమోదు చేశారు. అలిపిరిలో ముంతాజ్ హోటల్‌కు కేటాయించిన జీవో నెంబరు 24ను రద్దు చేసి ఆ స్థలాన్ని భక్తుల సౌకర్యార్థం కేటాయించాలనే డిమాండ్‌తో ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానందస్వామి ఆధ్వర్యంలో పలు రాష్ట్రాలకు చెందిన సాధువులు, బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్, ఆయన అనుచరులు సోమవారం శ్రీవారి ఆలయం ముందు ధర్నా చేసిన విషయం తెలిసిందే. ధర్నాలో పాల్గొన్న 118 మందిపై పోలీసులు కేసులు నమోదు చేసి స్టేషన్ బెయిల్‌పై పంపారు. కాగా, భక్తులను భయభ్రాంతులకు గురిచేయడంతోపాటు విధుల్లోని సిబ్బందికి ఆటంకం కలిగించేలా వ్యవహరించే వ్యక్తులపై ఇకపై కఠినమైన చర్యలు తీసుకోవాలని పోలీసులు నిర్ణయించారు. ఆలయ చట్టాలను కఠినంగా అమలుచేయాలని భావిస్తున్నారు. కాగా, ఆదర్శంగా ఉండాల్సిన సాదువులే అల్లర్లు చేస్తే ఎలా? అని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు తిరుమలలో నిరసనకు దిగడం అపచారమని సాధువులకు తెలియదా? అని బీజేపీ నాయకుడు నవీన్‌కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

గుంటూరులో క్రేన్ సంస్థలపై ఐటీ సోదాలు

గుంటూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): క్రేన్ గ్రూపు సంస్థలు, వాటి యజమానుల ఇళ్లల్లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. మంగళవారం సాయంత్రం నుంచి గుంటూరు నగరంలోని సంపత్‌నగర్, ఆర్ అగ్రహారం, అంకిరెడ్డిపాలెం సమీపంలోని ఫ్యాక్టరీ తదితర ప్రదేశాల్లో ఏకకాలంలో ఐటీ అధికారులు సోదాలు చేయడం ప్రారంభించారు. సోదాల సందర్భంగా ఎవ్వరినీ లోనికి అనుమతించలేదు. అలానే సిబ్బందిని బయటకు వెళ్లనీయకుండా కట్టడి చేశారు. ఈ సందర్భంగా కీలకమైన డాక్యుమెంట్లు, పెన్‌డ్రైవ్‌లు, హార్డ్ డిస్క్‌లు, ల్యాప్‌టాప్‌లను ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది.

వైవీ తల్లికి నివాళులర్పించిన జగన్


తల్లి విజయమ్మతో కలిసి పిచ్చమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న జగన్

మేదరమెట్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి తల్లి పిచ్చమ్మ (85)కు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. అలాగే వైఎస్ విజయలక్ష్మి కూడా ఆమెకు నివాళులర్పించారు. పిచ్చమ్మ అనారోగ్యంతో సోమవారం ఒంగోలులో మృతి చెందిన విషయం విదితమే. ఆమె భౌతికకాయాన్ని స్వగ్రామమైన బాపట్ల జిల్లా మేదరమెట్లకు తరలించారు. మేదరమెట్లలో పిచ్చమ్మకు నివాళులర్పించిన జగన్.. వైవీ సుబ్బారెడ్డిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పోలీసులపై వైసీపీ కార్యకర్తల దాడి

- ఆర్ఎస్ఐతో పాటు ముగ్గురు కానిస్టేబుళ్లకు గాయాలు

పెనుగంచిప్రోలు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని శ్రీ తిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా అమ్మవారి పుట్టింటి పసుపు కుంకుమ ర్యాలీలో వైసీపీ కార్యకర్తల దాడిలో నలుగురు పోలీసులకు గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకొని పెనుగంచిప్రోలు టీడీపీ, వైసీపీ ఆధ్వర్యంలో వేర్వేరుగా బండ్లు కట్టారు. ఊరేగింపుగా పోలీస్‌స్టేషన్ సెంటర్‌కు మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు చేరుకున్నారు. తమ బండిని ఆపి టీడీపీ బండిని ముందుకు పంపారన్న అక్కసుతో పోలీసులపై వైసీపీకి చెందిన కొందరు యువకులు రాళ్లు, వాటర్ ప్యాకెట్లను విచక్షణా రహితంగా విసిరి దాడి చేశారు. ఈ దాడిలో ఆర్ఎస్సై లక్ష్మీనారాయణ మోచేతికి, విజయవాడకు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఏసోబు, కానిస్టేబుల్ ఎస్.మణికంఠ తలకు గాయాలు కాగా, పెనుగంచిప్రోలు పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ జి.రమేష్‌కు గాయాలయ్యాయి. వారికి నందిగామ ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

రక్తమోడిన గాజా

కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగింపు గురించి చర్చించుకోబోతున్న తరుణంలో, ఇజ్రాయెల్ మంగళవారం తెల్లవారుజామున గాజామీద విరుచుకుపడి నాలుగువందలమందిని ఊచకోతకోసింది. కనీసం ఆరేడు వందలమంది తీవ్రంగా గాయపడినందున మృతుల సంఖ్య మరింత హెచ్చడం ఖాయం. ఖాన్‌యూనిస్, రఫా, ఉత్తరగాజా, గాజాసిటీ ఇత్యాది గాజాపట్టీలోని పలుప్రాంతాలమీద ఇజ్రాయెల్ విమానాలు బాంబుల వర్షం కురిపించాయి. ఇంతటి దుర్మార్గాన్ని కలలో కూడా ఊహించని కారణంగా పెద్దసంఖ్యలో స్త్రీలు, పిల్లలతో సహా వందలాదిమంది ఇజ్రాయెల్ చేతికి ఇలా సునాయాసంగా చిక్కి బలైపోయారు. పదిహేడు నెలల యుద్ధంలో ఒకేరోజున అత్యధికసంఖ్యలో జనహననం జరిగిన సందర్భం బహుశా ఇదే కావచ్చు.

యుద్ధం జరుగుతున్నప్పుడు వేరు. పరిగెత్తి ప్రాణాలు కాపాడుకోగల అవకాశమైనా జనానికి మిగిలివుంటుంది. కానీ, యుద్ధం ఆగి, కాల్పుల విరమణ అమలు జరుగుతున్నప్పుడు ఇజ్రాయెల్ ఈ పాపానికి ఒడిగట్టింది. ఇంతకుముందు సురక్షితప్రాంతాలకు తరలిపోయిన పాలస్తీనియన్లు సైతం ఎంతో నమ్మకంగా తిరిగివచ్చినందున, పెద్దసంఖ్యలో ఈ మారణకాండకు బలైపోయారు. కాల్పుల విరమణ కాలంలో గాజాకు తిరిగివచ్చిన పాలస్తీనియన్ల సంఖ్య ఓ ఐదులక్షలవరకూ ఉంటుంది. తమ ఇళ్ళు నేలమట్టమైన చోటే టెంట్లు వేసుకొని వారంతా ఉంటున్నారు. రాత్రివేళ దాడికావడంతో నిద్రలో ఉన్నవారు సులువుగా దొరికిపోయారు, శిథిలాల్లోనే నిక్షిప్తమైపోయారు. ఒకేమారు గాజా నలుదిక్కుల్లోనూ ఈ దాడి జరిగింది. ఎఫ్–16, ఎఫ్–35వంటి యుద్ధవిమానాలతో పాటు, హెలికాప్టర్లు, డ్రోన్లు కూడా ఆకాశంనుంచి నిప్పులు కురిపిస్తుంటే, నేలమీద ట్యాంకులు విరుచుకుపడ్డాయి. పరుగులు తీస్తున్నవారిని కూడా ఇజ్రాయెల్ సైనికులు కాల్చిపారేశారు. ఇప్పటికే, ఆస్పత్రులన్నీ ధ్వంసమై, మిగిలిన ఆ ఒకటీరెండూ ఆస్పత్రుల్లో కూడా మందులూ, వైద్యులు లేని స్థితిలో ఇప్పుడు జరిగిన భయానకమైన దాడి మరింత తీవ్రమైన సంక్షోభాన్ని సృష్టించింది. గాయపడిన ప్రతీవ్యక్తీ చికిత్స అందక కచ్చితంగా కన్నుమూయాల్సిన పరిస్థితులున్నాయి. బందీలుగా ఉన్నవారందరినీ వదిలేయమని అమెరికా అధ్యక్షుడు హమాస్‌ను ఆదేశిస్తే, సదరు సంస్థ ఆ మాట విననందుకు శిక్షగా ఈ ఊచకోత జరిగిందట. ట్రంప్‌కు చెప్పే చేశామనో, ఇలా చేయమని ఆయనే చెప్పారనో ఇజ్రాయెల్ అధినేతలు అంటున్నారు. అవును ఈ మారణకాండకు మేమే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాం అని అమెరికా గర్వంగా చెప్పుకుంటోంది.

కాల్పుల విరమణ కాలంలోనూ ఇజ్రాయెల్ చిన్నాచితకాదాడులు కొనసాగిస్తూనే ఉంది, మందులూ ఆహారసరఫరాలను అడ్డుతూనే ఉంది. అయినా, హమాస్ మెత్తబడిన కారణంగా బందీల పరస్పర అప్పగింతలు సజావుగానే సాగుతున్నాయి. ఒప్పందాన్ని ఏ క్షణాన్నయినా కాలదన్ని, మళ్ళీ యుద్ధానికి కాలుదువ్వే హక్కు తనకు ఉన్నదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ఆదినుంచీ వాదిస్తున్నారు. ఆరువారాల క్రితం బలహీనంగా ఉన్న నెతన్యాహూ ఇప్పుడు మళ్ళీ అమెరికా ఆయుధాలను పోగేసుకొని బలపడ్డాడని, అస్త్రాలకు పదునుపెట్టడం, సైనికులకు విశ్రాంతినివ్వడం, యుద్ధవిమానాలకు రిపేర్లు చేసుకోవడం వంటివి పూర్తికావడంతోనే విరుచుపడ్డారని అంటారు. కాల్పులు నిలిచినకాలంలో ఎంతోమంది హమాస్ కీలకనాయకులను ఇజ్రాయెల్ గుర్తించడంతో, ఇప్పుడు పెద్దసంఖ్యలో వారిని మట్టుబెట్టగలిగింది. ఒప్పందం రెండోదశలోకి ప్రవేశిస్తే, గాజానుంచి ఇజ్రాయెల్ తన సైన్యాన్ని ఉపసంహరించుకోవాల్సి వస్తుంది. అంటే, గాజాను ఏలుకోమని మళ్ళీ హమాస్‌కు ఇచ్చేయడమే. అటువంటి సూచనలు ఏ మాత్రం కనిపించినా, నెతన్యాహూ మిత్రపక్షాలు ఆయనకు మద్దతు ఉపసంహరించుకుంటాయి. ఇప్పటికే ఆయనకు దూరం జరిగినవారు ఉన్నందున రాబోయే రోజుల్లో ఆయన అవిశ్వాసపరీక్ష ఎదుర్కోవాల్సి రావచ్చు కూడా. కోర్టులో అవినీతికేసులు కొలిక్కివచ్చాయనీ, తప్పించుకోవడానికే మళ్ళీ ఈ యుద్ధం రాజేశాడని కొందరు అంటారు. మొత్తానికి మంగళవారం ఊచకోతతో పరిస్థితి మొదటికివచ్చింది. హమాస్–ఇజ్రాయెల్ మధ్య రెండునెలల కాల్పుల విరమణ ఒప్పందం స్థానంలో మరింత ఉద్రిక్తవాతావరణం ఏర్పడింది. హమాస్ దగ్గర ఇంకా 59మంది ఇజ్రాయెలీ పౌరులు బందీలుగా ఉన్నారని లెక్క. కానీ, వారిలో అత్యధికం ఇప్పటికే మరణించారన్న సమాచారం ఉండటంతో ఇజ్రాయెల్ ఈ దూకుడు నిర్ణయం తీసుకుందని అంటారు. కానీ, తమవారిని రక్షించుకొనే పేరిట గాజాలో అది ముున్ముందు సాగించబోయే విధ్వంసం ఊహకు అందనిది. హమాస్‌ను నిర్మూలించడమనే ముసుగులో తిరిగి తమ ఇళ్ళకు చేరుకుంటున్న పాలస్తీనియన్లను తరిమికొట్టే స్వామికార్యాన్ని కూడా నెతన్యాహూ నెరవేర్చబోతున్నారు.

సామాజిక వికాస కార్యక్రమాలను జకాత్ ద్వారా చేయడం పెద్ద సమస్య ఏమి కాకున్నా ఎందుకో ముస్లిం సమాజం మిన్నకుండిపోతోంది. ముస్లిం సామాజికులకు ఈ దిశగా నేతృత్వం వహించే ఆమోదయోగ్యమైన నాయకుడు ఒక్కడు కూడ లేడంటే ఆశ్చర్యం కలుగుతుంది. అటు కర్ణాటక సరిహద్దులోని హిందూపురం మొదలు ఇటు మహారాష్ట్ర సరిహద్దులోని బోధన్ వరకు తెలుగునాట ముస్లిం సమాజం దీనిపై ఆత్మ విమర్శ చేసుకోవాలి.

భయ్యా, దానశీలత మరిచావా?

సకల మతాల ధార్మిక సూత్రాలలో దానం, కరుణ ప్రధానంగా ఉంటాయి. కనుకనే, సర్వమతాల సారాంశం మానవ సేవే మాధవ సేవ. మనిషి దైవ సన్నిధికి వెళ్లే మార్గంలో దానం అనేది అత్యంత కీలక వారధి. భక్తి ప్రవచనాలు ఎన్ని పలికినా, దైవ చింతనలో ఎంత గడిపినా మనిషి దానం విషయానికి వచ్చే సరికి సహజంగా వెనుకంజ వేస్తున్నాడు!

ఇస్లాం జీవన విధానానికి మూలం ఖురాన్. ఈ పవిత్ర గ్రంథం రంజాన్ మాసంలో అవతరించిందని ముస్లింల విశ్వాసం. ప్రపంచవ్యాప్తంగా ముస్లిం సమాజాలు రంజాన్ మాసాన్ని భక్తి శ్రద్ధలతో పాటిస్తాయి. ఇక, ఇస్లాం అధికారిక మతంగా ఉన్న గల్ఫ్ దేశాలు అన్నిటిలోనూ ఈ పవిత్ర మాసంలో విశ్వాసుల ఆర్భాటం ఇతర ముస్లిం దేశాలలో కంటే ఎక్కువగా ఉంటుంది.

గల్ఫ్ లేఖ

ఇస్లాంలో ఐదు మౌలిక, ఆదేశిక సూత్రాలలో ఒకటి: సియాం (ఉపవాసం). రంజాన్ నెలలో ముస్లింలు అందరూ ఈ ధార్మిక నియమాన్ని పాటిస్తారు. తమ ఉపవాస దీక్ష, దానాల ద్వారా దైవ సంకల్పం బలోపేతం కావాలనేది రంజాన్ మాసం అందించే సందేశం. ఈ పవిత్ర మాసంలో వీలయినంత ఎక్కువ సమయాన్ని దైవ సన్నిధిలోనూ, ఖురాన్ పఠనంలోనూ గడపాలని ఇస్లామిక్ పండితులు చెబుతుంటారు. ఈ కారణాన సంవత్సరంలోని మిగిలిన నెలల్లో రోజా నమాజు చేయనివారు కూడ ఈ నెలలో క్రమం తప్పకుండా నమాజు చేయడానికి ప్రయత్నిస్తారు. ఐదు ఆదేశిక సూత్రాలలో సియాంతో పాటు జకాత్ (నిర్బంధ దానం) కూడ ముఖ్యమైనది. ముస్లింలకు నమాజు, ఉపవాసం ఎంత ముఖ్యమో అదే విధంగా విధిగా దానం చేయడం కూడ అంతే ముఖ్యం. జకాత్ అనేది ఒక రకమైన ఖచ్చితమైన అల్లాహ్ పన్ను పేదలకు చెల్లించే విధానం. ఈ నియమవ్రతం నుంచి అర్హులకు మినహాయింపు లేదు. దానం అనేది ఐచ్ఛికం కానీ జకాత్ ఖచ్చితం, తప్పని సరి. ప్రతి ముస్లిం తన వద్ద నిల్వ ఉన్న వార్షిక ఆదాయం నుండి రెండున్నర శాతం విధిగా పేదలకు తప్పని సరిగా చెల్లించాలనేదే జకాత్ ధార్మిక నియమం. ఉదాహరణకు లక్ష రూపాయలు ఉన్న వ్యక్తి విధిగా రెండున్నర వేల రూపాయలు పేదలకు దానం ఇవ్వాలనేది తప్పనిసరి ఇస్లామిక్ నిబంధన. నమాజు, ఉపవాసం పట్ల ముందుకు వచ్చే



భారతీయ ముస్లిం సమాజం జకాత్ ఇవ్వాల్సివచ్చే సరికి వెనుకంజ వేస్తోంది. నమాజుతో పాటు జకాత్ చెల్లింపు బాధ్యతను అల్లాహ్ ఖురాన్ వివరించింది. హదీస్, ఖురాన్ ప్రవచనాలను అత్యంత భక్తి శ్రద్ధలతో వినేవారు, ముస్లిం సమాజం వెనుకబాటుతనం గురించి భావోద్వేగ ప్రసంగాలకు లోనయ్యేవారు కూడ జకాత్ చెల్లింపు వచ్చేసరికి ఆసక్తి చూపరు. మత బోధకులు (ఖతీబ్) జకాత్ దానం ఇవ్వాల్సిన అవశ్యకతను నొక్కి చెబుతున్నారు. కానీ ఆశించిన స్థాయిలో సరైన నిష్పత్తి ప్రకారం జకాత్ ఇవ్వడం లేదనే ఒక అభిప్రాయం చాలామందిలో నెలకొని ఉంది. జకాత్ డబ్బును ప్రణాళికా బద్ధంగా వెచ్చిస్తే ముస్లిం సమాజంలో పేదరికం అంటూ ఏమి ఉండదనేది అనేక మంది అభిప్రాయం. జకాత్‌తో పాటు సదఖా, వక్ఫ్ అనే మరో రెండు రకాల దానాలు కూడ ఇస్లాంలో ఉంటాయి కానీ జకాత్ తప్పనిసరి.

జకాత్ దానం ద్వారా తమ సామాజిక వర్గ అభ్యున్నతికి సవాలక్ష అవకాశాలు ఉన్నా తెలుగునాటతో సహా సమస్త భారతదేశంలోనూ అటువంటి కృషి జరుగుతున్న ఉదంతం ఒక్కటి కూడా లేకపోవడం విచారకరం. జకాత్ దానం ద్వారా విద్య, వైద్య రంగాలలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టవచ్చు. ముస్లిం సమాజంలోని పేదలకు ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యా సంస్థ గానీ ఆసుపత్రి గానీ తెలుగునాట ఒక్కటి కూడా లేదు. కనీసం నవాబుల నగరమైన హైదరాబాద్‌లో విద్యావకాశాల కొరకు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ముస్లిం బాలబాలికలకు నీడ నివ్వడానికి విద్యార్థుల వసతి గృహం ఒక్కటి కూడా లేదంటే దుస్థితిని ఊహించుకోవచ్చు.

రంజాన్ మాసం సందర్భంగా ముస్లింల ఇళ్ళల్లో, మసీదులలో జకాత్ ఇవ్వమని వచ్చే అసంఖ్యాకులలో ఏ ఒక్కరు కూడ ఒక పాఠశాల లేదా వైద్యశాల నిర్మాణం కోసం రాకపోవడానికి కారణం ఆ దిశగా సమాజం అడుగువేయకపోవడమే కాదూ?

సామాజిక వికాస కార్యక్రమాలను జకాత్ ద్వారా చేయడం పెద్ద సమస్య ఏమి కాకున్నా ఎందుకో ముస్లిం సమాజం మిన్నకుండిపోతోంది. హైదరాబాద్ నగరంలోని ఒక్క టోలీచౌకీ ప్రాంతానికి చెందిన ప్రవాసులు నిబద్ధతగా జకాత్ ఇస్తే అద్భుతాలు సృష్టించవచ్చు. ముస్లిం సామాజికులకు ఈ దిశగా నేతృత్వం వహించే ఆమోదయోగ్యమైన నాయకుడు ఒక్కడు కూడ లేడంటే ఆశ్చర్యం కలుగుతుంది. అటు కర్ణాటక సరిహద్దులోని హిందూపురం మొదలు ఇటు మహారాష్ట్ర సరిహద్దులోని బోధన్ వరకు తెలుగునాట ముస్లిం సమాజం దీనిపై ఆత్మ విమర్శ చేసుకోవాలి. తమ వెనుకబాటుతనానికి పాలకులే కారణమంటూ నిందించడం వల్ల ప్రయోజనమేముంది? వివక్షకు గురవుతున్న బాధితులుగా చెప్పుకొంటూ వాపోవడం కంటే తమ పరిధిలో తామెంత వరకు తమ వారికి మేలు చేయగలుగుతామనే కనీస కింకర్తవ్యాన్ని ముస్లింలు విస్మరిస్తున్నారు. ప్రార్థనలతో పాటు దానానికి కూడ ముందుకు వస్తేనే ఆధ్యాత్మికతకు పరిపూర్ణత ఉంటుంది.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

గోల్వాల్కర్ ఆశయం నెరవేరేనా?



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

'గురూజీ గోల్వాల్కర్ భారతదేశం ఏకీకృత వ్యవస్థ కావాలని ఆకాంక్షించారు. సమాఖ్య రాజకీయ వ్యవస్థ వల్ల భారతదేశం విచ్ఛిన్నం కావచ్చని ఆయన నిజంగానే భయపడ్డారు. అంతర్గత విభేదాలు, చిన్నచిన్న తగాదాల మూలంగా ఒకటి, రెండు సందర్భాల్లో తప్ప దేశం వేలాది ఏళ్లపాటు బాహ్య దురాక్రమణలను ఎదుర్కోలేకపోయింది. ఈ కాలంలో దేశ ఐక్యత ప్రమాదంలో పడింది. భాష అనేది ఒక బలమైన భావోద్వేగమైన అంశం. స్వాతంత్ర్యం తర్వాత తమిళ ప్రాంతాల్లో ప్రత్యేక ద్రవిడస్థాన్ కోసం ఉద్యమాలు జరిగాయి. భాషా రాష్ట్రాలు ప్రాంతీయ దురభిమానాలకు దారితీస్తాయని, దాని వల్ల జాతీయ ఐక్యత, సమగ్రతకు ముప్పు ఏర్పడుతుందని గోల్వాల్కర్ భావించారు. అయితే హిందీ అనేది ఒక అనుసంధాన భాషయే కాని జాతీయ భాష కాదని, బెంగాలీ, తమిళం, కన్నడ, తెలుగు, మలయాళీ మొదలైనవన్నీ జాతీయ భాషలేనని ఆయన అభిప్రాయపడ్డారు. భారతదేశం ఒక దేశం కాదని, వివిధ భాషల ఆధారంగా ఉన్న జాతీయతల సమ్మేళనం అనే హానికరమైన సిద్ధాంతాన్ని కమ్యూనిస్టులు సమర్థించారు. స్టాలిన్ మొదట ప్రతిపాదించిన ఈ సిద్ధాంతం భారత జాతీయతకు ప్రమాదం కలిగించే అవకాశం ఉన్నది.' అని ఆర్ఎస్ఎస్ మేధావి ఎస్‌వి శేషగిరిరావు 'ఒక సిద్ధాంతంతో నా ప్రయాణం' (మై జర్నీ విత్ ఆన్ ఐడియాలజీ) అన్న పుస్తకంలో రాశారు.


శేషగిరిరావు చెప్పిన విషయాలు భారతీయ జనతా పార్టీ ఆలోచనా విధానాన్ని ప్రతిఫలింపచేస్తాయి. గత శతాబ్దపు తొలి దశాబ్దంలోనే హిందూ జాతీయవాదానికి బీజాలు పడ్డాయనడంలో సందేహం లేదు. వినాయక్ దామోదర్ సావర్కార్ (1883–1966), కేశవ్ బలిరాం హెగ్డేవార్ (1889–1940), మాధవ్ సదాశివ్ గోల్వాల్కర్ (1906–1973) అనే ముగ్గురు సిద్ధాంతకర్తల ఆలోచనా విధానమే బీజేపీకి పునాది అని వేరే చెప్పనక్కర్లేదు. సావర్కార్ రచించిన ఎసెన్షియల్స్ ఆఫ్ హిందూత్వ, గోల్వాల్కర్ రచించిన వి ఆర్ అవర్ నేషన్ హుడ్, బంచ్ ఆఫ్ థాట్స్ అనే గ్రంథాల్లో చెప్పిన విషయాలే బీజేపీ, దాని అనుబంధ సంఘాలకు చెందిన లక్షలాది కార్యకర్తలను ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితం చేశాయి.

కులాల ప్రాతిపదికన విడిపోయిన హిందువులు కలిసికట్టుగా ఒకే జాతిగా ముందుకు రావాలని తమ ప్రాచీన జన్మభూమిని బయటివారి కబంధ హస్తాలనుంచి విముక్తం చేయాలని సావర్కర్ తన రచనలో పేర్కొన్నారు. మరోవైపు ఒకేరకమైన సంప్రదాయాలు, ఉమ్మడి భాష, దేశ పూర్వ వైభవం, చరిత్రకు సంబంధించి ఒకేరకమైన స్మృతుల గురించి గోల్వాల్కర్ తన రచనల్లో ఉల్లేఖించారు. ఒకే మూలానికి చెందిన ఒకే సంస్కృతి క్రింద మనుగడ సాధించే జనాభా గురించి ఆయన మాట్లాడారు. ఇటాలియన్ జాతీయవాదనాయకుడు గియుసెప్పె మజిని ఆయనను ప్రభావితం చేశారు. మరాఠీలో మజిని జీవిత చరిత్రను కూడా గోల్వాల్కర్ రచించారు.

గత పది సంవత్సరాలుగా నరేంద్రమోదీ ప్రభుత్వం మాట్లాడుతున్న ఒకే దేశం–ఒకే ఎన్నికలు, ఒకే దేశం–ఒకే గుర్తింపు కార్డు, ఒకే దేశం–ఒకే పన్ను, ఒకే దేశం–ఒకే పౌర స్మృతి లాంటి పదాల వెనుక ఒక ఆలోచనాధార ఉన్నది. అన్ని రాష్ట్రాల్లో ఒకే పార్టీ అధికారంలో ఉండాలనే ఉద్దేశంతో డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటు చేయాలని చెప్పినా, మోదీయే అంతటా సర్వాంతర్యామిగా కనపడ్డా, కులగణనను వ్యతిరేకించినా, ఆంధ్రప్రదేశ్, బిహార్ వంటి రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను కూటమిలో కలుపుకున్నా ఈ ఆలోచనా విధానంలో భాగమే. రాష్ట్రాల అధికారాల్లో జోక్యం చేసుకుంటూ చట్టాలు చేయడం వెనుక ఉద్దేశం కూడా అదే. అయోధ్యలో రామమందిరాన్ని నిర్మించినా, ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా నిర్వహించినా, కాశీ–తమిళ సంగమం అంటూ కార్యక్రమాలను ఏర్పాటు చేసినా ఒకే ఒక సంస్కృతి ప్రవాహంలో భారతీయులను ఏకం చేయాలనే ఆలోచన తప్ప మరేమీ లేదు. మంగళవారం నాడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ లోక్‌సభలో ప్రకటన చేస్తూ మహాకుంభ్ కేవలం మతపరమైన సమ్మేళనమే కాదని, సమైక్యత, అభివృద్ధి, ఆధ్యాత్మిక జాగృతి దిశగా భారతదేశ ప్రయాణం అన్నారు. మహాకుంభ్ మన జాతీయ చేతన ఎంత గొప్పగా జాగృతం అయిందో స్పష్టం అయిందని ఆయన అన్నారు.

అయితే చర్చనీయాంశమైన విషయం ఏమంటే దాదాపు వంద సంవత్సరాల సైద్ధాంతిక భూమిక ఉన్నా, పది సంవత్సరాలకు పైగా మోదీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్నా దేశాన్నంతటినీ ఒకే గొడుగు క్రిందకు తీసుకురావడంలోను, ప్రజలందర్నీ ఒకే ఆలోచనా విధానంలో భాగస్వాములను చేయడంలోను బీజేపీ, దాని అనుబంధ సంస్థలు విజయవంతమయ్యాయా అన్న విషయం చర్చించాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలోనే కొన్ని దక్షిణాది రాష్ట్రాల నుంచి, ముఖ్యంగా తమిళనాడు నుంచి వస్తున్న ప్రతిఘటనలను చూడాల్సి ఉన్నది. హిందీ భాష , నియోజకవర్గాల పునర్విభజన, నిధుల కేటాయింపులో అన్యాయం లాంటి అంశాలను ఈ రాష్ట్రాలు లేవనెత్తుతున్నాయంటే దానికీ ఒక సైద్ధాంతిక ప్రాతిపదిక ఉన్నదని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

నిజానికి కాంగ్రెస్ కూడా తొలుత దేశ వ్యాప్తంగా హిందీని అమలు చేసేందుకు ప్రయత్నించింది. గాంధీ హిందీ భాషా వ్యాప్తి ద్వారా దేశాన్ని స్వాతంత్ర్య సమరం దిశగా నడిపేందుకు ప్రయత్నించారు. తమిళనాడులో స్వాతంత్ర్యానికి పూర్వమే హిందీ వ్యతిరేక ఆందోళనలు జరిగాయి. హిందీని ఇంగ్లీషు స్థానంలో దేశ జాతీయ భాషగా నిర్ణయిస్తూ హోంమంత్రి హోదాలో గుల్జారీలాల్ నందా సర్క్యులర్ జారీ చేసినప్పుడే హిందీ మాట్లాడని రాష్ట్రాల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆ తర్వాత హోంమంత్రి గోవింద వల్లభ్ పంత్ నేతృత్వంలో ఉభయ సభలకు చెందిన 35 మంది సభ్యులతో కూడిన పార్లమెంటరీ కమిటీ కూడా హిందీని ప్రధాన భాషగా నిర్ణయించినప్పుడు కూడా తీవ్ర వ్యతిరేకత బయలుదేరింది. హిందీని బలవంతంగా రుద్దాలని ప్రయత్నించడం వల్ల హిందీకే నష్టమని రాజ్యాంగ అసెంబ్లీ సభ్యుడైన కెఎం మున్షీ లాంటి వారు కూడా అభిప్రాయపడ్డారు. 1965లో హిందీ వ్యతిరేక ఆందోళనలో తమిళనాడులో దాదాపు 70 మందికి పైగా మరణించారు. హిందీయేతర రాష్ట్రాలు కోరుకున్నంతవరకూ ఇంగ్లీషు అధికార భాషగా కొనసాగుతుందని అప్పటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి హామీ ఇవ్వాల్సి వచ్చింది. భాషపై జరిపిన ఆందోళన



దక్షిణాది రాష్ట్రాలలో బీజేపీ సంపూర్ణంగా విస్తరించాలంటే కేవలం కుంభమేళా, రామమందిరం వంటి భావోద్వేగాలు సరిపోవు. నియోజకవర్గాల పునర్విభజన, నిధుల కేటాయింపు విషయంలో ఉధృతమవుతున్న ఆందోళనలకు కూడా జవాబివ్వాల్సి ఉంటుంది.

మూలంగానే డిఎంకె తమిళనాడులో అధికారంలోకి వచ్చింది. ఈ రాజకీయ నేపథ్యం తెలుసు కనుకే డిఎంకె అధినేత ముఖ్యమంత్రి స్టాలిన్ అసెంబ్లీ ఎన్నికలు ఏడాది ఉండగానే జాతీయ విద్యవిధానం ద్వారా హిందీని దొడ్డిదారిన ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ఆందోళన మొదలుపెట్టారు.

అయితే కాంగ్రెస్ హిందీని బలవంతంగా అమలు చేసే విధానాన్ని వెనక్కు తీసుకున్నా, బీజేపీ తాను హిందీని బలవంతంగా రుద్దడం లేదని చెబుతున్నా హిందీ భాష క్రమంగా అంతటా వ్యాపిస్తోంది. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా హిందీ ఆమోదయోగ్యత పెంచేందుకు నిరంతరం విస్తృత ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి హిందీ సినిమాలు, పాటలు, మహాభారత్, రామాయణ్‌తో పాటు హిందీ సీరియళ్లు హిందీకి ఆమోదయోగ్యత పెంచాయి. అనేకమంది దక్షిణాది ప్రజలు ఢిల్లీకి వచ్చి హిందీ రానందుకు తొలుత బాధపడినప్పటికీ వారు క్రమంగా హిందీలో పట్టు సంపాదించిన సందర్భాలున్నాయి. తనకు హిందీ, ఇంగ్లీషు రానందువల్లే ప్రధానమంత్రి కాలేదని ఒకప్పుడు కామరాజ్ వాపోయారు. కాని దక్షిణాదినేతయినా పివి నరసింహారావు చక్కటి హిందీలో ప్రసంగించేవారు. హిందీ రాకపోయినప్పటికీ ప్రధాని దేవెగౌడ కన్నడంలో హిందీ పదాలు రాసుకుని మాట్లాడేవారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా స్వచ్ఛమైన హిందీలో తప్ప మరో భాషలో మాట్లాడలేకపోవడం పట్ల ఇబ్బందిపడినప్పటికీ ఎంపీలకు ఆయన భాష అలవాటైపోయింది. కాంగ్రెస్ పార్టీలో ఇంగ్లీషులో మాట్లాడే అధికార ప్రతినిధులు ఉన్నప్పటికీ బీజేపీలో అలాంటి అధికార ప్రతినిధులు పెద్దగా లేకపోయినా దక్షిణాది విలేఖరులు సర్దుకుపోతున్నారు. ఈ పరిస్థితుల్లో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ హిందీని వ్యతిరేకించడం, 1968లో అన్నాదురై ప్రభుత్వం ప్రవేశపెట్టిన ద్విభాషా విధానానికి ఇప్పుడు కూడా కట్టుబడి ఉంటానని చెప్పడం, కేవలం తమిళ, ఇంగ్లీషు భాషలు తప్ప హిందీ అక్కర్లేదని ప్రకటించడం వల్ల రాజకీయంగా ఎంత మేరకు ప్రయోజనం సాధించగలరా అన్న చర్చ జరుగుతోంది. తమిళనాడులో అన్నాడిఎంకె కూడా స్టాలిన్‌ను సమర్థించక తప్పని పరిస్థితి ఏర్పడింది.

కాని ఇది కేవలం భాష పట్ల వ్యతిరేకత కాదని, బీజేపీ భావజాలం విస్తరణ పట్ల వ్యతిరేకత అన్న విషయం స్పష్టంగా అర్థమవుతూనే ఉన్నది. అందుకే భాషతో పాటు నియోజకవర్గాల పునర్విభజన వంటి అంశాలను కూడా కొన్ని దక్షిణాది పార్టీలు లేవనెత్తుతున్నాయి. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగబోతోందని, నిధులు, పన్నుల పంపిణీలోనూ, ప్రాజెక్టుల కేటాయింపులోనూ దక్షిణాది రాష్ట్రాల పట్ల వివక్ష ప్రదర్శిస్తున్నారని ఈ పార్టీలు విమర్శిస్తున్నాయి. ఆర్థికంగా పనితీరు ప్రదర్శించిన రాష్ట్రాలకు నష్టం కలిగించే విధంగా కేంద్ర ప్రభుత్వ విధానాలను రూపొందించారని తమిళనాడు, తెలంగాణ, కేరళతో పాటు పంజాబ్ రాష్ట్రాల ఆర్థిక మంత్రులు విమర్శించారు. ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకంటే ఎక్కువగా ఉత్తరప్రదేశ్‌కు నిధులు లభించిన విషయాన్ని వారు ఎత్తిచూపుతున్నారు.

ఈ నేపథ్యంలో బీజేపీ రాజకీయంగా విస్తరించాలంటే కేవలం కుంభమేళా, రామమందిరం వంటి భావోద్వేగాలు సరిపోవు. హోలీ నాడు ముస్లింలు ఇళ్లకే పరిమితం కావాలని బిహార్‌లో ఒక బీజేపీ ఎమ్మెల్యే పిలుపిచ్చారు. తాము అధికారంలోకి వస్తే ముస్లిం ఎమ్మెల్యేలనందర్నీ బయటకు గెంటేస్తామని బీజేపీ నేత సువేందు అధికారి అన్నారు. అస్సాంలో పది సంవత్సరాలుగా బీజేపీ ప్రభుత్వం ఉన్నా ముఖ్యమంత్రి హేమంత బిశ్వాస్ శర్మ మదర్సాల మూసివేత వంటి ముస్లిం వ్యతిరేక అంశాలను ప్రస్తావిస్తూ ప్రచారంలో ఉంటున్నారు. అయితే దక్షిణాది రాష్ట్రాల్లో విస్తరించి గోల్వాల్కర్ ఆశించిన లక్ష్యం నెరవేరాలంటే ఇలాంటి ప్రచారాలు సరిపోవు. నియోజకవర్గాల పునర్విభజన, నిధుల కేటాయింపు విషయంలో రేగుతున్న ఆందోళనలకు కూడా జవాబివ్వాల్సి ఉంటుంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

నాటి నల్ల చట్టాల బదులు నేటి మార్కెటింగ్ చట్టం!

కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ జూన్ 25, 2024న వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ వ్యవసాయ మార్కెట్ పాలసీ ముసాయిదాను రూపొందించడానికి ముసాయిదా కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి ఛైర్మన్‌గా కేంద్ర వ్యవసాయ అదనపు కార్యదర్శి ఫైజ్ అహ్మద్ కిద్వాయిని నియమించింది. మంత్రిత్వశాఖ నియమించిన కమిటీ ముసాయిదా మార్కెటింగ్ ఫ్రేమ్ వర్క్‌ను ప్రతిపాదించినట్లు నవంబర్ 25, 2024న మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ప్రజల అభిప్రాయాలు, సూచనల కోసం మంత్రిత్వ శాఖ ఈ ముసాయిదాను బహిరంగంగా విడుదల చేసింది.

దేశవ్యాప్తంగా వ్యవసాయ ఉత్పత్తులపై సార్వత్రిక పన్ను రైతులకు అధిక ఆదాయాన్ని పొందటానికి తోడ్పడుతుందని కమిటీ చెప్పింది. ప్రస్తుత ప్రభుత్వ మార్కెట్ యార్డ్ స్థానంలో వ్యవసాయ మార్కెటింగ్ మెకానిజం కొత్త ఫ్రేమ్‌వర్క్‌ను కమిటీ సూచించింది. పెద్ద మొత్తంలో నిల్వ చేయడం, పెద్ద ప్రైవేట్ పార్టీల ద్వారా నేరుగా కొనుగోలు చేయడంపై చట్టాలు చేస్తూ, కేంద్ర ప్రభుత్వం నేరుగా పన్నులు వసూలు చేసేందుకు జీఎస్టీ కమిటీ తరహాలో రాష్ట్ర వ్యవసాయ మంత్రులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. కొత్త ప్రతిపాదనలు ప్రస్తుతం ఉన్న పబ్లిక్ మార్కెట్ యార్డులను రద్దు చేసే ప్రయత్నంగా కనపడుతున్నది.

చారిత్రాత్మకమైన ఢిల్లీ కేంద్రంగా సాగిన రైతుల ఆందోళన ఫలితంగా మూడు సంవత్సరాల క్రితం మూడు వ్యవసాయ నల్లచట్టాలు రద్దు చేయబడ్డాయి. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఈ వ్యవసాయ మార్కెటింగ్ చట్టాన్ని తీసుకురావడం అంటే రద్దు చేసిన మూడు నల్ల చట్టాలను తిరిగి దొడ్డిదారిన తీసుకువచ్చే ప్రయత్నంగానే చూడాలి. 2003లో అప్పటి ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ సిఫారసు చేసిన 12 మార్కెట్ సంస్కరణల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం మార్కెటింగ్ చట్టాన్ని రూపొందించింది. ఆ 12 సంస్కరణల ప్రకారం: ప్రైవేట్ హోల్‌సేల్ మార్కెట్ ఏర్పాటుకు అనుమతి లభిస్తుంది. టోకు వ్యాపారులు, వ్యవసాయ ఆహార శుద్ధి పరిశ్రమ ఎగుమతికారులు, సూపర్ మార్కెట్లు, బడా కార్పొరేషన్లు, రైతుల పొలం వద్దనే పెద్ద మొత్తంలో కొనుగోలు చేసేందుకు ఆస్కారం కలుగుతుంది. మార్కెట్ యార్డుల స్థానంలో శీతల గిడ్డంగులకు అనుమతి లభించింది. ఈ చట్టం ప్రకారం వ్యవసాయోత్పత్తుల కోసం ఏకీకృత జాతీయ మార్కెట్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రస్తుతం ఉన్న జీఎస్టీ ప్యానల్ మాదిరిగానే రాష్ట్ర వ్యవసాయ మంత్రులతో కూడిన అధికార వ్యవసాయ మార్కెటింగ్ పునర్వ్యవస్థీకరణ కమిటీని ఏర్పాటు చేయటం జరుగుతుంది. అలాగే పెద్ద సంఖ్యలో రైతులకు తోడ్పడుతున్న నిలవ గిడ్డంగులు/ కోల్ స్టోరేజీలను మార్కెట్ యార్డుల నుండి ప్రైవేట్ కార్పొరేషన్లకు ఇవ్వటం, ఎలక్ట్రానిక్ మార్కెట్లను ఏకీకృతం చేయటం లాంటి ముఖ్య మార్పులు జరుగుతాయి.

చారిత్రాత్మకమైన ఢిల్లీ కేంద్రంగా సాగిన రైతుల ఆందోళన ఫలితంగా మూడు సంవత్సరాల క్రితం మూడు వ్యవసాయ నల్లచట్టాలు రద్దయ్యాయి. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఈ వ్యవసాయ మార్కెటింగ్ చట్టాన్ని తీసుకురావడం అంటే రద్దు చేసిన మూడు నల్ల చట్టాలను తిరిగి దొడ్డి దారిన తీసుకువచ్చే ప్రయత్నంగానే చూడాలి. ప్రమాదకరమైన ఈ నూతన వ్యవసాయ మార్కెటింగ్ చట్టాన్ని ఉపసంహరించుకునేంత వరకు దేశవ్యాప్తంగా పోరాటాన్ని సాగించటానికి రైతాంగం సమాయత్తం కావాలి!



ఈ మార్పులు రైతులకు లభించే మద్దతు ధరలను నిరాకరించటానికి, మార్కెట్ యార్డులను నాశనం చేయడానికి ఉద్దేశించబడ్డాయి. ఇవి రైతుల చుట్టూ ప్రైవేట్ వ్యాపారుల సిండికేట్ ధరల మాయాజాలాన్ని తెచ్చిపెడతాయి. ఐటిసి, ఆదానీ లాంటి బడా కార్పొరేట్ శక్తులు మార్కెట్‌లో ఆధిపత్యం సంపాదించడానికి గేట్లు బార్లా తెరుస్తాయి. గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజి యూనిట్లను కార్పొరేట్ శక్తులకు అప్పగించడం వల్ల వ్యవసాయ ఉత్పత్తుల ధరల నియంత్రణ వారి చేతుల్లోకి వెళ్ళిపోతుంది. ఈ విధానం ఫలితంగా రైతుల దగ్గర తక్కువ ధరకు కొని మార్కెట్‌లో ఎక్కువ ధరలకు అమ్ముకుని పెద్ద ఎత్తున లాభాలు ఆర్జించటానికి ఈ చట్టం వారికి ఆయుధంగా ఉపయోగపడుతుంది. బల్క్ కొనుగోళ్ళ వల్ల నిత్యావసర వస్తువుల చట్టంతో సంబంధం లేకుండా బడా కార్పొరేట్ వర్గాలు ఉత్పత్తులను నిలవ చేసుకోగలుగుతాయి. ఇప్పటికే రిలయన్స్, అదాని వంటి కార్పొరేట్ దిగ్గజాలు భారీ గిడ్డంగులను, ప్రైవేట్ రైలు మార్గాలను కూడా నిర్మించుకున్నారు. ఈ చట్టంలోని నిబంధనలు సూపర్ మార్కెట్లు, బిగ్ బాస్కెట్ లేదా అమెజాన్ వంటి బడా కార్పొరేట్ వ్యాపారులు రైతుల నుండి నేరుగా కొనుగోలు చేసేలా ప్రోత్సహిస్తాయి. ఈ విధానం రైతులకు పంట ఉత్పత్తులపై ఎంఎస్‌పిలను ఎగవేయటానికి, ఆచరణలో రైతులు దివాలా తీయటానికి ఉపయోగపడుతుంది.

ప్రభుత్వ మద్దతు ఉన్న మార్కెట్ యార్డుల పాత్ర తగ్గిపోవడంతో ఇతర డిజిటల్ ఎలక్ట్రానిక్ మార్కెట్ల ద్వారా జీఎస్టీ పన్ను సేకరణ మాదిరిగానే సెంట్రల్ పూల్‌కు నేరుగా పన్నులను వసూలు చేయడానికి కేంద్ర ప్రభుత్వానికి వీలు కలుగుతుంది. జీఎస్టీని ప్రవేశపెట్టడంతో రాష్ట్రాలు అధిక ఆదాయ వనరులను ఎలా కోల్పోయాయో, ఆర్థిక సహాయం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఆధారపడేటట్లు ఎలా చేశాయో, ఈ వ్యవసాయ మార్కెట్ చట్టం కూడా అంతకు పదింతలు ఆధారపడేటట్లు చేస్తుంది.

రాజ్యాంగం ప్రకారం వ్యవసాయం రాష్ట్ర పరిధిలోకి వస్తుంది. కాబట్టి ఈ చట్టం రాష్ట్ర ప్రభుత్వాలను ఆర్థికంగా బలహీనపరిచి, సమాఖ్య వ్యవస్థ స్పష్టమైన ఉల్లంఘనకు దారితీస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్న వ్యవసాయ మార్కెటింగ్ సొసైటీలను రద్దుచేసి, ఈ చర్యతో వాటిని కేంద్రం తమ చేతుల్లోకి తీసుకొని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలని చూస్తున్నది. ఈ చట్టం గతంలో తెచ్చిన మూడు నల్లచట్టాల కన్నా దారుణమైనది. ఆనాడు మోదీ ప్రభుత్వం రాతపూర్వకంగా రైతులకు ఇచ్చిన హామీలలో మద్దతు ధర, రుణమాఫీ, విద్యుత్ బిల్లు ఉపసంహరణ ఉన్నాయి. మూడు సంవత్సరాలు దాటినా అవి అమలుకు నోచుకోకపోగా ఇప్పుడు మళ్లీ గోరుచుట్టుపై రోకలి పోటులా నూతన వ్యవసాయ మార్కెటింగ్ చట్టాన్ని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చే ప్రయత్నంలో ఉంది.

రైతుల పాలిట శాపంగా మారబోతున్న నూతన వ్యవసాయ మార్కెటింగ్ చట్టం ఉపసంహరణ కోసం ఇప్పటికే దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపును అందుకుని రైతు సంఘాలు ఆందోళనలు కొనసాగిస్తున్నాయి. వ్యవసాయరంగాన్ని బడా కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి పెట్టే ప్రమాదకరమైన నూతన వ్యవసాయ మార్కెటింగ్ చట్టాన్ని ఉపసంహరించుకునేంత వరకు దేశవ్యాప్తంగా పోరాటాన్ని సాగించటానికి రైతు సంఘాల నాయకత్వాన రైతాంగం సమాయత్తం కావాలి!


• ముప్పాళ్ళ భార్గవశ్రీ
సీపీఐ ఎంఎల్ నాయకులు

మీ అవినీతిని మర్చిపోరు!

ప్రజలు గతం మరిచిపోయుంటారు కదా, ఇక గమ్మత్తయిన అబద్ధాలతో మరోమారు ప్రజల గుమ్మం ఎందుకు తొక్కకూడదూ.. అన్న ఆలోచనలో భాగంగానే వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ఫీజు పోరు కార్యక్రమానికి తెర తీశారు (ఇప్పుడు దీని పేరును 'యువత పోరు'గా మార్చారు). కానీ ఫీజుల పెండింగ్ జరిగింది జగన్ ప్రభుత్వ హయాంలోనే అన్న విషయాన్ని ప్రజలు ఇంకా మర్చిపోలేదు. నాటి వైసీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.2832కోట్లు, వసతి దీవెన కింద రూ.989కోట్లు, పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.450కోట్లు పెండింగులో పెట్టింది. ఎలాంటి అవాంతరాలు లేకుండా కాలేజీలకు నేరుగా ఫీజులు చెల్లించేవి గత ప్రభుత్వాలు. కానీ తన స్వార్థం కోసం ఆ విధానాన్ని మార్చి, విడతల వారీగా చెల్లింపులు అని చెప్పి, పేద తల్లిదండ్రులలో ఆశలు రేపారు జగన్‌రెడ్డి. వారి ఆశలను మధ్యలోనే చిదిమేశారు.

వైసీపీ పాలనలో పాఠశాల విద్యాశాఖలో జరిగినన్ని చిత్ర విచిత్రాలు ఏ శాఖలోనూ జరగలేదు. 2019–24 మధ్య 5.70 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు పాఠశాలలకు తరలిపోయారు. స్కూళ్లకు రంగులు కొట్టి రూ.1,800కోట్లు కొట్టేశారు. సీబీఎస్ఈ, వరల్డ్ బ్యాంక్ సాల్ట్ ఒప్పందం, ఈ నేపథ్యంలోనే 4,700 పాఠశాలలు మూసివేయడం, బైజూస్ కుంభకోణం... ఈ విధంగా తమ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో అక్షర రంగానికి అవినీతి గొడుగు తొడిగేశారు. విద్యాశాఖకు నాటి ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పీఆర్ ఏజెన్సీని పెట్టుకున్నారు. తమిళనాడు న్యూస్ ప్రింట్ లిమిటెడ్ అనే తమిళనాడు సంస్థకు రూ.200కోట్లు బాకీ పడ్డారు. తెలుగు గంగ ద్వారా నీళ్లు ఇస్తున్నారు కాబట్టి ఆ బాకీ ఈ డబ్బులు చెల్లేసుకోమన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖలో విద్యార్థులు తక్కువయ్యే కొద్ది విద్యా కానుక ఖర్చు పెరిగిపోయింది. విద్యా కానుకకు 2021–22లో 45లక్షల మంది విద్యార్థులకు రూ.789 కోట్లు ఖర్చు చూపించిన ప్రభుత్వం 2023–24లో 39 లక్షల మంది విద్యార్థులకు రూ.1,042 కోట్లు ఖర్చు అవుతుందని చెప్పింది. విద్యార్థుల సంఖ్య తగ్గినప్పుడు ఖర్చు పెరిగిందంటే రూ.270కోట్లు అడ్డంగా దోచేశారన్నమాట. టోఫెల్‌కి అందరినీ సన్నద్ధం చేస్తున్నామని నాటి సీఎం జగన్ అనేకసార్లు చెప్పారు. లిక్విడ్ ఇంగ్లీష్ ఎడ్జ్ ప్రైవేటు లిమిటెడ్ అనే సంస్థ ఢిల్లీలో ఉంది. ఈ సంస్థకు 34 మంది ఉద్యోగులే ఉన్నారు. వాళ్లు ఇక్కడకు వచ్చి ఎస్ఈఆర్టీ బాగుందని అన్నారంట! ఎంపిక చేసిన టీచర్లకు టోఫెల్ ట్రైనింగ్ ఇచ్చేశారని, విద్యార్థులందరూ టోఫెల్‌కి సిద్ధంగా ఉన్నారని ప్రగల్భాలు పలికారు. లిక్విడ్ ఇంగ్లీష్ ఎడ్జ్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ వెబ్‌సైట్‌ని చూస్తే బండారం బయటపడుతుంది. ఈ విధంగా నోటికొచ్చిన ప్రగల్భాలన్నీ పలికి, పేద విద్యార్థులపై అసమర్థ, అవినీతి విధానాలను అమలు చేసిన ఘనతను మూటగట్టుకున్న వైసీపీ నేడు ఫీజుపోరు, యువత పోరు అంటూ కూటమి ప్రభుత్వంపై యుద్ధం చేయడం హాస్యాస్పదమే.

– డాక్టర్ డి.ఉదయకుమార్, తిరుపతి



బెజవాడ ఆటోనగర్‌కు కష్టమొచ్చింది!

తీవ్రంగా వేధిస్తున్న టెక్నీషియన్స్ కొరత

20 వేల మంది నుంచి 1700 తగ్గిన సంఖ్య

- మెకానిక్ మేస్త్రీలు, సీనియర్ మెకానిక్‌లు, హెల్పర్లు లేక ఖాళీగా యూనిట్లు
- ఆగిపోయిన ఇతర జిల్లాల నుంచి వచ్చే లారీలు
- కేవలం ఉమ్మడి కృష్ణాజిల్లాకే సేవలు పరిమితం
- ఉన్న వారిని కాపాడుకునే పనిలో ఆటోనగర్ టెక్నీషియన్స్ అసోసియేషన్



ఆసియాలోనే రెండో అతిపెద్ద ఆటోనగర్‌గా ప్రసిద్ధి చెందిన విజయవాడ జవహర్ ఆటోనగర్ నేడు టెక్నీషియన్స్ సమస్యతో సతమతమవుతోంది. 20 వేల మంది మెకానిక్ మేస్త్రీలు, సీనియర్ మెకానిక్‌లు, హెల్పర్లతో కోలాహలంగా ఉండే యూనిట్లు 1700 మందితో అతికష్టంపై నెట్టుకొస్తున్నాయి. మారుతున్న ఆటోమొబైల్ రంగానికి అనుగుణంగా కొత్తతరం రాక నిలిచిపోవడంతో రోజురోజుకు సేవలు తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి కృష్ణాజిల్లాకే ఆటోనగర్ సేవలు పరిమితమయ్యాయి. పూర్వపు రోజుల్లో ఉన్న టెక్నీషియన్లలో ప్రస్తుతం కేవలం 18 శాతం లోపు మాత్రమే ఉన్నారు. దాదాపుగా 82 శాతం మంది టెక్నీషియన్ల కొరతను జవహర్ ఆటోనగర్ ఎదుర్కొంటోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాష్ట్ర వ్యాప్తంగా అనేక దశాబ్దాల పాటు విస్తృతంగా సేవలందించిన విజయవాడ జవహర్ ఆటోనగర్ నేడు టెక్నీషియన్ల కొరతను తీవ్రంగా ఎదుర్కొంటోంది. ఇక్కడ పనిచేసే టెక్నీషియన్లలో ప్రధానంగా మెకానిక్ మేస్త్రీలు, సీనియర్ మెకానిక్‌లు ఉంటారు. ఆ తర్వాత హెల్పర్లు. పూర్వపు రోజుల్లో టెక్నీషియన్స్ కేటగిరిలో 20 వేల మంది వర్కర్లు, హెల్పర్లు ఉండేవారు. ఇందులో రెండు వేల మంది మెకానిక్ మేస్త్రీలు, సీనియర్ మెకానిక్‌లు ఉండేవారు. హెల్పర్లు 18 వేల మంది వరకు ఉండేవారు. ప్రస్తుతం అందరూ కలిపి 1700 మంది మాత్రమే ఉన్నారు. దీనిని బట్టి జవహర్ ఆటోనగర్‌కు ఏ స్థాయిలో టెక్నీషియన్స్ కొరత ఏర్పడిందో అర్థం చేసుకోవచ్చు. ఆటోనగర్ టెక్నీషియన్స్ అసోసియేషన్ (ఏటీఏ) కూడా ఈ కొరతను అధిగమించటానికి ఏమీ చేయలేకపోతోంది. ఉన్న వాళ్ల

మిగతా 6లో..

వెస్ట్ బైపాస్ అత్యవసరం!

నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు అత్యవసరంగా వెస్ట్ బైపాస్‌ను అందుబాటులోకి తీసుకురావడమే పరిష్కార మార్గమని ప్రజలు భావిస్తున్నారు. 95 శాతం పనులు పూర్తి చేసుకున్న రోడ్డు నెలల తరబడి అందుబాటులోకి రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐదు శాతం పనుల్లో ఏర్పడిన ల్యాంకో, అలైన్‌మెంట్ వివాదాలపై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి, మిగిలిన పనులు పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

95 శాతం వరకు పనులు పూర్తి

నేటికీ వినియోగంలోకి రాని రోడ్డు

నగరంపై రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ భారం

ల్యాంకో, అలైన్‌మెంట్ వివాదాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి

త్వరితగతిన అందుబాటులోకి తెచ్చి ట్రాఫిక్ కష్టాలు తీర్చాలని ప్రజల డిమాండ్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డు దాదాపుగా 95శాతం పూర్తయినా అందుబాటులోకి రాకపోవటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ విద్యుత్ లైన్లకు సంబంధించి పీజీసీఎల్ఐ, రైతులు, ఎన్‌హెచ్‌ల మధ్య నెలకొన్న వివాదం అపరిష్కృతంగా ఉండటం వల్ల తీవ్ర జాప్యం జరుగుతోంది. విజయవాడ వెస్ట్ బైపాస్ జాప్యంలో ఏ శాఖకూ పెద్దగా నష్టం జరగటం లేదు. ఎందుకంటే కాంట్రాక్టు సంస్థకు యాన్యుటీ చెల్లిస్తున్నారు. విద్యుత్ సంస్థలకు వచ్చిన నష్టం ఏమీ లేదు. ఎన్‌హెచ్‌కు వచ్చిన నష్టం కూడా ఏమీ లేదు. ఎటొచ్చీ దీని వల్ల నష్టపోతున్నది రాష్ట్ర ప్రభుత్వమే. ఎందుకంటే.. ఈ రోడ్డు విజయవాడ, గుంటూరు జిల్లా ప్రజలకే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల వారికి కూడా ఉపయోగపడుతుంది. ప్రజలకు అందుబాటులోకి రాకపోవటం వల్ల నష్టపోతున్నది రాష్ట్ర ప్రభుత్వమే కాబట్టి.. ఈ ప్రాజెక్టు వివాదాన్ని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కూడా రాష్ట్ర ప్రభుత్వం పైనే ఎక్కువగా ఉంది.

8 నెలలు గడిచినా పూర్తికాని పనులు

నెల, రెండు నెలల్లో అయిపోవాల్సిన ప్రాజెక్టు కాస్తా ఎనిమిది నెలలు గడిచినా పూర్తి కాలేదు. ఇంకెంత కాలం పడుతుందో తెలియదు. విజయవాడ నగరం ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలు అన్నీ, ఇన్నీ కాకుండా ఉంటున్నాయి. మరో ఏడాది గడిస్తే విజయవాడలో ఏ స్థాయిలో ట్రాఫిక్ కష్టాలు ఉంటాయో ఇప్పుడే భవిష్యత్తును చూపిస్తున్నాయి. విజయవాడ నగరం ఎదుర్కొంటున్న సత్వర ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించటానికి కొంత మేర విజయవాడ వెస్ట్ బైపాస్ ఉపయోగపడనున్నందున రాష్ట్ర ప్రభుత్వం తక్షణం రంగంలోకి దిగాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా న్యాయస్థానంలో ఇంప్లీడ్ కావాల్సి ఉంటుంది. విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డును జాతీయ విస్తృత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని

మిగతా 6లో..



95 శాతం పైగా పూర్తయిన వెస్ట్ బైపాస్

ప్రధాన సమస్యగా విద్యుత్ హైటెన్షన్ల అంశం

విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డు పూర్తి కావటంలో ఉన్న ప్రధానమైన సమస్య విద్యుత్ హైటెన్షన్ లైన్. ల్యాంకోకు చెందిన ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ విద్యుత్ లైన్ల అంశం న్యాయస్థానం పరిధిలో ఉంది. రైతులు వేసిన పిటిషన్ల నేపథ్యంలో న్యాయస్థానం స్టే విధించింది. రైతులు, పీజీసీఎల్ఐ, ఎన్‌హెచ్‌ల మధ్య నెలకొన్న ముక్కోణపు వివాద పరిష్కారానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రాథమికంగా జోక్యం చేసుకుని దానిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టింది. రైతులు, ఎన్‌హెచ్ అధికారుల మధ్యన నెలకొన్న వివాదాన్ని రాష్ట్ర ప్రభుత్వం చాలా వరకు పరిష్కరించగలిగినా.. రైతులు, పీజీసీఐఎల్‌ల మధ్యన నెలకొన్న సమస్య మాత్రం పరిష్కారం కావటం లేదు. ఎందుకంటే మూలన పడిన ల్యాంకో విద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించిన ట్రాన్స్‌మిషన్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చటం వివాదానికి కేంద్ర బిందువు అయింది. మూలన పడిన విద్యుత్ ప్లాంట్‌కు సంబంధించిన లైన్‌కు విద్యుదుత్పత్తి జరగకపోయినా అంతరాయం పేరుతో డబ్బులు చెల్లించటం, అలైన్‌మెంట్ మార్పుకు బలవంతంగా పట్టుబట్టడం వంటి అంశాలతో రైతులు కోర్టును ఆశ్రయించారు. దాదాపుగా డజనుకు పైగా రైతులు కోర్టులలో కేసులు వేయటంతో వాటికి స్టేలు కూడా రావటం జరిగింది. ఈ కారణంగా ప్రాజెక్టు పనులలో అయితే జాప్యం నెలకొంది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 06-22 (బుధవారం సాయంత్రం)
సహర్ : 04-53 (గురువారం ఉదయం)

నగరంలోకి రావద్దు!

నేరగాళ్లకు సీసీఎస్ పోలీసుల హెచ్చరిక

కొత్తగా జైల్ రిలీజ్ మానిటరింగ్ సిస్టం ఏర్పాటు

- జైళ్ల నుంచి విడుదలవుతున్న ఖైదీల సమాచారం సేకరణ
- వారి సెల్‌ఫోన్లపై నిరంతర నిఘా
- కమిషనరేట్ పరిధిలో అడుగుపెడితే వార్నింగ్

ఒ రంగూన్ బాబు.. రాత్రిపూట చోరీలు చేయడంలో దిట్ట. ఒంటరిగా వెళ్తాడు. పగటిపూట రెక్కీ నిర్వహిస్తాడు. రాత్రిపూట తాళాలు పగలుగొట్టి ఇంటిని కొల్లగొట్టేస్తాడు. ఓ చోరీ కేసులో నల్లగొండ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. కొద్దిరోజుల క్రితమే అతడు జైలు నుంచి విడుదలయ్యాడు. రెండు, మూడు సార్లు విజయవాడ వచ్చి వెళ్లాడు. ఓ రోజు సీసీఎస్ పోలీసులు నేరుగా రంగూన్‌కు ఫోన్ చేశారు. మరోసారి విజయవాడలో అడుగుపెడితే కటకటాల వెనక్కి పంపుతామని హెచ్చరించారు. దీనితో రంగూన్ షాక్ తిన్నాడు.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్న పోలీసులు తాజాగా జేఆర్ఎంఎస్ (జైల్ రిలీజ్ మానిటరింగ్ సిస్టం)ను అమలు చేస్తున్నారు. నేరాలు జరిగినప్పుడు నిందితులను గుర్తించడానికి వీలుగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సంఖ్యను మరింతగా పెంచుతున్నారు. పోలీసు కమిషనరేట్ పరిధిలో సుమారుగా 15వేల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసే ప్రాజెక్టుకు పోలీసు అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టు పరుగులు తీస్తున్న క్రమంలో నేరచరిత్ర కలిగిన వారిపై నిరంతరం నిఘా ఉంచాలని నిర్ణయించారు. దీని కోసం ప్రత్యేకంగా జేఆర్ఎంఎస్‌ను పట్టాలెక్కించారు.

ఇలా చేస్తారు

విజయవాడలో జిల్లా కారాగారం ఉంది. ఇవి కాకుండా సబ్‌జైళ్లు ఉన్నాయి. వివిధ నేరాల్లో చిక్కిన నేరగాళ్లను పోలీసులు ఈ జైళ్లకు పంపుతారు. శిక్ష పూర్తయిన తర్వాత ఆ నేరగాళ్లకు విముక్తి కలుగుతుంది. కొంతమంది బయటకు వచ్చిన తర్వాత మళ్లీ అదే బాటలో నడుస్తుంటారు. కొంతమంది నేరగాళ్లను జిల్లా జైలుకు పంపితే, మరికొంతమంది నేరగాళ్లను రాజమహేంద్రవరం, నెల్లూరులో ఉన్న కేంద్ర కారాగారాలకు పంపుతున్నారు. ఇలా జైళ్లలో ఉన్న నిందితుల్లో కొంతమంది బెయిల్‌పైన, మరికొంతమంది శిక్షాకాలం పూర్తయిన తర్వాత కోర్టు ఆదేశాల ప్రకారం విడుదలవుతారు. ఇలా కారాగారాల నుంచి అడుగు బయటకు వేసే వారిపై నిఘా పెట్టడానికి జేఆర్ఎంఎస్‌ను ప్రవేశపెట్టారు. జిల్లా జైళ్ల నుంచి విడుదలయ్యే నేరగాళ్ల లెక్కల్నే కాకుండా రాష్ట్రంలోని ఇతర కారాగారాలు, తెలంగాణలోని జైళ్ల నుంచి విడుదలవుతున్న వారి వివరాలను నిరంతరం సేకరిస్తున్నారు. జైలు నుంచి విడుదలవుతున్న నేరగాళ్ల పేర్లు, వారి చిరునామా, ఉపయోగిస్తున్న సెల్‌ఫోన్ నంబర్లు, ఏ కేసుల్లో అరెస్టయ్యారు, నేరాలు చేసే విధానాల వివరాలను సేకరిస్తున్నారు. తర్వాత వారి సెల్‌ఫోన్లపై నిఘా పెడుతున్నారు. జైలు నుంచి విడుదలైన తర్వాత, జైలుకు వెళ్లడానికి ముందు ఎప్పుడైనా విజయవాడకు వచ్చారా అన్న వివరాలను సాంకేతికంగా తెలుసుకుంటున్నారు. ఈ నేరగాళ్లు విజయవాడలో అడుగుపెట్టినట్టు సాంకేతిక ఛాయల్లో తేలితే సీసీఎస్ పోలీసుల నుంచి నేరుగా వారికి ఫోన్లు వెళ్తున్నాయి. వారు ఎప్పుడెప్పుడు విజయవాడలో అడుగుపెట్టారో లెక్కలు చెప్పడంతోపాటు ఏ కారణంతో ఇక్కడికి వచ్చారో ప్రశ్నిస్తున్నారు. ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఎక్కడికి వచ్చినా కేసు నమోదు చేసి, తిరిగి కటకటాల వెనక్కి పంపుతామని హెచ్చరిస్తున్నారు. ఆరు నెలల కాలంలో రెండు, తెలుగు రాష్ట్రాల్లో కలిపి 3,600 మంది నేరగాళ్లు కారాగారాల నుంచి బయటకు వచ్చారు. వారి సెల్‌ఫోన్ల డేటాలను పరిశీలించగా కొంతమంది విజయవాడను తాకినట్టుగా గుర్తించారు. వారందరికి మరోసారి విజయవాడ వైపు చూడొద్దని సందేశాలను పంపారు. ఇలా చేయడం వల్ల నేరగాళ్లను నియంత్రించడానికి వీలుంటుందని కమిషనరేట్ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ఇదీ రాష్ట్రంలో కారాగారాల లెక్క

రాష్ట్రంలో నాలుగు కేంద్ర కారాగాలు ఉన్నాయి. ఒక ఓపెన్ ఎయిర్ జైలు ఉంది. మహిళలకు ప్రత్యేకంగా రెండు జైళ్లు ఉన్నాయి. ఇవి కాకుండా ఎనిమిది జిల్లా జైళ్లు 11 స్పెషల్ సబ్ జైళ్లు, 58 సబ్ జైళ్లు ఉన్నాయి. తెలంగాణలో నాలుగు కేంద్ర కారాగారాలు, రెండు ఓపెన్ ఎయిర్ జైళ్లు, ఐదు జిల్లా జైళ్లు, రెండు మహిళా జైళ్లు, మూడు స్పెషల్ సబ్‌జైళ్లు ఉన్నాయి.

బాలికపై సామూహిక అత్యాచారం

పోలీసుల అదుపులో నిందితులు

గన్నవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బాలికపై యువకులు సామూహిక అత్యాచారం జరిపిన ఘటన మండలంలో జరిగింది. వివరాల్లోకి వెళితే... జి.కొండూరు గ్రామానికి చెందిన బాలిక గన్నవరం మండలంలోని వీరపనేనిగూడెంలో ఉండే తన స్నేహితురాలి ఇంటికి ఈ నెల తొమ్మిదో తేదీన వచ్చింది. ఈ క్రమంలో కుటుంబ సభ్యుల మధ్య గొడవ జరిగింది. దీనికి ఈ బాలికే కారణమని స్నేహితురాలి తల్లి మందలించింది. దీంతో ఈ నెల 13వతేదీ రాత్రి బాలిక ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయింది. అందరూ జి.కొండూరులోని ఇంటికి వెళ్లి ఉంటుందని భావించారు. కానీ బాలిక ఇంటికి వెళ్లకపోవడంతో ఉంగుటూరు మండలం ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై చావా సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గ్రామంలోని సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించి పోలీసులు బాలిక ఆచూకీ తెలుసుకున్నారు. అదే రోజు రాత్రి కొందరు బయట మద్యం తాగుతుండగా వారి వద్దకు వెళ్లినట్టు బాలిక పోలీసులకు తెలిపింది. కొందరు యువకులు బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. బాలిక ఇచ్చిన సమాచారంతో ఆ యువకులను ఆత్కూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. పూర్తి వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

వైభవంగా తిరుపతమ్మకు బోనాలు 8లో

సారా రహిత జిల్లాగా మార్చుకుందాం

ఇంకెన్నాళ్లు!
- గేటు పండిందా.. పనులు గోవిందా!
- లెవల్ క్రాసింగ్ రైల్వే గేట్ల వద్ద ప్రజల కష్టాలు

6లో

నేడు తాడేపల్లికి పంచాయితీ!

తిరువూరు వైసీపీ కౌన్సిలర్ల మధ్య విభేదాలు

- ప్రస్తుత చైర్‌పర్సన్ తప్పుకుని మరొకరికి అవకాశం ఇవ్వాలని పట్టు
- చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ కలెక్టర్‌కు వినతి
- అసమ్మతి సభ్యులను బుజ్జగించేందుకు జగన్ వద్దకు తీసుకెళ్లనున్న స్థానిక నేతలు

తిరువూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తిరువూరు మున్సిపాల్టీ వైసీపీ పాలకవర్గంలో ఏర్పడిన విభేదాలు తారాస్థాయికి చేరాయి. అసమ్మతి కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ కలెక్టర్‌కు నోటీసులు ఇచ్చారు. వీరిని బుజ్జగించేందుకు స్థానిక వైసీపీ నేతలు వీరిని తాడేపల్లి ప్యాలెస్‌లోని అధినేత వద్దకు బుధవారం తీసుకెళ్లనున్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే... స్థానిక మున్సిపాల్టీలో వైసీపీ కౌన్సిలర్ల మధ్య కొంతకాలంగా ఆధిపత్య పోరు నడుస్తోంది. గతంలో అనుకున్న ప్రకారం ప్రస్తుత చైర్‌పర్సన్ రాజీనామా చెయ్యాలని, తదుపరి మోదుగు ప్రసాద్‌కు అవకాశం ఇవ్వాలనే డిమాండ్‌తో కొందరు వైసీపీ కౌన్సిలర్లు అవిశ్వాసం బాటపట్టారు. ఈ నెల 13న కలెక్టర్ లక్ష్మీశ, ఆర్డీవో కె.మాధురి, మున్సిపల్ కమిషనర్ లోవరాజును కలిసి ప్రస్తుత చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ వినతి పత్రాలు అందించారు. వీరిని బుజ్జగించి తిరిగి వైసీపీ కౌన్సిలర్లను ఒకే తాటిపైకి తీసుకువచ్చేందుకు స్థానిక నేతలు ప్రయత్నిస్తున్నారు. చివరగా తాడేపల్లికి ఈ కౌన్సిలర్లను తీసుకువెళ్లి సర్దిచెప్పే ప్రయత్నం చేయనున్నారు. ప్రస్తుతం అవిశ్వాసం ప్రకటించిన కౌన్సిలర్లలో కొందరు తాడేపల్లి వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. తాము పార్టీ అధినేతను చూసేందుకే వెళ్తున్నామని, అవిశ్వాసంపై వెనక్కి తగ్గేది లేదంటున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపాల్టీలో ఎటువంటి పరిస్థితులు నెలకొంటాయోనని పట్టణ ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో మంగళవారం ప్రారంభమైన ప్రజాప్రతినిధుల క్రీడా పోటీలు ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రజాసమస్యలపై గళాన్ని వినిపించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు క్రీడల్లో లక్ష్యాలపై గురిపెట్టారు. క్రికెట్, టగ్ ఆఫ్ వార్, టెన్నిస్, త్రోబాల్ తదితర పోటీల్లో నువ్వానేనా అన్నట్లు సర్వశక్తులను ఒడ్డారు. ఆద్యంతం సందడిగా గడిపారు.



బ్యాటింగ్ చేస్తున్న ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు (ఇన్‌సెట్‌లో) బౌలింగ్ చేస్తున్న పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ప్రజాప్రతినిధుల క్రీడా పోటీలు ప్రారంభం

క్రికెట్‌లో టాస్ గెలిచిన అచ్చెన్న... మ్యాచ్ గెలిచిన నాదెండ్ల

టగ్ ఆఫ్ వార్‌లో మహిళా ఎమ్మెల్యేల పైచేయి ● వ్యాఖ్యాతగా సుధీర్‌రెడ్డి



టగ్ ఆఫ్ వార్‌లో మహిళా ఎమ్మెల్యేలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రజాప్రతినిధుల క్రీడా పోటీలను శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు మంగళవారం ప్రారంభించారు. తొలుతగా టగ్ ఆఫ్ వార్ నిర్వహించారు. కోస్తాంధ్ర మహిళా ఎమ్మెల్యేలు ఒక జట్టుగా, రాయలసీమ మహిళా ఎమ్మెల్యేలు మరో జట్టుగా ఏర్పడ్డారు. ఇందులో రాయలసీమ జట్టు విజయం సాధించింది. అనంతరం పురుషుల విభాగంలో టగ్ ఆఫ్ వార్ నిర్వహించారు. ఇందులో రాయలసీమ ఎమ్మెల్యేలు ఒక జట్టుగా, కోస్తాంధ్ర ఎమ్మెల్యేలు మరో జట్టుగా ఉన్నారు. ఈ విభాగంలో మంత్రి అచ్చెన్నాయుడు రాయలసీమ జట్టులో ఉన్నారు. ఈ విభాగంలో కోస్తాంధ్ర జట్టు విజయం సాధించింది. అనంతరం జరిగిన క్రికెట్ పోటీల్లో మంత్రి అచ్చెన్నాయుడు ఒక జట్టుగా, మరో మంత్రి నాదెండ్ల మనోహర్ ఇంకో జట్టుగా పిచ్‌లోకి దిగారు. అచ్చెన్నాయుడు టాస్ గెలిచి

మిగతా 6లో..

పోటీల్లో పాల్గొన్న వైసీపీ ఎమ్మెల్సీలు

ప్రజాప్రతినిధుల క్రీడా పోటీలకు వైసీపీ ఎమ్మెల్యేలు దూరంగా ఉన్నప్పటికీ ఎమ్మెల్సీలు మాత్రం హాజరయ్యారు. కల్యాణ చక్రవర్తి, ఏసురత్నం, సీహెచ్ అనంత ఉదయ్ భాస్కర్, రవీంద్రనాథ్ ఈ పోటీల్లో పాల్గొన్నారు. క్రీడా ప్రాంగణంలో కూటమి ఎమ్మెల్యేలతో కలిసి సందడిగా గడిపారు.



కొండపల్లి-ఈలప్రోలు గ్రామాల మధ్య దారిలో ఉన్న రైల్వే గేటు

ఇంకెన్నాళ్లు!

- గేటు పండిందా.. పనులు గోవిందా!
- లెవల్ క్రాసింగ్ రైల్వే గేట్ల వద్ద ప్రజల కష్టాలు
- ఆర్వోబీల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూపులు
- రైల్వే జీఎంతో ఎమ్మెల్యే వసంత చర్చలు
- నేటికీ కార్యరూపం దాల్చని వైనం



రాయనపాడు వద్ద గేటు వేయటంతో వేచి ఉన్న వాహనాలు

● శ్రీనివాసరావు ప్రైవేటు సంస్థలో ఉద్యోగి. ఉదయం పని ఒత్తిడి వల్ల ఆరోజు కాస్త ఆలస్యమైంది. ఎలాగైనా టైంకి ఆఫీసుకు చేరుకోవాలని ఇంటి నుంచి హడావిడిగా ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. అప్పటి వరకు ప్రయాణం సాఫీగా సాగినా.. లెవెల్ క్రాసింగ్ వద్ద బ్రేకులు పడ్డాయి. రైల్వే గేటు పడింది. అయ్యో సమయం అయి పోతోంది.. ఈ గేటు ఇప్పుడే పడాలా..! రైలు వచ్చేనా.. గేటు తెరిచేనా.. అంటూ నిట్టూర్చాడు.

● రోజూ ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, రైతులు, ప్రయాణికులు లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద ఆగా ల్సిందే.. ఒక్కసారి గేటు పండిందా.. ఇక అంతే సంగతి. రైలు లెవల్ క్రాసింగ్ దాటే వరకు గేట్లు తెరుచుకోవు. అంతవరకూ నిరీక్షణ తప్పదు. ఈ కష్టాలు ఎప్పటికి తీరుతాయో అంటూ స్థానిక ప్రజలు ఆశగా చూస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం)

విజయవాడ-సికింద్రాబాద్ రూట్ మైలవరం నియోజక వర్గంలో పలు లెవల్ క్రాసింగ్‌ల వద్ద రైల్వే గేటు కష్టాలు ప్రయాణికులు, వాహన చోదకులను ముప్పతిప్పలు పెడు తున్నాయి. ముఖ్యంగా కొండపల్లి, రాయనపాడు, గుంటు పల్లి గ్రామాల్లో రైల్వే గేట్ల వద్ద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక సారి గేటు పడితే అర్ధగంట సమయం వృథా అవుతుంది. దీంతో విజయవాడలో అత్యవసర పనులు, ఉద్యోగాల నిమిత్తం వెళ్లే వారికి తిప్పలు తప్పడం లేదు. మరోవైపు జి.కొండూరు మండలంలోని చెర్వుమాధ వరం, గంగినేనిపాలెం, దుగ్గిరాలపాడు తదితరగ్రామాల్లో రైల్వేగేట్ల వద్ద రైతులు అవస్థలు పడుతున్నారు. రైలుప ట్టాలు దాటి పొలాల్లోకి రాకపోకలు సాగించేందుకు అష్టక ష్టాలు పడాల్సి వస్తున్నది. ప్రధానంగా ఆరుచోట్ల రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిం దని మైలవరం, విజయాడ రూరల్, ఇబ్ర హీంపట్నం, జి.కొండూరు మండలాల ప్రజలు వాపోతున్నారు.

ఎమ్మెల్యే కృషి ఫలించేనా..

ఈఏడాది జనవరి 29న జిల్లా కలెక్టరేట్‌లో రైల్వే జీఎంతో జరిపిన సమావేశంలో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్ర సాద్ కొండపల్లి లెవల్ క్రాసింగ్ (ఎల్‌సి) 140, ఈలప్రోలు ఎల్‌సీ 147, రాయనపాడు ఎల్‌సీ 148, గొల్లపూడి ఎల్‌సీ నంబరు 150 వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జ్ (ఆర్‌ఓబీ)లు నిర్మాణం చేపట్టాలని కోరారు. బ్రిడ్జిల ఆవశ్యకతను ఆయన జీఎం దృష్టికి తీసుకెళ్లారు. అయినా నేటికి కార్యరూపం దాల్చలేదు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం

- నూతక్కి నాగేశ్వరరావు, రైతు



చెర్వుమాధవరం రైల్వే గేటు దాటి పొలాల్లోకి వెళ్లాలంటే చాలా ఇబ్బం దులు పడాలి వస్తున్నది. పొలానికి వెళ్లి రావాలంటే గేటు వద్దే సమయం గడిచిపో తోంది. వంతెన నిర్మాణం ఎంత త్వరగా చేపడితే మా బాధలు తీర్చిన వారవుతారు. ఏళ్ల తరబడి మాసమస్యలు పట్టించుకునే వారు లేకుండా పోయారు.

ఫ్లైఓవర్ ఏర్పాటు చేస్తే మంచిది

- జాస్తి గోపాలకృష్ణ, గుంటుపల్లి



గుంటుపల్లి వద్ద ఫ్లై ఓవర్ ఏర్పాటు చేస్తే మంచిది. వ్యాగన్ వర్క్‌షాపు వద్ద సబ్ వే ఉండాలి. రైతులు, వ్యవసాయ కార్మికులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. గుంటుపల్లి వ్యాగన్ వర్క్‌షాపులో ఉద్యోగ స్తులు డ్యూటీలకు వచ్చేందుకు వంతెన లేకపోవడం చాలా ఇబ్బందిగా ఉంటోంది.

అసెంబ్లీ వేదికగా

వరదల ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టండి

» ఎమ్మెల్యే సుజనా చౌదరి



వన్‌టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల సంభవించిన బుడమేరు వరదలకు ప్రాణనష్టంతో పాటు భారీగా ఆస్తి నష్టం వాటి ల్లిందని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా విజయవాడ నగరాన్ని రక్షించాలని, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) అన్నారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ, బుడ మేరు వరద ముంపు నివారణ, నియంత్రణకు తీసుకుంటున్న చర్య లపై ప్రశ్నించారు. బుడమేరుతో పాటు రాష్ట్రంలో భారీ వర్షాలు, వరద లకు శ్రీకాకుళం, విజయనగరం, ఈస్ట్ గోదావరి, వెస్ట్ గోదావరి, కృష్ణా, గుంటూరు వరద ప్రభావిత ప్రాంతాల్లో నష్టాలు సంభవించకుండా చర్యలు చేపట్టాలన్నారు. భవిష్యత్తులో తుఫానులు, వరదల వలన ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. పశ్చిమ నియోజకవర్గంలో స్ట్రామ్ వాటర్ డ్రెయినేజీల, అవుట్ ఫాల్ డ్రెయిన్‌ల నిర్వహణ సరిగా లేదన్నారు.

ఇస్కాన్ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

ఉండవల్లి కరకట్ట రోడ్డులోని ఇస్కాన్ మందిరాన్ని ఎమ్మెల్యే సుజనా చౌదరి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం సందర్శించారు. మందిర అధ్యక్షులు చక్రధరి దాస్ శ్రీకృష్ణుని జీవిత చరిత్రను తెలియజేసే కృష్ణ ఆర్ట్ పుస్తకాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు.

బుడమేరు సమగ్రాభివృద్ధికి నిధులివ్వాలి

» ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్



ఇబ్రహీంపట్నం : బుడమేరును అభివృద్ధి చేసేందుకు, గతేడాది ఆకస్మిక వరదల వల్ల నియోజకవర్గంలో చెరువులు, వాగులకు పడిన గండ్ల మరమ్మతులకు, ఎన్‌ఎస్‌పీ కాలువ అభి వృద్ధికి నిధులు కేటాయించాలని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ కోరారు. వరదలకు నియోజకవర్గం పూర్తిగా దెబ్బతిందన్నారు. బుడమేరు వాగులు పొంగి 50పైగా చెరువుల కట్టలు దెబ్బతిన్నాయన్నారు. బుడమేరు 70శాతం పైగా మైలవరం నియోజకవర్గంలోనే ఉందన్నారు. భవిష్యత్‌లో ఎలాంటి విపత్తులు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టేందుకు అవసమరైన నిధులు కేటాయించాలని కోరారు.

తిరువూరులో సబ్‌కోర్టు ఏర్పాటు చేయాలి

» ఎమ్మెల్యే కొలికపూడి



తిరువూరు : డివిజన్ కేంద్రమైన తిరువూ రులో సబ్‌కోర్టు ఏర్పాటుకు చర్యలు తీసుకోవా లని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ప్రభు త్వానికి విజ్ఞప్తి చేశారు. సబ్‌కోర్టు అవసరాల కోసం వ్యయప్రయాసలకోర్చి నూజివీడు వెళ్లాల్సి వస్తున్నదని ప్రజల ఇబ్బందులను ఆయన సభదృష్టికి తెచ్చారు. నూజి వీడు ఏలూరు జిల్లాలోకి వెళ్లడంతో సాంకేతికరపరమైన ఇబ్బందులు వస్తున్నాయన్నారు. తిరువూరులో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, అడిష నల్ డిస్ట్రిక్ట్ కోర్టులు ఏర్పాటుచేయాలని ఆయన న్యాయశాఖమంత్రిని కోరడంతో పాటు, ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు.



మహాసభల లోగో ఆవిష్కరిస్తున్న నారాయణ

ఖాళీల భర్తీతో నిరుద్యోగ సమస్యకు పరిష్కారం

- ఏఐవైఎఫ్ జాతీయ 17వ మహాసభలను వి జయవంతం చేయాలి
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

గాంధీనగర్ మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా పెరిగిందని ప్రభుత్వరంగ సంస్థల్లో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మే 15 నుంచి 18 వరకు తిరుప తిలో జరగనున్న ఏఐవైఎఫ్ జాతీయ 17వ మహాసభల లోగోను గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్న అఖిల భారత యువజన సమాఖ్య పోరాడి వయోజనులకు ఓటు హక్కు సాధించిందన్నారు. 'జాబ్ ఆర్ జైల్' 'సేవ్ ఇండియా చెంజ్ ఇండియా' నినాదాలతో ఉద్యమించినట్టు తెలిపారు. నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఈ మహాసభల్లో చర్చించి భవిష్య త్ ఉద్యమ రూపకల్పన జరుగుతుందన్నారు. మోదీ, అమిత్‌షా, జగన్ దుష్ట సాంప్రదాయానికి పాల్పడుతున్నారని విమర్శించారు. సంఘం మాజీ జాతీయ కార్యదర్శి జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ ఈ మహాసభ లకు ఆహ్వాన సంఘం ఛైర్మన్‌గా డాక్టర్ నారాయణ, ప్రధాన కార్యద ర్శిగా పరుచూరి రాజేంద్రబాబు, కార్యదర్శులుగా కె.శివారెడ్డి, యం.యు గంధర్, జి.సంతోష్‌కుమార్, ప్యాట్రన్‌గా జి.ఈశ్వరయ్య, నక్కి లెనిన్ బాబు, కోశాధికారిగా పి.మురళీ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కత్తి రవి, పలువురు ప్రముఖ విద్యావేత్తలతో ఆహ్వాన సంఘం ఏర్పాటైందన్నారు.

బెజవాడ ఆటోనగర్‌కు కష్టమొచ్చింది!

(5వ పేజీ తరువాయి)

సంక్షేమం, వారి ఇబ్బందులు వంటి అంశాల మీదనే దృష్టి సారించ గలుగుతోంది.

నిలిచిపోయిన కొత్తతరం రాక

ఆటోనగర్‌లో పూర్వం పనిచేసిన 20 వేల మంది టెక్నీ షియన్స్ పిల్లలు వారసత్వంగా ఈ వృత్తిలోకి రావటం ఆగిపోయింది. ప్రధానంగా వారి పిల్లలు ఇంజనీరింగ్, మెడిసిన్, సీఏ వంటి ఉన్నత చదువులు చదుకుని స్థిరప డిపోయారు. దీంతో వంశపారంపర్యంగా టెక్నీషియన్స్ వృద్ధి చెందలేదు. ఇది ఒక ప్రధాన కారణమైతే.. ఆటోమొ బైల్ రంగంలో గత కొంత కాలంగా వస్తున్న అనూహ్య మార్పులు మరో కారణం. గతంలో లారీలకు మరమ్మ తులు చేయాలంటే మెకానిక్‌ల నైపుణ్యం మీద ఉండేది. ఇప్పుడొస్తున్న ఆధునిక లారీలను బాగు చేయాలంటే మెకానిక్‌ల కష్టం కంటే కూడా స్మార్ట్ వర్క్ ఎక్కువ పాత్ర పోషిస్తోంది. హై ఎండ్ లారీలకు మరమ్మతులు చేయాలంటే ఇప్పుడు ల్యాప్‌టాప్‌లు ఉంటే సరిపోతోంది. బీఎస్-4, బీఎస్-6 వాహనాలు వచ్చాక అధునాతన లారీ లకు మరమ్మతులు చేయాల్సి వస్తే పాత సంప్రదాయ మెకానిక్‌ల సామర్థ్యం సరిపోవటంలేదు. స్మార్ట్ టెక్నీషి యన్స్ సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. దీంతో విజ యవాడ ఆటోనగర్‌కు లారీలను తీసుకురావాల్సిన పని లేకుండా యజమాని గ్యారేజీ దగ్గరకు వారే వెళ్లి మర మ్మతులు చేసేస్తున్నారు. అలా అని సంప్రదాయ మెకాని క్‌లకు డిమాండ్ తగ్గలేదు. ఉమ్మడి కృష్ణాజిల్లానే పరిగణ నలోకి తీసుకుంటే 45 వేల లారీలు ఉన్నాయి. వీటిలో 25 వేల లారీలు పెద్ద, చిన్న ట్రిప్పర్లు కాగా, మరో 20 వేల లారీలు నేషనల్ పర్మిట్స్ కలిగినవి ఉన్నాయి. వీటిలో సింహ భాగం పాతవే కావటంతో సంప్రదాయ మెకానిక్ లపైనే ఎక్కువగా ఆధారపడి ఉన్నారు.

ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచే..

జవహర్ ఆటోనగర్ విజయవాడలో ఉండటంతో నగ రంలోని ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని చాలా మంది యజమానులు ఇటు రావటం తగ్గించేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన లారీ యజమానులు మాత్రమే ప్రస్తుతం విజయవాడ వస్తున్నారు. ఇక్కడకు ఇతర జిల్లాల నుంచి వస్తే లారీ యజమానులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. మెకానిక్ యూనిట్స్ దగ్గర లారీలను పార్కింగ్ చేసే సదుపాయాలు లేవు. మెకానిక్‌లు తక్కువగా ఉండటం వల్ల డ్రైవర్, క్లీనర్‌లను రెండు, మూడు రోజుల పాటు ఇక్కడే ఉంచాల్సి వస్తోంది. దీంతో వీరంతా కూడా స్థానిక లాడ్జిలలో ఉండటం వల్ల వారికి రోజుకు రూ. 2 వేలు చొప్పున ఎన్ని రోజులుంటే అంత మేర ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇది యజమాను లకు ఆర్థిక భారంగా మారుతోంది. దీనికి తోడు ప్రతి జిల్లాలో కూడా ఆటోనగర్ల తరహాలో పారిశ్రామిక వాడలు విస్తరించటం వల్ల కూడా వారు స్థానికంగా రిపేర్లు చేయించుకోవటానికే ఆసక్తి చూపిస్తున్నారు. నెల్లూరు, కడప, అనంతపురం తదితర అనేక చోట్ల స్థాని కంగా పారిశ్రామికవాడలు అభివృద్ధి చెందటం వల్ల కూడా విజయవాడ జవహర్ ఆటోనగర్‌కు లారీలు రావటం గణనీయంగా తగ్గిపోయింది.

అప్రంటీస్ విధానంతో మేలు

టెక్నీషియన్స్ కొరతను తీర్చటంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని ఏటీఏ వర్గాలు చెబుతున్నాయి. ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ మెకా నిక్ విభాగాలు పూర్తి చేసిన వారికి ఆరు నెలల పాటు ఖచ్చితంగా ఆటోనగర్‌లోని మెకానిక్‌ల దగ్గర అప్రంటీ స్‌గా పనిచేయించే విధానాన్ని ఏర్పాటు చేయాలని సూచి స్తున్నారు. ఒకరి దగ్గరే ఆరు నెలలు కాకుండా ఒక్కొక్కరి దగ్గర రెండు నెలల పాటు అప్రంటీస్ చేసే అవకాశాన్ని కల్పించాలని కోరుతున్నారు. దీని వల్ల చదువుకున్న మెకానిక్స్‌కు స్కిల్ డెవలప్‌మెంట్ (నైపుణ్యాభివృద్ధి) పెంపొందుతుందని అంటున్నారు. అప్రంటీస్ పూర్తయిన వారు ఉద్యోగాల కోసమే ఎదురు చూడకుండా సొంతంగా వర్క్‌షాప్‌లు పెట్టుకోవటానికి కూడా దోహదపడుతుం దని చెబుతున్నారు. లేనిపక్షంలో మరో దశాబ్ద కాలంలో తమ యూనిట్స్‌ను మూసివేసుకోవాల్సి వస్తుందని అంటున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

(5వ పేజీ తరువాయి)

బ్యాటింగ్ ఎంచుకున్నారు. తర్వాత బ్యాటింగ్ ప్రారం భించిన మనోహర్ జట్టు మ్యాచ్‌లో విజయం సాధిం చింది. నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే బీవీ పార్థసారధి మధ్య సాగిన టెన్నిస్ మ్యాచ్ నువ్వానేనా అన్నట్టుగా జరి గింది. సీమ మహిళా ఎమ్మెల్యేలు ఒక జట్టుగా, కోస్తాంధ్ర మహిళా ఎమ్మెల్యేలు మరో జట్టుగా త్రోబాల్ మ్యాచ్ సాగింది. మంత్రులు అనిత, సంధ్యారాణి, కందుల దుర్గేష్, ఎం.రాంప్రసాద్‌రెడ్డి, నాదెండ్ల మనోహర్, కొండ పల్లి శ్రీనివాస్, సత్యకుమార్, అచ్చెన్నాయుడు, చీఫ్‌వి ఎలు జీవీ ఆంజనేయులు, పంచుమర్తి అనురాధ, శాప్ ఛైర్మన్ రవినాయుడు పోటీల్లో పాల్గొన్నారు.


అంగరక్షకుల హడావుడి

ప్రజాప్రతినిధుల క్రీడల్లో ఉంటే వారి చుట్టుపక్కల అంగరక్షకుల హడావుడి ఎక్కువగా కనిపించింది. ప్రారం భోత్సవ సభ దగ్గర నుంచి క్రీడలు ముగిసే వరకు నానా హడావుడి చేశారు. మరోపక్క అసెంబ్లీ నుంచి వచ్చిన మార్షల్స్ హడావుడి దీనికి తోడైంది. ప్రజాప్రతినిధులంతా ఒక పక్కన కూర్చోవాలని, వారి వ్యక్తిగత సిబ్బంది మరో పక్క కూర్చోవాలని శాప్ ఛైర్మన్ రవినాయుడు మొదటి నుంచి మైక్‌లో చెబుతూ వచ్చారు. అయినా దీన్ని ఏమాత్రం పట్టించుకోకుండా వ్యక్తిగత సిబ్బంది, అంగరక్ష కులు వ్యవహరించారు. చివరికి ఎమ్మెల్యేల క్రికెట్ మ్యాచ్ జరుగుతున్నప్పుడు ప్రాంగణం చుట్టూ ఒక వలయంగా అడ్డుగా నిలబడిపోయారు. దీనిపై మిగిలిన వాళ్లంతా అసహనం వ్యక్తం చేశారు.

నిబంధనల ప్రకారమే రాజధాని నిర్మాణాలు

» ప్రపంచబ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ సభ్యులతో సీఆర్డీయే అధికారులు

కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో నిబంధనలు నిక్కచ్చిగా పాటి స్తున్నామని సీఆర్డీయే కమిషనర్ కె.కన్నబాబు తెలిపారు. ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ బృంద సభ్యులు సీఆర్‌డీఏ కార్యాలయంలోని ఆడిటోరియంలో మంగళవారం సీఆర్‌డీఏ, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొ రేషన్ లిమిటెడ్ అధికారులతో సమావేశమయ్యారు. కమిష నర్ కె.కన్నబాబు, అదనపు కమిషనర్లు జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్, మల్లారపు నవీన్‌తో పాటు సీఆర్‌డీఏ, ఏడీసీ ఎల్ అధికారులు రాజధానిలో చేపట్టిన పనులను గత ఏడా దిలో ఆయా పనులలో సాధించిన పురోగతిని వారికి వివ రించారు. ఈ సందర్భంగా కమిషనర్ కె.కన్నబాబు మాట్లా డుతూ రాజధాని అమరావతి నిర్మాణంలో ప్రొక్యూర్‌మెంట్, టెండరింగ్, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సంక్షేమ కార్య క్రమాల అమలులో కచ్చితంగా అమలు చేస్తున్నామన్నారు. దీనిపై బృంద సభ్యులకు ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేస్తామన్నారు. అనంతరం అదనపు కమిషనర్ జి.సాయి సూర్య ప్రవీణ్‌చంద్ మాట్లాడుతూ, అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వ రమే పరిష్కరించేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామ న్నారు. రాజధాని అమరావతి నిర్మాణ కార్యకలాపాలపై అధికారులు వివరించిన వివిధ అంశాలు, కార్యాచరణ, ఫిర్యాదులు పరిష్కరిస్తున్న విధానంపై బృంద సభ్యులు పూర్తిస్థాయిలో సంతృప్తి వ్యక్తం చేశారు.



కొత్తూరు తాడేపల్లి వెళ్లే మార్గంలో అసంపూర్తిగా నిలిచిన వెస్ట్ బైపాస్ పనులు

వెస్ట్ బైపాస్ అత్యవసరం!

(5వ పేజీ తరువాయి)

నిర్మిస్తున్నందున ఈ సమస్యను త్వరగా తేల్చా ల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం కూడా న్యాయస్థానంలో ఇంప్లీడ్ పిటిషన్ వేస్తే తప్ప ఈ సమస్యకు ఇప్పట్లో పరిష్కారం అయ్యేలా కనిపించటం లేదు. అలైన్‌మెంట్ వివాదాన్ని, ఎన్‌హెచ్ జరిపిన చెల్లిం పుల వివాదాలను పరిష్కరించటానికి తర్వాత చర్యలు తీసుకోవటానికి అవకాశం కోరాల్సిన అవ సరం ఉంది. ల్యాంకో పవర్ ప్లాంట్ వివాదం అన్నది కూడా రైతుల ఆవేదనకు అద్దం పట్టేది గానే ఉంది. ల్యాంకో పవర్ ప్లాంట్ మూతపడిన నేపథ్యంలో, దానిని ఆక్షన్‌కు పెట్టిన సందర్భంలో ట్రాన్స్‌మిషన్ లైన్ అలైన్‌మెంట్ మార్పు అన్నదే హాస్యాస్పదంగా ఉంది. ఈ విషయం తర్వాత న్యాయస్థానం ఎలాగూ తేల్చే అవకాశం ఉంది. ఈ లోపు వెస్ట్ బైపాస్ మిగిలిన పనుల పూర్తికి చర్యలు తీసుకుంటే రెండు నెలల్లో పనులు పూర్తి కావటమే కాకుండా అందుబాటులోకి వచ్చే అవ కాశం ఉంటుంది.

మండల పరిషత్‌లకు 20 శాతం ఆర్థిక సంఘం నిధులు

» జాస్తి వీరాంజనేయులు వెల్లడి

బెంజిసర్కిల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : జీవో 25 ప్రకారం రాష్ట్రంలో ఉన్న 660 మండల పరిషత్‌లకు ఇక నుంచి 20 శాతం ఆర్థిక సంఘం నిధులు కేటాయిస్తారని అఖిల భారత పంచా యతీ పరిషత్(న్యూఢిల్లీ) జాతీయ ఉపా ధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం రాష్ట్ర ముఖ్యసలహాదారు జాస్తి వీరాంజనేయులు మంగళవారం ఒక ప్రక టనలో తెలిపారు. ఇప్పటి వరకు నిధుల కేటాయింపు 15 శాతంగా ఉండేదన్నారు. ఈమేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభి వృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారన్నారు. కేంద్రప్రభుత్వం ప్రస్తుత జనాభా ప్రాతిప దికనే ఆర్థిక సంఘం నిధులు కేటాయిం చాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఐఐటీ మెడికల్ అకాడమీ కొనసాగించాలి

భారతీనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల ఐఐటీ మెడికల్ అకాడమీని కొనసాగించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారిచేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపా ధ్యక్షుడు ఎం.సాయికుమార్ అన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య సమా వేశం నగర నాయకుడు ఎస్.రంజిత్ అధ్యక్షతన మంగళవారం దాసరి భవన్‌లో జరిగింది. సమావేశంలో సాయికుమార్ మాట్లాడుతూ.. ఐఐటీ మెడికల్ అకాడమీ మూసివేస్తూ ఏపీ సాంఘిక సంక్షేమశాఖ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూన్నామ న్నారు. ఈడుపుగల్లు ఐఐటీ మెడికల్ అకా డమీని కొనసాగిస్తేనే విద్యార్థులకు మెరు గైన విద్య, భవిష్యత్ భద్రం గా ఉంటుంద న్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసు కొని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ మెడి కల్ అకాడమీని కొనసాగించేలా ఉత్త ర్వులు చేయాలన్నారు.

23న ఏఎన్‌యూ దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ ఉమ్మడి ప్రవేశ పరీక్ష

పెదకాకాని, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య నాగార్జున విద్యాలయం దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో 2025 వి ద్యా సంవత్సరానికిగాను రెండేళ్ల మాస్టర్ ఆఫ్‌బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) కోర్సులలో ప్రవేశ పరీక్ష షెడ్యూల్ విడుదల చేసినట్టు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఈ నెల 23న రాష్ట్రవ్యాప్తంగా 7 కేంద్రాలలో ప్రవేశ పరీక్ష జరుగుతుందని చెప్పారు.

రామలింగేశ్వరునికే శఠగోపం

- 23 ఎకరాలకు కౌలు ఏడాదికి రూ.48 వేలు
- పాటదారుకు సబ్‌లీజు ద్వారా ఏడాదికి రూ.5 లక్షలకు పైనే
- ఈవో, కౌలుదారుల కుమ్మక్కు
- దేవస్థానం ఆదాయానికి భారీగా గండి

- ప్రస్తుత ఈవోపై ఆరోపణలు

(ఆంధ్రజ్యోతి, వన్‌టౌన్)

మైలవరం నియోజకవర్గం జీ కొండూరు మండలం, ఆత్కూరులోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానానికి ఆ గ్రామంలో ఆర్.ఎస్.నెం.182/2లో 12.92 ఎకరాలు, సర్వే నెంబరు 185/1,3లో 10.90 ఎకరాలు కలిపి మొత్తం మెట్ట భూమి 23.82 ఎకరాలు ఉంది. ఈ భూమికి గత పదేళ్లుగా ఆలయ బాధ్యతలు నిర్వహిం చిన అధికారులు సరిగా పర్యవేక్షణ చేయకపోవటంతో అడవిని తలపించే విధంగా పిచ్చిమొక్కలు పెరిగాయి. దీంతో అప్పటి నుంచి నిరుపయోగంగానే ఉంది. ఇటీ వల దేవస్థానం ఈవోగా బాధ్యతలు తీసుకున్న నాగ రాజు ఆ భూమి పై ప్రత్యేక దృష్టి పెట్టి స్థానికులతో లోపాయికారిగా మాట్లాడుకుని బహిరంగ వేలం నిర్వ హించేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. 23 ఎక రాల 82 సెంట్లకు ఈనెల 5న ఆలయ ప్రాంగణంలోనే బహిరంగ వేలం నిర్వహించారు. దేవస్థానం అధికా రులు మూడు సంవత్సరాలకు నిర్వహించిన వేలం పాటలో సుమారు ఎనిమిది మంది నుంచి పది మంది పాల్గొన్నారు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఈ భూమికి ఏడాదికి రూ.48 వేలు చొప్పున చెల్లించేవి ధంగా పాట దక్కించుకున్నాడు. పాటలో పాల్గొన్నవా రందరూ పాడుకున్న వ్యక్తి అంత ధరకు ఎందుకు పాడుకున్నాడు, ఈ భూమిని ఏమిచే స్తాడు, పిచ్చి మొక్కలు తొలగించి చదును చేయటానికే సుమారు రూ.3, 4 లక్షలు అవుతుంది. దేవస్థానం నిబంధ నల మేరకు, ఈ మూడేళ్లలో దీనిపై ఆదాయం ఎంత సంపాదిస్తాడన్న ఆలోచ నలో పడ్డారు. రెండు మూడు రోజుల తరువాత గాని పాడుకున్న వ్యక్తి ఈ భూమి ఏమి చేస్తాడు, ఎవరికి లీజుకు ఇస్తాడు, ఎంతకు లీజుకు ఇస్తున్నాడు అన్న వ్యవహారం మొత్తం వెలుగులోకి వచ్చింది. ఆ భూమిని పాట దారు ఓ ప్రముఖ సంస్థకు డంపింగ్ కోసం లీజుకిచ్చినట్టు సమాచారం. అందులో షెడ్లు నిర్మించబోతున్నారని, డంపింగ్‌కు ఏడాదికి ఐదు లక్షల రూపాయలకు అద్దెకి చ్చారన్న విషయం తెలియగానే గ్రామస్తులందరూ ఒక్కసారిగా అవాక్కయ్యారు. దేవదాయ శాఖ ఆదా యానికి భారీగా గండి పడే విధంగా వ్యవహరించ టంపై గ్రామంలో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

> దేవదాయ శాఖలో పనిచేసే కొందరు ఉద్యోగులకు దేవుడన్నా భయం లేకుండా పోతోంది. దేవాలయ ఆస్తులను అడ్డదారిలో అమ్ముకుంటూ జేబులు నింపు కుంటూ కొందరు దేవునికే శఠగోపం పెడుతు న్నారు. మరికొందరు అధికారులు బయట వారితో కుమ్మక్కై దేవస్థానం భూములను కారు చౌకగా కౌలుకు కట్టబెట్టి, వారి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు దండుకుంటున్నారు.



ఆత్కూరులోని శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం

ఈవో పొంతన లేని సమాధానం

23.82 సెంట్ల భూమిని పాడుకున్న లీజుదారుడు ఓ ప్రముఖ సంస్థకు అధిక ధరకు సబ్ లీజుకు ఇచ్చిన వ్యవహారంపై ఈవోను వివరణ కోరగా, పొంతన లేని సమాధానాలు చెప్పారు. మొదట వేలం పాట బాగానే జరిగింది అని చెప్పి, ఆ తరువాత లీజు దారుడు వేరే సంస్థకు ఏడాదికి సుమారు రూ.3.50 లక్షలకు పైగా సబ్ లీజుకు ఇచ్చాడని మరోసారి చెప్పారు. లీజుదా రుడు నిబంధనలు ఉల్లంఘించాడని, పైస్థాయి అధికా రుల దృష్టికి తీసుకువెళ్లి టెండర్‌ను రద్దు చేస్తామని చెప్పారు.

స్థలాన్ని పరిశీలిస్తా

- పామర్తి సీతారామయ్య, ఎన్టీఆర్ జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్

వేలంలో దేవదాయ శాఖ నిబంధనలు ఉల్లంఘన లపై ఎన్టీఆర్ జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిష నర్ పామర్తి సీతారామయ్యను వివరణ కోరగా పూర్తి వివరాలు తనకు తెలియదని, స్థలాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105,114, 125
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 435

టీఎన్‌టీయూసీ ఆటో డ్రైవర్ల రాష్ట్ర మహాసభ నేడు

బెంజిసర్కిల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగునాడు ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో టీఎన్‌టీయూసీ ఆటో డ్రైవర్ల రాష్ట్ర మహాసభ, అవగాహన సదస్సు బుధవారం సాయంత్రం 6గంటలకు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరగనుంది. ఈ మహాసభకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)తోపాటు పలువులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, నేతలు పాల్గొనున్నారు.

మహిళల భద్రతకు శక్తి యాప్

ఏసీపీ దామోదర్

పటమట/ఆటోనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయంలో మహిళలు శక్తి యాప్ వినియోగించుకోవాలని, ఈ యాప్ మహిళల భద్రత కోసమే ప్రత్యేకంగా రూపొందించిందని ఏసీపీ దామోదర్ తెలిపారు. మంగళవారం పటమట పోలీసుల ఆధ్వర్యంలో స్టెల్లా కళాశాల విద్యార్థినులకు శక్తి యాప్‌పై ఏసీపీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ మహిళ శక్తి యాప్‌ను ఫోన్లో డౌన్లోడ్ చేసుకోవాలని, ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్న వారి ఫోను కంట్రోల్ రూమ్‌కి కనెక్ట్ అవుతుందన్నారు. ప్రమాదంలో కానీ అత్యవసర సమాయాల్లో ఫోనును 5 సార్లు షేక్ చేస్తే ప్రమాదంలో ఉన్నట్లు కంట్రోల్ రూమ్‌కు అలర్ట్ వస్తుందన్నారు. దీంతో దగ్గర్లోని పోలీసులు 5 నిమిషాల్లో బాధిత మహిళల వద్దకు వచ్చి సహాయం చేస్తారని వెల్లడించారు. అంతేకాకుండా ఇంట్లో నుంచి ఫిర్యాదు చేయొచ్చని, మిస్సింగ్ కేసు ఫిర్యాదులు ఈ యాప్ నుంచే చేయవచ్చన్నారు. రాత్రి వేళల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు నియర్ బై షెల్టర్ బటన్ ప్రెస్ చేస్తే ఆయా ప్రాంతంలోని సురక్షిత హోమ్‌లు చూపిస్తాయని తెలిపారు. మహిళల భద్రతకు పోలీస్ శాఖ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పటమట సీఐ వల్లభనేని పవన్‌కిషోర్, ఎస్సైలు కృష్ణవర్మ, హరికృష్ణ, జీ. రేవతి, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఉషాకుమారి, ఇంటర్ వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, విద్యార్థినులు పాల్గొన్నారు.


శక్తి యాప్ ఇన్‌స్టాల్ చేసిన విద్యార్థినులతో ఏసీపీ దామోదర్, సీఐ పవన్ కిషోర్ తదితరులు

పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేద ప్రజల ఆరోగ్యానికి సీఎం సహాయ నిధి భరోసా కల్పిస్తుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. 12వ డివిజన్‌కు చెందిన కుట్టి కిషోర్ పిల్లలకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్‌వోసీ పత్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే తన కార్యాలయంలో లబ్ధిదారులకు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కిషోర్ భార్య పూజిత ఇటీవల కవలలకు జన్మనిచ్చిందని, వైద్యసేవల నిమిత్తం వారు సీఎం సహాయ నిధికి పెట్టుకోగా సీఎం చంద్రబాబు వెంటనే రూ.9 లక్షల సాయం అందించారన్నారు.

ఎల్‌వోసీ పత్రాన్ని అందుకున్న పుట్టి కిషోర్ మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ చెక్కు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. సీఎం, ఎమ్మెల్యేకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొట్లూరి సాయిబాబా, చలసాని రమణ, బావరాజు నాని, తదితరులు పాల్గొన్నారు.


ఎల్‌వోసీ పత్రాన్ని అందిస్తున్న గద్దె రామ్మోహన్

డ్రెయినేజీ, తాగునీటి సమస్య రాకుండా చూడండి

నగర కమిషనర్ ధ్యానచంద్ర

గుణదల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కొండ ప్రాంతవాసులకు వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూడాలని, అదే సమయంలో డ్రెయినేజీ సక్రమంగా పారుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం రెండో డివిజన్లో కార్పొరేటర్ అంబడిపూడి నిర్మల కుమారితో కలిసి ఇంటింటికి పర్యటించి క్షేత్ర స్థాయిలో స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రెయినేజీ, తాగునీటి సమస్యలను స్థానికులు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన కొండ ప్రాంతంలో క్వారీలో నీటి నిల్వలు ఎప్పటికప్పుడు తీసేయాలని ఆదేశించారు. చిన్నబోర్డింగ్ స్కూల్ వద్ద డ్రెయినేజీ నీరు సక్రమంగా పారుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కుమ్మర బజార్లో మురుగునీరు చేరకుండా ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. కొండ ప్రాంతాల్లో ఉన్న బూస్టర్ పంపులను పరిశీలించి అవసరమైతే మరమ్మతులు చేయించి తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె.షమ్మీ, ఇన్‌చార్జ్ మెడికల్ అధికారి డాక్టర్ సురేష్‌బాబు, ఈఈ స్వామ్రాజ్యం, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు పాల్గొన్నారు.


రెండో డివిజన్లో పర్యటించిన నగర కమిషనర్ ధ్యానచంద్ర


మదర్ థెరెస్సా జంక్షన్ నుంచి పిన్నమనేని రోడ్డులోకి వచ్చేటపుడు సిద్ధార్థ కళాశాల ప్రహరి పక్కన అడ్డుగా ఉన్న కేబుల్ స్తంభాలు


రోడ్డుపైనే కేబుల్ స్తంభాలు

- స్తంభాలు ఆసరాగా వాహనాల పార్కింగ్
- ట్రాఫిక్ జామ్

మొగల్రాజపురం, ఆంధ్రజ్యోతి: మొగల్రాజపురం మదర్ థెరెస్సా జంక్షన్ నుంచి పిన్నమనేని రోడ్డుకు వచ్చే మలుపులో పీబీ సిద్ధార్థ కళాశాల గోడ వార రోడ్డు మీద ఉన్న నెట్ కేబుల్ స్తంభాల వల్ల ఉదయం సాయంత్రం వేళ ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఈ రోడ్డు విస్తరించి సైడు కాల్వలు నిర్మించారు. ఇటీవల పాత రోడ్డులో ఉన్న కరెంటు స్తంభాలను కూడా దశల వారీగా మార్చి సైడు కాల్వ పక్కన వేశారు. కానీ పాత రోడ్డు ఉన్నపుడు ఉన్న నెట్ కేబుల్ స్తంభాలు మాత్రం అలాగే ఉండిపోయాయి. కళాశాల గోడ వార ఉన్న పండ్లబళ్ల వద్దకు కార్లలో వచ్చే వినియోగదారులు కార్లను స్తంభాల పక్కన పార్కింగ్ చేస్తున్నారు. రెండు వరసల్లో వాహనాలు వెళ్లాల్సిన ఈ రోడ్డులో ఒక వరసలోనే వాహనాలు వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో ఉదయం, సాయంత్రం వేళ వాహన రాకపోకల సమయంలో ట్రాఫిక్ జామ్ అవుతోంది. వీఎంసీ అధికారులు స్పందించి సదరు స్తంభాలను సైడు కాల్వ పక్కకు మార్పించాలని స్థానికులు కోరుతున్నారు.

సరిగ్గా ఆడట్లేదని బాలికను బ్యాట్‌తో కొట్టిన కోచ్

ఆటోనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సరిగ్గా ఆడట్లేదని బాలిక(11) చేయి విరిగేలా కోచ్ కొట్టిన ఘటన పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం మహానాడు జంక్షన్‌లో ఉన్న నాగార్జుననగర్‌లోని తాతయ్య వద్ద ఉంటున్న దేవిశ్రీ గత 9 నెలలుగా భారతీనగర్‌లోని సాయి సందీప్ బ్యాడ్మింటన్ అకాడమీలో కోచింగ్ తీసుకుంటుంది. మంగళవారం దేవిశ్రీ కోచింగ్‌కి వెళ్లగా సరిగ్గా ఆడడం లేదని కోచ్ మందలించాడు. ప్రదర్శనలో మార్పు రాకపోవడంతో కోపంతో బ్యాట్‌తో బాలిక ఎడమ చేతిపై బలంగా కొట్టాడు. పాప ఎడమ చేతికి వాపు వచ్చింది. ఇంటికి వెళ్లి తాతయ్యకు వివరించింది. ఈ విషయంపై పటమట పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పవన్‌కిషోర్ తెలిపారు.






నలంద విద్యానికేతన్‌లో కేజీ గ్రాడ్యుయేషన్ డే

గవర్నర్‌పేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక నలంద విద్యానికేతన్ ప్రైమరీ విభాగంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ప్రీ ప్రైమరీ, వన్‌టౌన్ యూకేజీ గ్రాడ్యుయేషన్ డే మంగళవారం ఘనంగా ముగిసింది. కిండర్ గ్రాడ్యుయేషన్ విద్యను పూర్తి చేసుకున్న చిన్నారులు నల్లని కోటు ధరించి కేజీ పట్టాలను అందుకోవడానికి రావడం విద్యార్థులు, తల్లిదండ్రులను ఆకట్టుకుంది. ముఖ్య అతిథి డాక్టర్ రోహిత, డాక్టర్ లక్ష్మీశ్రీ, డాక్టర్ సోమలత, ప్రొఫెసర్ రమ్య, నలంద విద్యానికేతన్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ, కేజీ ఇన్‌చార్జి రాజేశ్వరి, వన్‌టౌన్ బ్రాంచి ఇన్‌చార్జి హేమశ్రీలు చిన్నారులకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ, పాశ్చాత్య నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ప్రజా సమస్యలపై సీపీఎం ధర్నా

కృష్ణలంక, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంక 21వ డివిజన్ పరిధిలో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం 106, 108 సచివాలయం వద్ద నిరసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులుదోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ రణదీవెనగర్ మినహా మిగతా అన్ని ప్రాంతాల్లోనూ మంచినీటి సమస్యతో తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారన్నారు. డివిజన్ మొత్తం విపరీతమైన దోమల సమస్య వుందన్నారు. మురుగు నీటి డ్రెయినేజీలు పొంగిపొర్లుతున్నాయన్నారు. రిటైనింగ్ వాల్ పూర్తయినా అవుట్‌పాల్ డ్రెయిన్ ఇప్పటికీ చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సార్లు కార్పొరేషన్ అధికారులకు, ప్రభుత్వానికి ఈ సమస్యపై నివేదించినా, వినతులు తెలిపినా పరిష్కారం చేయలేదన్నారు. వెంటనే అవుట్‌పాల్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలని కాశీనాథ్ తెలిపారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తయినందున ఈ ప్రాంత ఇళ్లకు రిజిస్ట్రేషన్‌తో కూడిన పట్టాలు మంజూరు చేయాలని తెలిపారు. ప్రభుత్వ అధికారులు తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించకపోతే కార్పొరేషన్ కార్యాలయం వద్దే నిరసనకు దిగుతామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు పుప్పాల కృష్ణ, కోరాడ రమణ, రాజాన అప్పలనాయుడు, లక్ష్మీ, పద్మిని పాల్గొన్నారు.


సచివాలయం వద్ద సీపీఎం నాయకుల నిరసన



21న ఎన్టీఆర్ భవన్‌లో ఇఫ్తార్ విందు

వన్‌టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఈనెల 21న సాయంత్రం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లోని ఎంపీ కార్యాలయంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వనున్నారు. ఈ మేరకు ఇందుకు సంబంధించి ఆహ్వాన పత్రికలను టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫతావుల్లా పలువురు ముస్లిం సోదరులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ శివనాథ్ ఆతిథ్యాన్ని స్వీకరించాలని, ఈనెల 21న సాయంత్రం 5 గంటలకల్లా గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లోని శివనాథ్ కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ముస్లిం మత పెద్దలు, జమతుల్ పెద్దలు తదితరులు పాల్గొంటారన్నారు. ఆవిష్కరణ కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ నాయకులు రజావుల్లా, అన్సార్, ఇమ్రాన్, జాహిద్, సుభానీ, సత్తార్, కరీముల్లా, ఆలీ, నజీబ్, తదితరులు పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫతావుల్లా


విజయమేరీ పాఠశాలకు కంప్యూటర్, కార్డెలెస్ మైక్ సెట్ అందజేస్తున్న యూబీఐ మచిలీపట్నం రీజనల్ హెడ్ వెంకటరావు

విజయమేరీ పాఠశాలకు కంప్యూటర్, కార్డ్‌లెస్ మైక్‌సెట్ వితరణ

గుణదల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మచిలీపట్నం రీజియన్ బ్యాంకు ఉద్యోగులు గుణదల్లోని విజయమేరీ ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఆఫ్ బ్లైండ్ పాఠశాలకు కంప్యూటర్, కార్డెలెస్ మైక్ సెట్‌ను అందజేశారని మచిలీపట్నం రీజియన్ హెడ్ కె.వెంకటరావు తెలిపారు. గుణదల్లోని విజయమేరీ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూబీఐ మచిలీపట్నం రీజియన్ బ్యాంక్ మహిళా ఉద్యోగినులు పాల్గొని పిల్లలకు స్నాక్స్ పంపిణీ చేశారు. మడోన్నా హైస్కూల్ ఫర్ డఫ్ పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్లు, స్టాండ్ ఫ్యాన్లు అందజేశారు. ఈతరహా కార్యక్రమాలను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంపవర్ హర్‌లో భాగంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఉద్యోగినులు మాధురి, ఉమా, నూకరత్నం, పుష్పకళ, రాజేశ్వరి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో ట్రాఫిక్ కష్టాలు

ఆటోనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్‌లో ట్రాఫిక్ కష్టాలు అంతకంతకు పెరుగుపోతున్నాయి. పంట కాల్వ రోడ్డు నుంచి ఆటోనగర్ మీదుగా సనత్‌నగర్, ఆటోనగర్ వంద అడుగులు రోడ్డు వైపు వెళ్లే వారికి ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ప్రధానంగా పంటకాల్వ రోడ్డు నుంచి ఆటోనగర్ కలిసే ప్రాంతం వద్ద సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ స్తంభిస్తోంది. ట్రాఫిక్‌ని నియంత్రించే పోలీసులు లేకపోవడంతో వాహనదారులు అడ్డదిడ్డంగా వెళ్తున్నారు. దీని వల్ల సామాన్యులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నారు. ఓ వైపు హోటల్స్ ..ఆ పక్కనే బైక్, కార్ల పార్కింగ్‌తో రహదారి కుచించుకుపోయింది. దీంతో అటుగా వాహనదారులు ప్రయాణించాలంటే ట్రాఫిక్‌లో ఇరుక్కుపోక తప్పదు. ప్రధాన కూడలి వద్ద చిన్న యూటర్న్ ఉండడం, భారీ వాహనాలు మలుపు తీసుకునేది అక్కడే కావడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని వాహనదారులు చెబుతున్నారు. రహదారిపై పార్కింగ్‌ను తొలగించాలని , ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించాలని వాహనదారులు కోరుతున్నారు.


ఇస్మాయిల్ హోటల్ సమీపంలో ట్రాఫిక్‌లో వాహనదారులు

దుర్గగుడిలో సంకట హర గణేశుడికి అర్చన, హోమం

ఇంద్రకీలాద్రి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో మంగళవారం గణపతికి విశేష అర్చన నిర్వహించారు. అభిషేకం, అర్చన, హోమాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతి పౌర్ణమి తరువాత వచ్చే చవితినాడు సంకష్టహర గణపతిని ఆరాధించడం జరుగుతుందన్నారు. దుర్గామల్లేశ్వర దేవస్థానం ప్రతినెలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు.





విజయవాడలోని ఐజీఎం స్టేడియంలో జరిగిన ప్రజాప్రతినిధుల క్రీడా సంబరాల్లో పాల్గొన్న కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా ప్రజా ప్రతినిధులు మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు కాగిత కృష్ణ ప్రసాద్, వెనిగండ్ల రాము, గద్దె రామ్మోహన్, మండలి బుద్ధప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, బోడె ప్రసాద్, శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), తంగిరాల సౌమ్య, తదితరులు

వైభవంగా తిరుపతమ్మకు బోనాలు

పెనుగంచిప్రోలు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరునాళ్ల మహోత్సవాలు భక్తులు సమర్పించి బోనాల స మర్పణతో వైభవంగా ముగిశాయి. ఆలయ డిప్యూటీ కమిషనర్ బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్ కుమార్, ధర్మకర్తల మండలి చైర్మన్ జంగాల శ్రీనివాస రావు, ఈఈ ఎల్ రమా, సిబ్బంది ఈ బోనాలను భక్తిశ్రద్ధలతో స మర్పించగా, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. గుంటూరు జిల్లా ఫి రంగిపురానికి చెందిన వల్లంరెడ్డి భూశంకర్‌రెడ్డి రూ.25వేలు, కడప జి ల్లా భగత్‌నగర్‌కు చెందిన చిన్ని చేతన్ అనే భక్తుడు రూ.10,108, పె నుగంచిప్రోలు మండలంలోని గుమ్మడిదుర్రుకు చెందిన కొమరగిరి నాగేశ్వరరావు రూ.5,116 విరాళాన్ని ఆలయానికి అందించారు. దాతల కు అమ్మవారు, స్వామి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందించారు.

ఆదాయం రూ.కోటి

తిరుపతమ్మ దేవస్థానం వద్ద పలు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు ఆలయం వద్ద ఈవో కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో బహిరంగ వేలంపాట నిర్వహించారు. కొబ్బరికాయలు విక్రయించుకునేందుకు రూ.58.50 లక్షలు, పొంగలి షెడ్ నిర్వహణకు రూ.29.55 లక్షలు, మ ట్టికుండల విక్రయానికి రూ.15.50 లక్షలు మొత్తంగా రూ.1,03,55,000 ఆదాయంగా వచ్చినట్టు ఈవో కిషోర్‌కుమార్ తెలిపారు. ధర్మకర్తల మండలి చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ధర్మకర్తలు, ఈఈ రమా, కాంట్రాక్టర్లు ఎండోమెంట్ అధికారులు పాల్గొన్నారు.



బోనాలు సమర్పిస్తున్న ఆలయ ఈవో, చైర్మన్, ఈఈలు

తిరునాళ్లలో అపశ్రుతి.. ఒకరి మృతి



తిరుపతమ్మ చిన్న తిరునాళ్ల మహోత్సవాల ముగింపు రోజున మంగళవారం రాత్రి అపశ్రుతి చోటు చేసుకుంది.మంగళవారం రాత్రి తిరునాళ్ల తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున వచ్చారు. క్రాస్ జెయింట్ వీల్‌లో నిండుగా భక్తులు ఆనందంగా తిరుగుతుండగా అందులోని ఒక బాక్స్ ఊడిపోయి దూరంగా కింద పడింది. అందులో ఉన్న వత్సవాయి మండలం కొత్త రేగులగడ్డ గ్రామానికి చెందిన గింజుపల్లి సాయి మణికంఠ (25) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అదేబాక్స్‌లో అతడి తమ్ముడు గోపీకి తీవ్ర గాయాలవడంతో అతడిని 108లో ప్రభుత్వాసుపత్రికి జగ్గయ్యపేట తరలించారు. సాయిమణికంఠ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట తరలించి కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎమ్ఎస్‌కే అర్జున తెలిపారు.

23, 24, 25 తేదీల్లో పలు రైళ్ల రద్దు

రైల్వే స్టేషన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో సామర్లకోట, పిఠాపురం, గొల్లప్రోలు, రావికంపాడు, ఆటోమేటిక్ లాక్ సిగ్నలింగ్ ఏర్పాటుకు నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతుండటంతో ఈనెల 23, 24, 25 తేదీల్లో ఆ మార్గంలో పలు రైళ్లను రద్దు చేసినట్టు విజయవాడ డివిజన్ పీఆర్‌వో నుస్రత్ ఎం మండ్రూపకర్ ఒక ప్రకటనలో తెలిపారు. 17267, 17268 విశాఖపట్నం - కాకినాడ పోర్టు అప్ అండ్ డౌన్ సర్వీసులు, 67285, 67286 విశాఖపట్నం - రాజమండ్రి అప్ అండ్ డౌన్ సర్వీసులు, 22876 గుంటూరు - విశాఖపట్నం రైళ్లను ఈనెల 24న రద్దు చేశారు. 17239 గుంటూరు విశాఖపట్నం రైలును ఈనెల 23, 24వ తేదీల్లో రద్దు చేశారు. 17240 విశాఖపట్నం - గుంటూరు రైలును ఈనెల 24, 25 తేదీల్లో రద్దు చేశారు.

కొన్ని ప్రత్యేక రైళ్ల సర్వీసులు పొడిగింపు

వేసవి రద్దీని తట్టుకునేందుకు కొన్ని ప్రత్యేక రైళ్ల సర్వీసులను పొడిగించారు. ఈమేరకు సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఏ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నడిచే 07605 తిరుపతి - అకోలా రైలు ఏప్రిల్ 4 నుంచి జూన్ 27 వరకు పొడిగించారు. ఆదివారం నడిచే 07606 అకోలా - తిరుపతి రైలును ఏప్రిల్ 6 నుంచి జూన్ 29 వరకు పొడిగించారు. సోమవారం నడిచే 07609 పూర్ణా - తిరుపతి రైలును ఏప్రిల్ 7 నుంచి జూన్ 30 వరకు, మంగళవారం నడిచే 07610 తిరుపతి - పూర్ణా రైలును ఏప్రిల్ 8 నుంచి జులై 1 వరకు పొడిగించారు. సోమ, బుధ, శుక్రవారాల్లో నడిచే 07445 కాకినాడ టౌన్ - లింగంపల్లి రైలును ఏప్రిల్ 2 నుంచి జూన్ 30 వరకు, మంగళ, గురు, శనివారాల్లో నడిచే 07446 లింగంపల్లి - కాకినాడ టౌన్ రైలును ఏప్రిల్ 3 నుంచి జులై 1 వరకు పొడిగించారు. ఆదివారం నడిచే 07481 తిరుపతి - వికారాబాద్ రైలును ఏప్రిల్ 6 నుంచి జూన్ 29 వరకు పొడిగించారు. సోమవారం నడిచే 07482 వికారాబాద్ - తిరుపతి రైలును ఏప్రిల్ 7 నుంచి జూన్ 30 వరకు పొడిగించారు. కాగా, 07481, 07482 తిరుపతి - వికారాబాద్ - తిరుపతి ఎక్స్‌ప్రెస్ చర్లపల్లి, సనత్‌నగర్, లింగంపల్లి స్టేషన్ల మీదుగా నడుస్తుంది. 07481 తిరుపతి - వికారాబాద్ రైలు ఏప్రిల్ 6 నుంచి జూన్ 29 వరకు నడుస్తుంది. ఈ రైలు తిరుపతిలో రాత్రి 7 గంటలకు బయలుదేరి, వికారాబాద్‌కు మరునాడు ఉదయం 7.10 గంటలకు చేరుకుంటుంది.



ఢిల్లీలో సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎంపీ శివనాథ్

ఢిల్లీలో సీఎం చంద్రబాబుకు ఘనస్వాగతం

వన్‌టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల పర్యటన ని మిత్తం ఢిల్లీ విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఢిల్లీ విమానాశ్రయంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పార్టీ సహచర ఎంపీలతో కలిసి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం రాత్రి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కుమార్తె వివాహ కార్యక్రమానికి హాజరు కానున్నారు.




మాజీ మంత్రి కళా వెంకట్రావుతో కలిసి డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్,

ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- మంత్రి గొట్టిపాటి రవికుమార్
- విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం డైరీ ఆవిష్కరణ

గాంధీనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఏపీ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రూపొందించిన 2025 డైరీని సచివాలయంలోని చాంబర్‌లో మంగళవారం మాజీ మంత్రి కళా వెంకట్రావ్‌తో కలిసి మంత్రి రవికుమార్ ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు ఉద్యోగులు, కార్మికుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. 2022లో చేసిన పే ఫిక్షేషన్‌లో జరిగిన బేసిక్ పే సీలింగ్ ఎత్తివేయాలని కోరారు. సీలింగ్ లేని వైద్యం ఉద్యోగులకు అందించాలన్నారు. బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు, ఎస్‌పీడీసీఎల్ కార్యదర్శి వైవీ సునీల్, సంఘం అసోసియేట్ అధ్యక్షుడు జి.రాము, సీపీడీసీఎల్ కే ఉమామహేశ్వరరావు, ఎన్ వీరాంజనేయులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

సంస్థ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

- ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ
- బీసీ ఎంప్లాయిస్ సంక్షేమ సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ

బస్టేషన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణ సంస్థలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగులందరూ సమష్టిగా సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ రావు అన్నారు. మంగళవారం ఆర్టీసీ చైర్మన్ కార్యాలయంలో ప్రజా రవాణ సంస్థ బీసీ ఉద్యోగుల సంక్షేమ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శేషగిరిరావు ఆధ్వర్యంలో జరిగిన గౌరవాధ్యక్షుడు దువ్వారపు రామారావుతో కలిసి కొనకళ్ల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని, ఉద్యోగులంతా సమష్టిగా పనిచేసి సంస్థ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. దువ్వారపు రామారావు మాట్లాడుతూ కొనకళ్ల నారాయణరావు బీసీలకు ఆరాధ్యుడని, ఆయన చైర్మన్‌గా ఉండటం ఉద్యోగులకు ఒక వరమన్నారు. ఎస్వీ శేషగిరిరావు మాట్లాడుతూ బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గతంలో ఉన్న గ్రీవియన్స్ జాయింట్ సమావేశాలను పునరుద్ధరించాలన్నారు. ఉద్యోగులపై పనిష్మెంట్లకు సంబంధించిన 2019లో జారీ చేసిన సర్క్యులర్ 1ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. ఇంటర్నేషనల్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్వీ రావు, ప్రధాన కార్యదర్శి ఈతాకుల కృష్ణారావు, కె.ఎన్.లక్ష్మణుడు, జె.రాజా, రత్నం, ఆర్.వి.ఎస్.మన్యం, చక్రవర్తి, పి.భరణి, లింగయ్య, జానకిరామ్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఫైబర్ నెట్ సేవలు విస్తృతపరచాలి

- ఏపీ ఫైబర్ నెట్ కార్యాలయం వద్ద కేబుల్ ఆపరేటర్ల ఆందోళన



బస్టేషన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో ఆదరణ కోల్పోయిన ఏపీ ఫైబర్ నెట్‌ను టీడీపీ ప్రభుత్వం ప్రత్యేకదృష్టి పెట్టి ఫైబర్‌నెట్ సేవలు విస్తృతపరచాలని ఏపీ కేబుల్ ఆపరేటర్స్ జేఏసీ చైర్మన్ మిరియాల శ్రీరామ్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ ప్రాంగణంలో ఉన్న ఏపీ ఫైబర్ నెట్ కార్యాలయం వద్ద కేబుల్ ఆపరేటర్‌లు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ మిరియాల శ్రీరామ్ మాట్లాడుతూ 2017లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఏపీ ఫైబర్ నెట్‌ను ప్రారంభించారని, అప్పుడు 10 లక్షల కనెక్షన్లు ఉన్నాయన్నారు.. గత ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో ప్రజల ఆదరణ కోల్పోయి ప్రస్తుతం 4 లక్షల కనెక్షన్లు మాత్రమే ఉన్నాయన్నారు. సిగ్నల్ సరిగా లేకపోవటంతో చాలా మంది కనెక్షన్లు తొలగించుకుంటున్నారన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా ఏపీ ఫైబర్ నెట్ సేవలను సరిచేయటం లేదన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన జీవి రెడ్డి వైదొలిగిన తరువాత అధికారులు అసలు పట్టించుకోవటం లేదని తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని తెలిపారు. అనంతరం ఏపీ ఫైబర్ నెట్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందచేయటానికి ప్రయత్నించగా వారు అందుబాటులో లేకపోవటంతో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ మంత్రి పీతల సుజాతకు వినతి పత్రం అందచేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 500 మంది ఆపరేటర్లు పాల్గొన్నారు.

కార్యకర్తల కష్టంతోనే గెలుపు

- అభినందన సభలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి

భారతీనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయంలో కూటమి నేతలు, కార్యకర్తల పాత్ర ఎంతో ఉందని జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం అన్నారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు అభినందనలు తెలుపుతూ జిల్లా టీడీపీ అధ్యక్షులు నెట్టెం రఘురామ్ అధ్యక్షత మంగళవారం ఎన్టీఆర్ కాలనీలోని ది వెన్యూ కన్వెషన్‌హాల్‌లో అభినందన సభ జరిగింది. ఈ సమావేశంలో నెట్టెం రఘరామ్ మాట్లాడుతూ, కష్టపడి ఓట్లు చేర్పి, చివరి వరకు ఓటర్లను పోలింగ్ బూత్ వద్దకు తీసుకొచ్చి ఎమ్మెల్సీ ఆలపాటి రాజాకు విజయాన్ని అందించిన కూటమి నేతలకు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. ఆలపాటి రాజా మాట్లాడుతూ, నాపైన నమ్మకంతో అత్యధిక మెజారిటీతో గెలిపించిన పట్టభద్రులకు, కూటమి నేతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, కూటమి కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆలపాటి రాజాకు గద్దె అనురాధ అభినందనలు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా ఎన్నికైన రాజేంద్రప్రసాద్‌కు జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, టీడీపీ యువ నేత గద్దె క్రాంతికుమార్ అభినందనలు తెలిపారు. ఎమ్మెల్సీ అశోక్ బాబు, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులు వేమూరి ఆనంద్ బాబు, కొల్లి మాణిక్యాలరావు, నాగుల్ మీరా, అమ్మిశెట్టి వాసు, ఉండవల్లి శ్రీదేవి, డేగల ప్రభాకర్, ఫిరోజ్, వాసం మునియ్య, తూమాటి ప్రేమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికతో అసభ్య ప్రవర్తన

- సహజీవనం చేస్తున్న మహిళ కుమార్తెపై కన్ను
- అనంతరం పురుగు మందు తాగి చికిత్స పొందుతున్న ప్రబుద్ధుడు

జి.కొండూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని బాలిక పదేళ్ల నుంచి నాన్న నాన్నా అని వెంటే తిరుగుతోంది. ఆమెను కంటికి రెప్పలా కాపాడాల్సిన వ్యక్తే కన్నేశాడు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక తల్లి పోలీసులను ఆశ్రయించడంతో అ వమానభారంతో పురుగు మందు సే వించి విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన జి.కొండూరు మండలంలోని చెవుటూరులో సోమవారం జరిగింది. విజయవాడకు చెందిన ఓ మహిళకు భర్తతో పెళ్లయిన ఏడాదికే విడాకులయ్యాయి. ఇద్దరు పిల్లలతో చెవుటూరు వచ్చింది. అక్కడ ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడి పదేళ్లుగా కలిసి ఉంటుంది. ఆమెకున్న బాబు, పాప అతడ్నే తండ్రి అనుకుంటున్నారు. ఆమె విజయవాడలోని ఓ షాపింగ్ మాల్లో పనిచేస్తూ సోమవా రం డ్యూటీకి వెళ్లిన తరువాత ఈ ఘట న జరిగింది. పోలీసులు అతడిపై పో క్సో కేసు నమోదు చేసినట్టు తెలిసింది.

చంద్రబాబుకు కృతజ్ఞతలు

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బ్రహ్మయ్య మాదిగ

గాంధీనగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు క్యాబినేట్, అసెంబ్లీలో తీర్మానం చేయడంపై ఎమ్మార్పీఎస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. 30 ఏళ్ల మాదిగల ఆశ, ఆకాంక్షలను నె రవేర్చిన సీఎం చంద్రబాబుకు మాదిగ జాతి తరపున కృతజ్ఞతలు తెలిపారు. 1994లో ఎస్సీ వర్గీకరణ చేసిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. గాం ధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏ ర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఉరుసుపాటి బ్రహ్మయ్య మాదిగ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చంద్రబాబు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ సమావేశాలు నిర్వహించాలని నేతలకు పిలుపునిచ్చా రు. ఎస్సీలను మూడు గ్రూపులుగా వి భజిస్తూ రెల్లి కులానికి 1 శాతం, మాదిగలు, ఉపకులాలకు 6.5శాతం మాల లు, ఉపకులాలకు 7.5 శాతం రిజర్వేష న్ల వర్గీకరణ పక్రియ ఆమోదించాలని రాజీవ్ రంజన్ మిశ్రా నివేదికను క్యాబినేట్ ఆమోదించిందన్నారు. 21న ఎమ్మార్పీఎస్ ఉద్యమ పురిటిగడ్డ ఈదుమూడిలో అత్యవసర రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యచరణ పై చర్చిస్తామన్నారు. రాష్ట్ర కో-ఆర్డినేటర్లు మానికొండ శ్రీధర్ మాదిగ, పానుగంటి షాలెం రాజు మాదిగ పాల్గొన్నారు.

సారా రహిత జిల్లాగా మార్చుకుందాం

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

తిరువూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రమాదకరంగా ఉన్న కాపుసారాను సమష్టి కృషితో రూపుమాపి ఎన్టీఆర్ జిల్లాను కాపుసారా రహిత జిల్లాగా తీర్చిదిద్దుకుందామని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. మంగళవారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో స్థానిక శ్రీవాహిని ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటుచేసిన నవోదయం 2.0ను కలెక్టర్ లాంచ్ చేశారు. తొలుత నవోదయం 2.0 ప్రచార రథాన్ని అధికారులతో కలిసి ప్రారంభించిన ఆయన తర్వాత జరిగిన సదస్సులో మాట్లాడుతూ కాపుసారా ఎన్నో అనారోగ్య సమస్యలు తెస్తుందని, కిడ్నీ వ్యాధిని సైతం ఈ మహమ్మరి గురిచేస్తుందన్నారు. 2014లో నవోదయం-1 ద్వారా కొంతమేర ఫలితం సాధించామని, ప్రస్తుతం రాష్ట్రంలో కాపుసారాను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం నవోదయం 2.0 చేపట్టిందన్నారు. తిరువూరు డివిజన్ పరిధిలో సారా తయారీ, అమ్మకాలున్నాయని, ఆయా గ్రామాలను ప్రత్యేకంగా గుర్తించినట్టు వివరించారు. డివిజన్‌లో గ్రూపు ఏలో 5 గ్రామాలున్నాయని ఈ గ్రామాల్లో కాపుసారా తయారీ, అమ్మకాలు చేస్తున్నారని, గ్రూపు బీలో సారా తయారు చేస్తున్నారని, గ్రూపు సీ గ్రామాల్లో సారా అమ్మకాలు చేస్తున్నట్టు గుర్తించామన్నారు. జిల్లాలో గ్రామ, మండలం, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటుచేసి, సారా తయారీ, అమ్మకందారులతో చర్చించి ఆ వ్యాపారం నుంచి బయటపడేలా వారిలో చైతన్యం తేవాలన్నారు. ఇలాంటి వారికి ఇతర వృత్తులు చేసుకునేందుకు తోడ్పాటు అందిస్తామన్నారు. ఈ సదస్సులో ఆర్డీవో కె.మాధురి, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌చౌదరి, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎన్.శ్రీనివాసరావు, డీఆర్‌డీడీఏ పీడీ, కె.శ్రీనివాసరావు, ఎక్సైజ్ సీఐ జె.శ్రీనివాస్, సివిల్ సీఐ గిరిబాబు, తిరువూరు డివిజన్ పరిధిలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలపై ప్రత్యేక దృష్టి

కలెక్టరేట్: అర్హులకు ఇబ్బంది లేకుండా ఆర్‌వోఎఫ్ఆర్ (రికార్డ్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్) పట్టాల పంపిణీకి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన అటవీ శాఖ సమీక్ష సమావేశం జరిగింది. ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాల పంపిణీ, హరిత విస్తీర్ణం పెంపు, ఆక్రమణల నియంత్రణపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ హరితాంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు జిల్లాలో పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని, పచ్చదనం పెంచేలా వినూత్న కార్యాచరణతో అడుగులు వేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలోని వివిధ నీటి వనరుల గట్ల వెంబడి పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో పర్యావరణానికి మేలుతో పాటు గట్లు కూడా బలంగా ఉంటాయన్నారు. జిల్లాలో అటవీ భూములు ఆక్రమణలకు గురికాకుండా పటిష్ఠ నిఘా అవసరమని, ఏవైనా ఆక్రమణలను గుర్తిస్తే అటవీ, రెవెన్యూ అధికారులతో కూడిన జాయింట్ తనిఖీల బృందాలు క్షేత్రస్థాయి తనిఖీలు చేసి, చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, డీఎఫ్‌వో జి.సతీష్, ఎఫ్ఆర్‌వో కె.శ్రీనివాసులు రెడ్డి, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ ఎ.రవీంద్రరావు, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రసరమ్యభరితం 'శ్రీ కృష్ణ లీలామృతం'

విజయవాడ కల్చరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): 140 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన సురభి నాటక రంగాన్ని ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్ తంజావూరు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత, నృత్య కళాశాలలో నిర్వహిస్తున్న 'సురభి నాటక మహోత్సవాల్లో భాగంగా 4వ రోజు సురభి డ్రామా థియేటర్ - సురభి జయానంద్ బృందం, శ్రీ బాలాజీ సురభి థియేటర్, శ్రీ వెంకటేశ్వర నాట్యమండలి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'శ్రీకృష్ణలీలలు' నాటక ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. నాటక ప్రదర్శనలో కాళింగ మర్దనం, చిన్ని కృష్ణుని లీలలు, వసుదేవుడు శ్రీ బాల కృష్ణుడి సముద్రాలు దాటించి యశోద వద్దకు చేర్చడం, ఆకాశవాణి, అద్భుతమైన గ్రాఫిక్స్ సన్నివేశాలు, ఆహ్లాదకరమైన సంగీతంతో ప్రేక్షకులను భక్తిభావంలోకి తీసుకెళ్లింది. ఈ నాటక ప్రదర్శనలో వసుదేవుడిగా వాసుదేవరావు, యశోదగా నీరజ, శ్రీ మహావిష్ణువుగి చిన్న వెంకట్రావు, దేవేంద్రుడిగా సురభి జయానంద్, కంసుడిగా వెంకటేష్ ప్రసాద్, నారదుడిగా నిఖిలేష్, చిన్ని కృష్ణులుగా కౌశిక సాయి, స్నిగ్ధ మనోహరి నటించగా, నాగరాజు సంగీత సహకారం అందించారు.

కొత్త రుణ విధానం అమలు చేయాలి

- లోక్‌సభలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్



వన్‌టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈలకు ఆదాయం మరింతగా వచ్చేందుకు కొత్త రుణ విధానాలను అమలు చేయాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మంగళవారం లోక్‌సభలో ప్రస్తావించారు. విజయవాడ ఆటోనగర్‌లో పనిచేస్తున్న సుమారు లక్ష మందికి పైగా కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఆయన ప్రస్తావించారు. దేశంలోనే అతిపెద్దదైన విజయవాడ ఆటోనగర్ 305 ఎకరాల్లో ఉందని, లక్షమందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారన్నారు. ఇక్కడ ఎంఎస్ఎంఈ సంస్థలుగా అనేకం ఉన్నాయని, ఆటో మొబైల్ పరిశ్రమలు ఎంఎస్ఎంఈలు ఆర్థిక వ్యవస్థకు కీలకంగా ఉన్నాయన్నారు. వ్యాపారాల కోసం బ్యాంకు రుణాలు పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇందుకు సిబిల్ స్కోర్ అడ్డంకిగా మారిందన్నారు. వాస్తవంగా సిబిల్ స్కోర్ గతంలో తీసుకున్న రుణాల చెల్లింపుల ఆధారంగా లెక్కించబడుతుందన్నారు. కరోనా సమయంలో వ్యాపారాలు లేక రుణాలు చెల్లింపు సరిగా జరగలేదన్నారు. ఆ ప్రభావం సిబిల్ స్కోర్‌పై పడిందన్నారు. ఎంఎస్ఎంఈలకు తమ ఉత్పత్తులు అమ్మిన వెంటనే కస్టమర్ల నుంచి చె ల్లింపులు జరగవన్నారు. ఇది కూడా రుణాల చెల్లింపు విషయంలో జాప్యానికి కారణమని, అందు కే సిబిల్ స్కోర్ తగ్గిపోతుందన్నారు. సిబిల్ స్కోర్ ఆధారంగా కాకుండా ఎంఎస్ఎంఈలకు వారి ఆదాయాన్ని బట్టి రుణ అర్హతను నిర్ణయించే ఆదాయ ఆధారిత రుణ అంచనా విధానాన్ని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యను ప్రభుత్వం కూడా గుర్తించిందని, 2024-2025 కేంద్ర బడ్జెట్‌లో క్రెడిట్ స్కోర్‌పై ఆధారపడకుండా డిజిటల్ ఫుట్ ప్రింట్స్ ఆధారంగా కొత్త రుణ అంచనా విధానాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వ రంగ బ్యాంకులకు సూచించారన్నారు. దీంతో వాస్తవ ఆర్థిక స్థితిని అర్థం చేసుకుని ఎంఎస్ఎంఈలకు రుణాలు మంజూరు చేయటం సులభతరమవుతుందన్నారు.

పశువైద్య విద్యార్థులకు రూ.25వేలు ఇవ్వాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయికుమార్

బెంజిసర్కిల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పశువైద్య విద్యార్థులకు నెలకు రూ.25వేలు గౌరవ వేతనం ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సాయికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం విలేఖరులతో మాట్లాడుతూ గౌరవ వేతనం రూ.7వేల నుంచి రూ.2 5వేలకు పెంచాలని 44 రోజులుగా వి ద్యార్థులు ఆందోళన చేస్తున్నా ప్రభు త్వం మాత్రం రూ.7వేల నుంచి రూ. 10,500 పెంచుతూ ఉత్తర్వులివ్వడం సిగ్గుచేటన్నారు. ఎంబీబీఎస్, ఆయుష్ విద్యార్థులతో సమానంగా గౌరవ వేత నం ఇవ్వాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు.

చల్లటి నీళ్లు తాగవచ్చా..?

వేసవి వచ్చేసింది. మధ్యాహ్నం బయటకు వెళ్తే ఎండలు మండిపోతున్నాయి. ఇలాంటి సమయంలో చల్లటి నీళ్లు తాగితే ప్రాణం లేచి వస్తుంది. అయితే రిఫ్రిజిరేటర్ నుంచి తీసిన చల్లటి నీళ్లను తాగవద్దని.. తాగితే ఆరోగ్య సమస్యలు ఏర్పడే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీని వెనకున్న కారణాలు వివరిస్తున్నారు.

- ఎండ వేడికి శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. శరీరంలో నీటి శాతం తగ్గి దాహంగా అనిపిస్తుంది. అలాంటి సమయంలో బాగా చల్లగా ఉన్న నీళ్లు తాగితే వాటిని శరీరం శోషించలేదు. దీని వల్ల తలనొప్పి, మూత్రం రాకపోవడం, అలసట, కండరాల తిమ్మిరి లాంటి సమస్యలు ఏర్పడతాయి. అందువల్ల బాగా దాహంగా ఉన్న సమయంలో మామూలు నీళ్లు లేదా కుండలోని నీళ్లు తాగడం మంచిది.

- బాగా చల్లగా ఉన్న నీళ్లు తాగడం వల్ల జీర్ణాశయం పనితీరు మందగిస్తుంది. తిన్న ఆహారపదార్థాలు త్వరగా జీర్ణం కావు. దీంతో అజీర్తి, కడుపు ఉబ్బరం, మలబద్ధకం లాంటి సమస్యలు ఏర్పడతాయి.



- బాగా చల్లగా ఉన్న నీళ్లు తాగడం వల్ల శ్వాసకోశంలోని రక్తనాళాలు సంకోచిస్తాయి. దీంతో ముక్కు, గొంతుకు సంబంధించిన సమస్యలు ఏర్పడతాయి. అందుకే ఎండలో తిరిగి ఇంటికి రాగానే చల్లటి నీళ్లు తాగితే వెంటనే జలుబు చేయడం, గొంతు మంట లాంటివి గమనించవచ్చు. ఎక్కువ సార్లు ఈ నీళ్లు తాగితే ఊపిరితిత్తుల్లో కఫం పేరుకుని ముక్కు దిబ్బడ, పొడిదగ్గు వేధిస్తాయి.

- దాహం అనిపించినప్పుడు బాగా చల్లగా ఉన్న నీళ్లు తాగితే నాడీ వ్యవస్థ ప్రభావితమవుతుంది. దీని వల్ల దంతాలపై ఉండే ఎనామెల్ పొర, చిగుళ్లలో ఉండే సున్నితమైన నరాలు దెబ్బతిని పళ్లు జివ్వుమంటాయి.



బహుముఖ ప్రతిభ

లక్ష్యం పట్ల నిబద్ధత, చక్కటి ప్రణాళిక ఉంటే అభిరుచులు కొనసాగిస్తూనే... చదువులో, పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు అందుకోవడం సాధ్యమేనంటున్నారు ప్రతిభా శేఖర్. కవిత్వం, యాంకరింగ్, ఫిలిమ్‌మేకింగ్, ఫొటోగ్రఫీ... ఇలా అనేక అంశాల్లో రాణిస్తున్న ఆమె ఎక్కడా శిక్షణ తీసుకోకుండా, స్వయం సన్నద్ధతతోనే గ్రూప్-1లో మంచి స్కోర్ సాధించారు. కొత్త ప్రదేశాలను సందర్శించడం, ప్రకృతిని ఆస్వాదించడం ఇష్టమంటున్న ప్రతిభ 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి...

"మా నాన్న శేఖర్... ఎల్‌ఐసిలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్. అమ్మ సుజాత తెలంగాణ ఆర్థిక శాఖలో జాయింట్ సెక్రటరీగా పని చేస్తున్నారు. ప్రభుత్వ రంగంలో ఉన్నత స్థానాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్న వారిద్దరినీ చూశాక.. పబ్లిక్ సర్వెంట్ కావాలన్న కోరిక నాకు చిన్న వయసులోనే కలిగింది. అదే లక్ష్యంగా నిర్దేశించుకున్నాను. 'నిట్- వరంగల్‌'లో బీటెక్ చేశాను. నాలుగేళ్ల క్రితం నుంచి యుపిఎస్‌సికి ప్రిపేర్ కావడం ప్రారంభించాను. ఆ తరువాత తెలంగాణ గ్రూప్-1 నోటిఫికేషన్ రావడంతో... దానికీ సన్నద్ధమయ్యాను. అందుకోసం నేను ఎక్కడా కోచింగ్ తీసుకోలేదు. 'ఎలా చదవాలి? ఏది ఎప్పుడు చదవాలి?' అని కచ్చితంగా ప్రణాళిక వేసుకొని, దాన్నే అనుసరించాను. తెలంగాణ రాష్ట్ర భాష, సాంస్కృతిక శాఖ డైరెక్టర్, మా కుటుంబానికి సన్నిహితుడు మామిడి హరికృష్ణగారు నాకు మెంటార్‌గా వ్యవహరించారు. ప్రశ్నలకు నేను రాసిన జవాబులను ఆయన మూల్యాంకన చేసేవారు. తాజాగా ప్రకటించిన ఫలితాల్లో నాకు 483.5 స్కోర్ వచ్చింది.

ఒత్తిడి తగ్గాలంటే...

సొంతంగా ప్రిపేర్ కావడం చాలా కష్టమని చాలామంది అనుకుంటారు. సరైన ప్రణాళిక ఉంటే అది ఏమాత్రం ఇబ్బంది కాదు. సాధారణ రోజుల్లో నాలుగైదు గంటలు చదివేదాన్ని. పరీక్షలు దగ్గరవుతున్నప్పుడు... నాలుగు నెలలపాటు ఏడెనిమిది గంటలు చదివాను. అలాగని పూర్తిగా దానికే అంకితం అయిపోలేదు. పెద్ద పరీక్షలకు సన్నద్ధం అవుతున్నప్పుడు సహజంగానే ఒత్తిడి ఉంటుంది. ఖాళీలు వందల్లో ఉంటే... పోటీపడేవారు లక్షల్లో ఉంటారు. పెద్ద లక్ష్యాల వెనుక పరిగెడుతున్నప్పుడు... మానసిక ఆరోగ్యం మీద కూడా ఆ ప్రభావం ఉంటుంది. ఇతర యాక్టివిటీస్ ద్వారా దాన్ని తగ్గించుకోవచ్చు. నా వరకూ నేను ట్రావెలింగ్‌ను ఇష్టపడతాను.

మూడు-నాలుగు నెలలకు ఒకసారి ఏదో ఒక ప్రదేశానికి వెళ్తాను. లద్దాఖ్, కేరళ, గోవా... ఇలా చాలా ప్రదేశాలను చూశాను. వీటిలో లద్దాఖ్ నాకు బాగా నచ్చిన ప్రదేశం. అక్కడ జనాభా తక్కువగా ఉంటుంది, ప్రకృతి సౌందర్యంతో అలరారుతూ ఉంటుంది. టూర్లకు వెళ్ళినప్పుడు... మిగిలిన వాటి గురించి ఆలోచనలన్నీ వదిలేస్తాను. ఆ పర్యటనను ఆస్వాదించడం మీదే మనసు లగ్నం చేస్తాను. తిరిగి వచ్చాక మళ్ళీ పనిలో పడడానికి కావలసిన ఉత్తేజాన్ని నాలో నింపుకొంటాను.

> **విజయానికి అయిదు మెట్లు**
>
> జీవితంలో ఏది సాధించాలన్నా అయిదు 'సి'లు చాలా ముఖ్యమని నేను నమ్ముతాను. వాటిలో మొదటిది కాన్ఫిడెన్స్... ఎప్పుడూ మనమీద మనకున్న నమ్మకాన్ని వదులుకోకూడదు. రెండోది కంటిన్యుటీ... అనుకున్నది సాధించేదాకా ఎన్ని అవరోధాలు ఎదురైనా దాన్ని కొనసాగించాలి. మూడోది కన్సిస్టెన్సీ... ఏ పనినైనా స్థిరత్వంతో, నిలకడగా చేయడం ముఖ్యం. నాలుగోది కర్టెసీ... అన్ని సమయాల్లో మర్యాదగా, వినయంతో నడుచుకోవడం ప్రధానం. అయిదోది కమ్యూనికేషన్... మనకి తెలిసిన విషయాన్ని, మన అభిప్రాయాన్ని స్పష్టంగా వివరించే సామర్థ్యం ఉండాలి. ఏ రంగంలోనైనా విజయానికి ఈ అయిదు అంశాలు సోపానాలవుతాయనేది నా అభిప్రాయం.





గొప్ప గౌరవంగా భావిస్తున్నా..

నేను పుట్టిందీ, పెరిగిందీ హైదరాబాద్‌లో. అన్ని విషయాల్లోనూ నన్ను ఎంతగానో నా తల్లితండ్రులు ప్రోత్సహించారు. ఇతర యాక్టివిటీస్ వల్ల పిల్లలు చదువులో వెనుకబడతారని చాలామంది తల్లితండ్రులు భావిస్తూ ఉంటారు. అది నిజం కాదు. పిల్లల సర్వతోముఖాభివృద్ధికి కేవలం చదువు మాత్రమే సరిపోదు. చదువును, మన అభిరుచులను బ్యాలన్స్ చేసుకోవడం తెలిస్తే... దేన్నీ వదులుకోనక్కర్లేదు. నాకు కవిత్వం చదవడం, రాయడం ఇష్టం. దినపత్రికల్లో ప్రచురితమయ్యే కవితల్ని చదవడం ద్వారా ఈ అభిరుచి మొదలయింది. హైస్కూల్‌లో ఉన్నప్పటి నుంచే తెలుగు, హిందీ, ఉర్దూ భాషల్లో కవితలు రాసేదాన్ని. కాలేజీకి వచ్చాక... అది మరింతగా పెరిగింది. నాలో కదిలే భావాలతో మలచిన హిందీ-ఉర్దూ కవితలతో 'మాన్ షాయరానే కా' అనే సంకలనాన్ని 2021లో విడుదల చేశాను. రిలాక్స్ కావాలనుకున్నప్పుడు కవితలు చదువుతాను, రాస్తాను. స్ఫూర్తిని, ప్రేరణను కలిగించే కవితలంటే ఇష్టం. ఉర్దూలో గాలిబ్, తెలుగులో శ్రీశ్రీ కవితలంటే ఇష్టం. రాబోయే రోజుల్లో మరికొన్ని కవితా సంకలనాలను తీసుకొస్తాను. ఇక, 2020లో 'నిట్- వరంగల్' యువజనోత్సవం సందర్భంగా నిర్వహించిన షార్ట్ ఫిలిమ్ మేకింగ్ పోటీలో మొదటి స్థానంలో నిలిచాను. తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ కోసం ఒక డాక్యుమెంటరీని రూపొందించాను. యాంకరింగ్ నాకు ఇష్టమైన మరో అంశం. స్కూల్లో, కాలేజీలోనే కాదు, అనేక ప్రభుత్వ కార్యక్రమాలకు యాంకర్‌గా వ్యవహరించాను. 'తెలంగాణ బతుకమ్మ ఫిల్మోత్సవ్' పేరిట నిర్వహించిన షార్ట్ ఫిల్మ్ పోటీలకు యాంకరింగ్ చేయడం నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నా. పర్యటనల్లో కనిపించిన మంచి దృశ్యాలను ఫొటోలు తీయడం నాకున్న ఇంకో హాబీ. సినిమాలు సెలక్టివ్‌గా చూస్తాను. సందేశాత్మక చిత్రాలు వస్తే వదిలిపెట్టను. గ్రూప్-1లో నాకు వచ్చిన మార్కుల ప్రకారం... మంచి పోస్టింగే వస్తుందని ఆశిస్తున్నాను. రాబోయే రోజుల్లో యుపిఎస్‌సిలో ర్యాంక్ సాధించాలనేది నా లక్ష్యం. దానికోసం సిద్ధమవుతున్నాను."

• కృష్ణశర్మ

పిల్లల్ని ఇంట్లో ఒంటరిగా వదిలి వెళుతున్నారా?

ఒక్కోసారి పిల్లలను ఇంట్లో ఒంటరిగా వదిలి తల్లిదండ్రులు బయటికి వెళ్లాల్సి వస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో, ముఖ్యమైన పనుల వల్ల ఇంటికి రావడం ఆలస్యం కావచ్చు కూడా! తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగస్తులైతే ఇలాంటి సందర్భాలు తరచుగా ఎదురవుతూ ఉంటాయి. ఇలా పిల్లలను ఇంట్లో ఒంటరిగా వదిలి వెళ్లడం వల్ల వాళ్లు స్వతంత్రంగా, బాధ్యతగా, ఆత్మవిశ్వాసంతో ఎదుగుతారని నిపుణులు చెబుతున్నారు. అయినప్పటికీ ఇలాంటప్పుడు తల్లిదండ్రులు కొన్ని జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

- ప్రస్తుతం పిల్లలంతా మొబైల్స్ వాడుతున్నారు. వాటిలో అమ్మ, నాన్న ఫోన్ నెంబర్లతో పాటు దగ్గరి బంధువులు, పక్కింటివారి ఫోన్ నెంబర్లను సేవ్ చేసి పెట్టాలి. అలాగే ఈ నెంబర్లను ఓ నోట్‌బుక్‌లో రాసి పిల్లలకు అందుబాటులో ఉంచడం మంచిది. ఏదైనా అవసరం వచ్చినప్పుడు ఎవరికి ఫోన్ చేయాలో పిల్లలకు ముందుగానే చెప్పాలి. బయటికి వెళ్లిన తరవాత కనీసం అరగంటకు ఒకసారైనా పిల్లలకు ఫోన్ చేసి వాళ్లు ఎలా ఉన్నారో తెలుసుకుంటూ ఉండాలి.



- పిల్లలు ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు ఎక్కువగా టీవీ లేదా యూట్యూబ్ చూస్తూ, వీడియో గేమ్‌లు ఆడుతూ సమయం గడిపేస్తూ ఉంటారు. ఇలా ఫోన్, ల్యాప్‌టాప్‌లను ఎక్కువగా వాడడం వల్ల వచ్చే అనర్థాల గురించి పిల్లలకు వివరించి చెప్పాలి. స్క్రీన్ టైమ్ విషయంలో కాస్త కఠినంగా వ్యవహరించడం మంచిది.

- పిల్లలు తినడానికి చిరుతిండి, అల్పాహారం లాంటివి వేర్వేరు బాక్సుల్లో సర్ది ఏది ఎప్పుడు తినాలో చెప్పాలి. గ్యాస్ స్టవ్, స్విచ్ బోర్డుల దగ్గరికి వెళ్లవద్దని చెప్పాలి. పదునైన చాకులు, కత్తెరలు పిల్లలకు అందుబాటులో లేకుండా చూసుకోవాలి.

- ఎవరైనా తలుపు తట్టినప్పుడు బయట ఎవరు ఉన్నారో తెలిసేవరకూ తలుపు తెరవవద్దని పిల్లలకు గట్టిగా చెప్పాలి. ఒకవేళ తెలిసినవారు వచ్చినా వెంటనే అమ్మానాన్నలకు ఫోన్ చేసి తలుపు తీయాలా ?వద్దా? అనేది అడగాలని చెప్పాలి. ఇంటి ముందు సెక్యూరిటీ కెమెరా అమర్చుకుంటే తలుపు ఎవరు తట్టారో సులభంగా తెలుసుకోవచ్చు. మీరు ఇంట్లో లేని సమయంలో బంధువులు లేదా స్నేహితులను ఇంటికి రానీయకపోవడం మంచిది.

ఫ్యాషన్

మది దోచే మండల

వైవిధ్యంగా కనిపించాలనుకునే ఫ్యాషన్ ప్రియుల కోసం కొత్త కొత్త ధోరణులు పుట్టుకొస్తూనే ఉంటాయి. వాటిలో తాజాగా ఆదరణ పొందుతున్న ఫ్యాషన్ స్టైల్... 'మండల'. దీని గురించి తెలుసుకుందామా?

సంస్కృత భాషలో 'మండల' అంటే వృత్తం అని అర్థం. విశ్వం లేదా వివిధ లోకాల్లోని దేవతలను సూచించే రేఖాగణిత నమూనాలు లేదా ఆకృతులను మండల అని సంబోధిస్తారు. అయితే కంటికి ఇంపుగా కనిపించడం, వైవిధ్యంగా ఉండడం మూలంగా మండల డిజైన్లతో దుస్తుల రూపకల్పన ఊపందుకుంది. నలుపు మీద తెలుపు గీతలతో రూపొందించే మండల డిజైన్లు సర్వత్రా ఆదరణ పొందుతూ ఉంటాయి. ఇవే కాకుండా ఆకట్టుకునే రంగులు, డిజైన్లలో కూడా మండల డిజైన్లు రూపొందుతూ ఉంటాయి.

నప్పే సొబగులతో...

అంగీలు, ఫ్రాక్‌లు, పొడవాటి గౌన్లు, లెహంగాలు.. ఇలా మండల డిజైన్‌తో ఎన్నో రకాల దుస్తులు రూపొందుతున్నాయి. అలాగే కాటన్‌తో పాటు లెనిన్, శాటిన్ వస్త్రాల మీద ముద్రించిన మండల డిజైన్లకు కూడా ఆదరణ పెరుగుతోంది. సౌకర్యం ప్రధానంగా రూపొందే బీచ్ వేర్, మండల డిజైన్లలోనే ఎక్కువగా రూపొందుతూ ఉంటాయి.

అయితే ఏ రకం దుస్తులు వేసుకున్నా, వాటికి నప్పే ఆభరణాలూ, ఇతరత్రా యాక్సెసరీస్‌లను జోడించినప్పుడే మండల డిజైన్లు చూడముచ్చటగా మారతాయి. కాబట్టి టెర్రకోట లేదా ఉడెన్ ఆభరణాలు, కొల్హాపురి చెప్పులు లాంటి వాటిని ఈ రకం దుస్తులకు జోడిస్తూ ఉండాలి.



అందమైన అనుబంధం

దుబాయ్ అంతర్జాతీయ స్టేడియం... చాంపియన్స్ ట్రోఫీ అంతిమ సమరం... భారత జట్టు అద్భుత విజయం తరువాత అక్కడ అత్యంత ఆకట్టుకున్నది... విరాట్ కోహ్లి, అనుష్కాశర్మల జంట. అరమరికలు లేని వారి అన్యోన్యత. మైదానంలో మ్యాచ్‌ను ప్రత్యక్షంగా చూసినవారు... రోజంతా టీవీలకు అతుక్కుపోయిన అభిమానులు... దాదాపు అందరి దృష్టి.. విరుష్కాల మీదే.

ఒకరు క్రికెట్‌లో కింగ్. మరొకరు ఒకప్పటి బాలీవుడ్ క్వీన్. ఇద్దరి దారులు... లక్ష్యాలు వేరైనా... ప్రేమ వారిని ఒక్కటి చేసింది. 36 ఏళ్ల అనుష్కా పుట్టింది ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో. ఆమె తండ్రి కల్నల్ అజయ్‌కుమార్ శర్మ. ఆర్మీ అధికారి. తల్లి అషిమాశర్మ గృహిణి. 'నటిగా కంటే ఒక ఆర్మీ అధికారి కూతురునని చెప్పుకోవడానికి నేను గర్వపడతా' అంటూ ఓ సందర్భంలో అనుష్కా చెప్పింది. బెంగళూరులో పెరిగిన ఆమె ప్రాథమిక విద్యాభ్యాసం... కొన్నాళ్లు అసోమ్‌లో సాగింది. భారత క్రికెట్ జట్టు మాజీ సారథి ఎంఎస్ ధోనీ సతీమణి సాక్షి... ఆమె సహవిద్యార్థిని. తిరిగి బెంగళూరుకు వచ్చిన అనుష్కా... అక్కడే ప్రాథమికోన్నత విద్య, డిగ్రీ పూర్తి చేసింది. తొలుత మోడలింగ్ లేదంటే జర్నలిజమ్‌లో కెరీర్‌ను ఎంచుకోవాలని అనుకుంది. రెండిటిలో మోడలింగ్‌కు వైపు మొగ్గు చూపి... ముంబయి వెళ్లింది. అక్కడ మోడలింగ్ చేస్తూనే నటనలో శిక్షణ తీసుకుంది. బాలీవుడ్‌లోకి ఘనంగా అడుగుపెట్టింది. తొలి చిత్రమే షారూక్‌ఖాన్‌తో. ఎన్నో వడపోతల తరువాత 'రబ్ నే బనాదీ జోడీ'లో అతని సరసన నటించే అద్భుత అవకాశం దక్కించుకుంది. ఆ బ్లాక్‌బస్టర్‌తో అగ్రతారల్లో ఒకరిగా నీరాజనాలు అందుకుంది.



ఇక క్రికెట్‌లో వేలకొద్దీ పరుగులు సాధించిన విరాట్ కోహ్లీది భిన్నమైన కథ. అతడి తండ్రి ప్రేమ్‌నాథ్ కోహ్లి క్రిమినల్ లాయర్. తల్లి సరోజ్ గృహిణి. ఢిల్లీలో పుట్టిన విరాట్‌కు ఊహ తెలిసినప్పటి నుంచి క్రికెట్టే ప్రపంచం. అతడి ఆసక్తిని గమనించిన తండ్రి అకాడమీలో చేర్పించి, శిక్షణ ఇప్పించారు. ఢిల్లీ అండర్-15 జట్టులో చోటు దక్కించుకున్న కోహ్లి... అసమాన ప్రతిభతో అంచలంచెలుగా ఎదిగాడు. 2006లో తండ్రి మరణించడంతో... ఆయన తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టడానికి మరింత శ్రమించాడు. 2008లో అండర్19 ప్రపంచ కప్‌లో భారత్‌ను విజయ తీరాలకు చేర్చాడు. అదే ఏడాది శ్రీలంక పర్యటనకు భారత సీనియర్ జట్టు నుంచి పిలుపు వచ్చింది. సిరీస్‌లో తొలి వన్డేతో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన కోహ్లి, టన్నుల కొద్దీ పరుగులతో క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ తరువాత అంతటి బ్యాట్స్‌మన్‌గా పేరు గడించాడు.

విభిన్న నేపథ్యాల నుంచి వచ్చి, విభిన్న లక్ష్యాల వైపు పయనిస్తున్న విరాట్, అనుష్కా తొలిసారి కలిసింది కూడా కెరీర్ పరంగానే. ఓ షాంపూ యాడ్ కోసం కలిసి నటించారు. అక్కడ వీరి పరిచయం ఆ తరువాత ప్రేమగా చిగురించింది. కొన్నేళ్ల సహజీవనం తరువాత 2017లో వివాహ బంధంతో ఇద్దరూ ఒక్కటయ్యారు. ఈ జంటకు 2021లో కూతురు పుట్టింది. గత ఏడాది ఫిబ్రవరిలో అనుష్కా మగ బిడ్డకు జన్మనిచ్చింది. విరాట్ ఎక్కడ ఉంటే అక్కడ అనుష్కా ప్రత్యక్షమవుతుంది. అతడు మైదానంలో ఉన్నప్పుడు... గ్యాలరీలో కూర్చొని ఉత్సాహపరుస్తుంది. అతడి గెలుపు తన గెలుపులా భావిస్తుంది. సగటు అభిమానిలా కేరింతలు కొడుతుంది. ఇవన్నీ క్రికెట్ ప్రేమికులకు కొత్తేమీ కాదు. విరాట్ కూడా అంతే. అతడి మనసులో ఆమె స్థానం అత్యున్నతం. క్రికెట్, కుటుంబం... ఇవే అతడి లోకం.



దీనికి కొనసాగింపుగా ఈ నెల తొమ్మిదిన ముగిసిన చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో విరుష్కాల అనురాగ బంధం మరోసారి కేంద్రబిందువైంది. తొలి బంతి నుంచి వీఐపీ గ్యాలరీలో కూర్చొని మ్యాచ్‌ను తిలకిస్తున్న అనుష్కా... మ్యాచ్ గెలవగానే ఒక్కసారిగా మైదానంలోకి పరుగెత్తుకొచ్చింది. వస్తూనే విరాట్‌ను హత్తుకొని ఆనందాన్ని పంచుకుంది. విరాట్ కూడా అంతే ప్రేమగా ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. కప్ గెలిచిన మధుర క్షణాలను ఆమె సమక్షంలో ఆస్వాదించాడు. తొలుత భారత్ గెలవగానే మైదానంలో ఉన్న విరాట్... గ్యాలరీలో కూర్చున్న అనుష్కా వైపు చూసి చేయి ఊపుతూ పలుకరించాడు. వెంటనే ఆమె చిరునవ్వుతో అతడికి అభివాదం చేసింది. కాసేపటికి మైదానంలోకి వచ్చి, విరాట్ చేయిలో చేయి వేసి ఎంతో అపురూపంగా అతడిని చూస్తూ నిలుచుంది.

ఈ మొత్తం ఎపిసోడ్‌లో ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదు. కానీ ఒకరి భావాలను ఒకరు పంచుకున్నారు. పక్కపక్కనే ఉన్నా... పెదవులు కదలకుండా కళ్లతోనే సంభాషించుకున్నారు. ఒకరికి ఒకరుగా... ఎంతో సౌకర్యంగా కనిపించారు. ఒక అందమైన బంధం దృఢంగా, కలకాలం నిలబడాలంటే ఏమేం కావాలి? అవన్నీ వీరి అనుబంధంలో ప్రతిబింబించాయి. ఇది ఆరోగ్యకరమైన ఒక మంచి వైవాహిక బంధానికి ప్రతీక అనేది ఫ్యామిలీ కౌన్సిలర్ల మాట. బయటకు వచ్చినప్పుడే కాదు... ఇంట్లో కూడా విరుష్కాలు ఎంత అన్యోన్యంగా ఉంటున్నారనేది ఇన్‌స్టాలో వాళ్ల ఫొటోలు, వీడియోలు చూస్తే అర్థమవుతుంది. ఒకరి ప్రతిబింబం మరొకరిలో ప్రతిబింబిస్తుంది.

ఫ్యాన్ శబ్దం చేస్తోందా?

ఎండాకాలం వచ్చేసింది. ఇళ్లలో రోజంతా సీలింగ్ ఫ్యాన్ తిరుగుతూనే ఉంటోంది. ఫ్యాన్ తిరుగుతున్నప్పుడు ఒక్కోసారి శబ్దాలు వస్తుంటాయి. చిన్న చిట్కాలతో ఈ సమస్యల నుంచి బయట పడవచ్చు.

- సీలింగ్ ఫ్యాన్ రెక్కలపై విపరీతంగా దుమ్ము చేరుతూ ఉంటుంది. దీనివల్ల ఫ్యాన్ తిరిగేటప్పుడు శబ్దం రావచ్చు. వారానికి ఒకసారి ఫ్యాన్‌ని, రెక్కలను పొడి గుడ్డతో తుడుస్తూ ఉంటే సమస్య తీరుతుంది.
- రోజుల తరబడి ఫ్యాన్ తిరుగుతూ ఉండడం వల్ల రెక్కలకు ఉండే స్క్రూలు లూజవుతాయి. దీని వల్ల కూడా ఫ్యాన్ నుంచి శబ్దాలు రావచ్చు. ఒకసారి వాటిని పరిశీలించి బిగిస్తే శబ్దాలు ఆగిపోతాయి.
- రెక్కలు కొద్దిగా వంగినా కూడా ఫ్యాన్ నుంచి పెద్ద పెద్ద శబ్దాలు రావచ్చు. ఫ్యాన్ రెక్కలను వంకర లేకుండా సరిచేస్తే సమస్య తీరుతుంది.
- ఫ్యాన్ తిరగడానికి ఉపకరించే భాగాలు పొడిగా మారినప్పుడు కూడా ఇదే సమస్య ఎదురుకావచ్చు. వాటిలో కొద్దిగా కొబ్బరి నూనె వేస్తే ఫలితం కనిపిస్తుంది.
- ఫ్యాన్‌ని నేరుగా సీలింగ్‌కు బిగించినా కూడా శబ్దాలు రావచ్చు. ఫ్యాన్‌కు, సీలింగ్‌కూ మధ్య రబ్బర్ కుషన్ అమరిస్తే సమస్య తీరుతుంది.






'ఫ్యామిలీ'కి ఓకే.. కానీ

న్యూఢిల్లీ: క్రికెటర్ల విదేశీ పర్యటనలో కుటుంబసభ్యులు ఉంటే మంచిదేనని, అయితే జట్టు ప్రయోజనాలు కూడా ముఖ్యమని దిగ్గజ ఆటగాడు కపిల్ దేవ్ అన్నాడు. ఇటీవల విరాట్ కోహ్లీ బీసీసీఐ ఫ్యామిలీ నిబంధనపై అసంతృప్తిని వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. 'ఫ్యామిలీని దూరంగా ఉంచాలనేది క్రికెట్ బోర్డు నిర్ణయం. నా దృష్టిలో క్రికెటర్లతో పాటు కుటుంబసభ్యులు ఉండడం అవసరమే. అదే సమయంలో వారు జట్టుకు కూడా ప్రాధాన్యమివ్వాలి. మా సమయంలో బోర్డుతో పనిలేకుండా టూర్ ఆరంభంలో మేమే కుటుంబాలను దూరం పెట్టేవాళ్లం. ఆ తర్వాత టూర్ ద్వితీయార్థంలో నెమ్మదిగా కుటుంబాలు వచ్చి కలిసేవి. అలా సమతూకంగా వ్యవహరించేవాళ్లం' అని కపిల్ వివరించాడు.

మద్యం, పొగాకు ప్రకటనలపై నిషేధం!

బీసీసీఐ సుముఖం

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో ఇకనుంచి మద్యం, పొగాకు, క్రిప్టో కరెన్సీ సంబంధిత ప్రకటనలు కనిపించే ఆస్కారం ఉండకపోవచ్చు. ఈమేరకు బీసీసీఐ త్వరలోనే నిర్ణయం తీసుకోనుంది. ఐపీఎల్‌లో మద్యం, పొగాకు ఉత్పత్తుల ప్రకటనలను నిషేధించాలని ఇటీవల కేంద్ర ఆరోగ్య శాఖ సూచించిన విషయం తెలిసిందే. దీన్ని దృష్టిలో ఉంచుకుని బీసీసీఐ ఈనెల 22న కోల్‌కతాలో జరిగే బోర్డు అపెక్స్ కౌన్సిల్‌లో మార్గదర్శకాలు విడుదల చేయనుంది. అలాగే భారత్‌లోనే జరిగే 2025 మహిళల వన్డే వరల్డ్‌కప్ నిర్వహణపై నిర్వాహక కమిటీని కూడా ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఈ మెగా టోర్నీ వేదికలపై కూడా చర్చ జరుగనుంది.



గిల్

ఐపీఎల్ 3 రోజుల్లో

గుజరాత్ మళ్లీ మెరిసేనా?

మూడేళ్ల క్రితం ఐపీఎల్ అరంగేట్రంలోనే టైటిల్‌తో అదరగొట్టిన జట్టు గుజరాత్ టైటాన్స్ హార్దిక్ పాండ్యా కెప్టెన్సీలో నిలకడైన ప్రదర్శనతో ఆ తర్వాతి ఏడాది (2023) కూడా రన్నరప్‌గా నిలిచింది. కానీ, మూలాధారమైన పాండ్యాను ముంబై ఇండియన్స్ తీసుకోవడం గుజరాత్‌కు పూడ్చలేని లోటుగా మారింది. అంతగా అనుభవంలేని శుభమన్ గిల్‌కు జట్టు పగ్గాలు అప్పగించడం కూడా ప్రదర్శనపై ప్రభావం చూపింది. దీంతో 2024 టోర్నీలో ఆడిన 14 మ్యాచ్‌ల్లో ఏడు ఓడిన టైటాన్స్.. ఎనిమిదో స్థానంతో సరిపెట్టింది. ఈ నేపథ్యంలో గిల్, రాహుల్ తెవాటియా, రషీద్‌ఖాన్, సాయి సుదర్శన్‌లతో కోర్ టీమ్‌ను రిటైన్ చేసుకొన్న మేనేజ్‌మెంట్.. అనుభవానికి కూడా పెద్దపీట వేసింది. మెగా వేలంలో బట్లర్, రబాడ, సిరాజ్ లాంటి ప్లేయర్లను కొనుగోలు చేసి సమతుల్యమైన జట్టును తయారు చేసింది. కానీ, నిలకడలేని పవర్ హిట్టర్ షారుఖ్ ఖాన్‌ను రిటైన్ చేసుకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. గుజరాత్ ప్రధాన బలం బ్యాటింగ్. అయితే, గత సీజన్‌లో పవర్‌ప్లే, మధ్య ఓవర్లలో ఆశించినంత రన్‌రేట్ రాబట్టలేక పోయింది. అయితే, ఈసారి బట్లర్ రాకతో దూకుడు పెరిగే అవకాశం ఉంది. బ్యాటింగ్‌కు సాయి సుదర్శన్ కీలకంగా మారగా.. తెవాటియా, షారుఖ్ ఫినిషర్ పాత్ర పోషించనున్నారు. రబాడ, గెరాల్డ్ కొట్టీతోపాటు టీమిండియా పేసర్లు సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, వరల్డ్‌క్లాస్ స్పిన్నర్ రషీద్‌తో బౌలింగ్ విభాగం మెరుగ్గానే కనిపిస్తోంది. అయితే, ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కోవడాన్ని జట్టు అలవాటు చేసుకోవాలి. కోచ్‌గా ఆశిష్ నెహ్రాను కొనసాగించడం కూడా ప్లస్‌గానే చెప్పుకోవాలి.

జట్టు

బ్యాటర్లు: శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), షెర్ఫెన్ రూథర్‌ఫోర్డ్, గ్లెన్ ఫిలిప్స్; **వికెట్ కీపర్లు:** జోష్ బట్లర్, కుమార్ కుశాగ్ర, అనూజ్ రావత్; **ఆల్‌రౌండర్లు:** సాయి సుదర్శన్, రాహుల్ తెవాటియా, నిశాంత్ సింధు, మహిపాల్ లోమ్రోర్, వాషింగ్టన్ సుందర్, అర్షద్ ఖాన్, సాయి కిశోర్, జయంత్ యాదవ్, కరీమ్ జనత్, షారుఖ్ ఖాన్; **బౌలర్లు:** రబాడ, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, కొట్జీ, మానవ్ సుతార్, గుర్నూర్ సింగ్ బ్రార్, ఇషాంత్ శర్మ, కుల్వంత్ కేజ్రోలియా, రషీద్ ఖాన్.

తొలి టైటిల్ వేటలో..

పంత్ సారథ్యంలో బలంగా లఖ్‌నవూ



పంత్

గుజరాత్ తరహాలో మూడేళ్ల క్రితం మెగా లీగ్‌లోకి అడుగుపెట్టిన జట్టు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ). కేఎల్ రాహుల్ కెప్టెన్సీలో 2022, 2023లో ప్లేఆఫ్స్ చేరిన లఖ్‌నవూ.. గతేడాది ఆడిన 14 మ్యాచ్‌ల్లో ఏడు విజయాలతో ఏడో స్థానంతో సరిపెట్టింది. దీంతో రాహుల్‌ను వదిలేసిన యాజమాన్యం.. తాజా సీజన్ కోసం యువరక్తంతోపాటు అనుభవజ్ఞులైన బౌలర్లతో బలమైన జట్టును తయారు చేసింది. ఈసారి టైటిల్ నెగ్గాలన్న పట్టుదలతో వేలంలో డ్యాషింగ్ బ్యాటర్ రిషభ్ పంత్‌ను రూ. 27 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసి అతడికి పగ్గాలు అప్పజెప్పింది. కోచ్ జస్టిన్ లాంగర్ కూడా గొప్ప వ్యూహకర్త కావడంతో లఖ్‌నవూపై ఈసారి భారీ అంచనా లున్నాయి. మ్యాచ్ విన్నర్లు పంత్, నికోలస్ పూరన్, మార్‌క్రమ్, విల్లర్‌తో జట్టు బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. ఓపెనర్లు శుభారంభాన్ని అందిస్తే.. వీరు మరింతగా విరుచుకుపడే అవకాశం ఉంది. గాయం నుంచి కోలుకొన్న ఆస్ట్రేలియా పేస్ ఆల్ రౌండర్ మిచెల్ మార్ష్ ఈసారి బ్యాటర్‌గా మాత్రమే ఆడే అవకాశాలున్నాయి. ఇక, మయాంక్ యాదవ్ తన బుల్లెట్‌లాంటి బంతులతో ఇప్పటికే అందరి దృష్టినీ తనవైపునకు తిప్పుకొన్నాడు. కానీ, అతడి ఫిట్‌నెస్ సమస్య ఎక్కువగా ఆందోళనకు గురి చేస్తోంది. అవేశ్ ఖాన్, షమర్ జోసెఫ్, ఆకాశ్ దీప్‌లతో పేస్ విభాగం మెరుగ్గానే ఉంది. రవి బిష్ణోయ్ చెప్పుకోదగ్గ స్పిన్నర్. కాగా, మిడిలార్డర్‌లో ఎక్కువగా హిట్టర్లు ఉండడంతో.. ఒకవేళ ఇన్నింగ్స్ నిర్మించాల్సి వస్తే క్రీజులో నిలబడి ఆడే ప్లేయర్ లేని లోటు కనిపిస్తోంది. డెత్ ఓవర్లలో బౌలింగ్ పదును తేలాల్సి ఉంది.

జట్టు

బ్యాటర్లు: డేవిడ్ మిల్లర్, మార్‌క్రమ్, హిమ్మత్ సింగ్, మాథ్యూ బ్రీజ్‌టెక్;
వికెట్ కీపర్లు: రిషభ్ పంత్ (కెప్టెన్), నికోలస్ పూరన్, ఆర్యన్ జుయల్;
ఆల్‌రౌండర్లు: మిచెల్ మార్ష్, అబ్దుల్ సమద్, షాబాజ్ అహ్మద్, యువరాజ్ చౌదరి, రాజ్‌వర్ధన్ హంగ్రేకర్, అర్షిన్ కులకర్ణి, ఆయుష్ బదోని;
బౌలర్లు: అవేశ్ ఖాన్, ఆకాశ్ దీప్, సిద్దార్థ్, దిగ్వేష్ సింగ్, ఆకాశ్ సింగ్, షమర్ జోసెఫ్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్, మొహిసిన్ ఖాన్, రవి బిష్ణోయ్.

ఎండవేడిమికి తాళలేక
పిచ్‌పైనే ప్రాణాలు విడిచి..



అడిలైడ్: ఎండవేడిమిని తట్టుకోలేక ఓ క్రికెటర్ పిచ్‌పైనే ప్రాణాలు విడిచాడు. పాకిస్థాన్ మూలాలున్న క్లబ్ క్రికెటర్ జునైద్ జాఫర్ ఖాన్ (40) డీహైడ్రేషన్‌తో మ్యాచ్ మధ్యలోనే కుప్పకూలాడు. 41.7 డిగ్రీల ఉష్ణోగ్రతలో జరిగిన ఈ మ్యాచ్‌లో ద ఓల్డ్ కాంకార్డియన్స్ క్లబ్ తరఫున ఆడుతున్న జునైద్ దాదాపు 40 ఓవర్లపాటు ఫీల్డింగ్ చేసిన అనంతరం బ్యాటింగ్‌కు దిగాడు. ఉన్నట్టుండి ఒక్కసారిగా స్పృహతప్పి పిచ్‌పైనే పడిపోయాడు. తక్షణం అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించినా వైద్యులు ప్రాణాలు కాపాడలేక పోయారు. రంజాన్ నెల కావడంతో అతడు ఉపవాసం ఉన్నాడని అంటున్నారు. అయితే, సహచరులు మాత్రం అతడు మంచినీరు తాగినట్టు చెప్పారు.



సీఫర్ట్ (45)

పాక్.. అదే తీరు

కివీస్‌తో రెండో టీ20లోనూ చిత్తు

డ్యునెడిన్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో పాకిస్థాన్ పేలవ ప్రదర్శన కొనసాగుతూనే ఉంది. మంగళవారం ఇరు జట్ల మధ్య జరిగిన రెండో టీ20లోనూ పాక్ 5 వికెట్ల తేడాతో ఓడింది. దీంతో కివీస్ 2-0 ఆధిక్యంలో కొనసాగుతోంది. వర్షం కారణంగా ఈ మ్యాచ్‌ను 15 ఓవర్లకు కుదించగా.. పాక్ 9 వికెట్లకు 135 పరుగులు చేసింది. కెప్టెన్ సల్మాన్ ఆఘా (46), షాదాబ్ ఖాన్ (26), షహీన్ (22 బ్యాటింగ్) మాత్రమే రాణించారు. స్పిన్నర్ సోధి, పేసర్లు డఫీ, సియర్స్, నీషమ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో కివీస్ 13.1 ఓవర్లలో 5 వికెట్లకు 137 పరుగులు చేసి నెగ్గింది. ఓపెనర్లు సీఫర్ట్ (45), అలెన్ (38) మెరుపు ఇన్నింగ్స్‌తో తొలి వికెట్‌కు 20 బంతుల్లోనే 66 పరుగులు అందించారు. పేసర్ రౌఫ్‌కు రెండు వికెట్లు దక్కాయి.



అర్చనపై నాలుగేళ్ల నిషేధం

న్యూఢిల్లీ: డోప్ పరీక్షలో విఫలమైన భారత లాంగ్ డిస్టెన్స్ రన్నర్ అర్చనా జాదవ్ (20)పై నాలుగేళ్ల నిషేధం విధించారు. గతేడాది డిసెంబరులో పుణె హాఫ్ మారథాన్ సందర్భంగా నిర్వహించిన డోప్ పరీక్షలో అర్చన నిషేధిత ఆక్సాన్‌డ్రోలోన్ తీసుకున్నట్టు రుజువైంది. అంతేకాదు.. డోప్ తీసుకున్నట్టు అర్చన స్వయంగా అంగీకరించింది. దీంతో ఆమె నాలుగేళ్లు ఎలాంటి క్రీడా పోటీల్లో పాల్గొనకుండా నిషేధం విధిస్తున్నట్టు ప్రపంచ అథ్లెట్ల స్వచ్ఛత విభాగం (ఏఐయూ) మంగళవారం ప్రకటించింది. ఈ ఏడాది జనవరి 7 నుంచి నిషేధం అమల్లోకి వస్తుందని తెలిపింది. అర్చన చివరిసారిగా గతేడాది అక్టోబరులో ఢిల్లీ హాఫ్ మారథాన్ రేసులో పోటీపడింది. ఆ రేసులో నాలుగోస్థానంలో నిలిచింది.

కళ్లన్నీ ఛెత్రిపైనే

మాల్దీవులతో భారత్ పోరు నేడు



షిల్లాంగ్: జట్టు కోసం రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కితీసుకొన్న భారత స్టార్ ఫుట్‌బాలర్ సునీల్ ఛెత్రి మరోసారి అభిమానులను అలరించనున్నాడు. బుధవారం మాల్దీవులతో జరిగే అంతర్జాతీయ ఫ్రెండ్లీ మ్యాచ్‌లో ఛెత్రి బరిలోకి దిగనున్నాడు. ఏఎఫ్‌సీ ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో ఈనెల 25న జరిగే మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో భారత్ తలపడనుంది. దీనికి సన్నాహకంగా ఈ మ్యాచ్‌ను భావిస్తున్నారు. సునీల్‌ను సబ్‌స్టిట్యూట్‌గా బరిలోకి దించే అవకాశాలున్నాయి. గతేడాది జూలైలో ఛెత్రి కెరీర్‌కు వీడ్కోలు పలికాడు.

'స్విస్' మెయిన్ డ్రాకు ఆయుష్, శంకర్

బాసెల్: స్విస్ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత యువ షట్లర్లు ఆయుష్ శెట్టి, శంకర్ ముత్తుస్వామి సింగిల్స్‌లో మెయిన్ డ్రాకు అర్హత సాధించారు. క్వాలిఫయర్స్ చివరి రౌండ్లో ఆయుష్ 21-12, 21-15తో చోలన్ (ఇంగ్లండ్)పై, శంకర్ 21-7, 21-10తో భారత్‌కే చెందిన తరుణ్‌పై గెలిచారు. దీంతో పురుషుల సింగిల్స్ మెయిన్ డ్రాలో మొత్తంగా ఆరుగురు భారత షట్లర్లు బరిలో నిలవడం విశేషం. సీనియర్లు కిడాంబి శ్రీకాంత్, హెచ్ఎస్ ప్రణయ్‌తో పాటు వర్ధమాన షట్లర్లు ప్రియాన్షు రజావత్, కిరణ్ జార్జ్ నేరుగా మెయిన్ డ్రా ఆడుతున్నారు. కాగా, ఆరంభ రౌండ్‌లో ప్రణయ్‌తో శ్రీకాంత్ అమీతుమీ తేల్చుకోనుండగా.. నిషిమొటోతో ఆయుష్, మాగ్నస్ జొహాన్నెసెన్‌తో శంకర్, రాస్మస్ జెమ్‌కెతో కిరణ్, టొబియాస్‌తో ప్రియాన్షు తలపడనున్నారు.

మళ్లీ 75,000 పైకి సెన్సెక్స్

- ఒక్క రోజులో 1,131 పాయింట్ల పెరుగుదల
- 22,800 ఎగువ స్థాయిలో ముగిసిన నిఫ్టీ
- గ్లోబల్ మార్కెట్ల ర్యాలీతో కొనుగోళ్ల జోష్
- 2 రోజుల్లో రూ.8.67 లక్షల కోట్ల సంపద వృద్ధి

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు మంగళవారం భారీ లాభాలను నమోదు చేశాయి. సెన్సెక్స్ ఏకంగా 1,131.31 పాయింట్ల (1.53 శాతం) వృద్ధితో 75,301.26 వద్దకు చేరుకుంది. నిఫ్టీ 325.55 పాయింట్లు (1.45 శాతం) బలపడి 22,834.30 వద్ద స్థిరపడింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి తెరపడనుందన్న అంచనాలు, ఫెడ్ రేట్ల తగ్గింపు ఆశలు, అమెరికా, చైనాలో రిటైల్ విక్రయాల తాజా గణాంకాలు అత్యంత సానుకూలంగా ఉండటంతో అంతర్జాతీయ మార్కెట్లలో ట్రేడింగ్ ట్రెండ్ బుల్లిష్‌గా మారింది. దాంతో దేశీయ మదుపరులూ జోరుగా కొనుగోళ్లకు పాల్పడటం సూచీల ర్యాలీకి ప్రధానంగా దోహదపడింది. ముడి చమురు సెగలు కాస్త తగ్గడంతో పాటు డాలర్ సూచీ బలహీనపడటం కూడా మార్కెట్లకు కలిసివచ్చింది. క్రితం సెషన్‌లోనూ సూచీలు మోస్తరుగా లాభపడ్డాయి. గడిచిన రెండు రోజుల్లో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.8.67 లక్షల కోట్లకు పైగా పెరిగి రూ.399.85 లక్షల కోట్లకు (4.61 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. మంగళవారం ఒక్కరోజే మార్కెట్ సంపద రూ.7 లక్షల కోట్ల మేర పుంజుకుంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 26 రాణించాయి.



రూ.91,000 దాటిన బంగారం

దేశీయంగా పసిడి ధర తొలిసారిగా రూ.91,000 దాటింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం రేటు మరో రూ.500 పెరిగి సరికొత్త జీవితకాల రికార్డు గరిష్ఠ స్థాయి రూ.91,250కి చేరింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం ధర కూడా రూ.450 పెరుగుదలతో రూ.90,800 స్థాయికి ఎగబాకింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను మరింత తగ్గించనుందన్న అంచనాలు, ఇజ్రాయెల్-గాజా మధ్య మళ్లీ ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు కొత్త రికార్డు స్థాయికి చేరడం ఇందుకు కారణమైంది. కిలో వెండి మాత్రం క్రితం రోజు స్థాయి రూ.1,02,500 వద్ద కొనసాగింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒక దశలో 3,047.50 డాలర్లు, సిల్వర్ 35 డాలర్ల వద్ద ట్రేడయ్యాయి.

ఫిజిక్స్‌వాలా రూ.4,600 కోట్ల ఐపీఓ

ప్రముఖ ఎడ్యుటెక్ స్టార్టప్ ఫిజిక్స్‌వాలా పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు వచ్చేందుకు సిద్ధమైంది. ఐపీఓ ద్వారా రూ.4,600 కోట్ల వరకు సమీకరించేందుకు అనుమతి కోరుతూ మార్కెట్ల నియంత్రణాధికార సంస్థ సెబీకి గోప్య ప్రీ-ఫైలింగ్ విధానంలో ప్రాథమిక ముసాయిదా పత్రాలు(డీఆర్‌హెచ్‌పీ) సమర్పించినట్లు తెలిసింది.

ఎల్‌జీ ఐపీఓకు సెబీ ఆమోదం

ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ రూ.15,000 కోట్ల ఐపీఓతో పాటు మ్యాన్‌పవర్ అండ్ టోల్ ప్లాజాల నిర్వహణ సేవల సంస్థ ఇన్నోవిజన్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ ప్రతిపాదనకు కూడా సెబీ ఆమోదం లభించింది. ఐపీఓ ద్వారా ఇన్నోవిజన్ రూ.255 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లకు చెందిన 17.72 లక్షల ఈక్విటీ షేర్లను సైతం విక్రయించనుంది.

ఈ నెలాఖరు నాటికి ఆరోగ్య బీమాలోకి ఎల్ఐసీ



ఎల్ఐసీ ఎండీ, సీఈఓ సిద్ధార్థ మొహంతి

ముంబై: వచ్చే రెండు వారాల్లో ఓ ఆరోగ్య బీమా సంస్థలో వాటా కొనుగోలు చేయనున్నట్లు ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) ఎండీ, సీఈఓ సిద్ధార్థ మొహంతి తెలిపారు. అయితే, ఏ కంపెనీలో వాటా కొనుగోలు చేయబోతున్న విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు. వాటా కొనుగోలుకు సంబంధించి చర్చలు తుది దశలో ఉన్నాయని, ఈ నెలాఖరు నాటికి ఒప్పందం కుదరవచ్చని మొహంతి ధీమా వ్యక్తం చేశారు. అయితే, ఆరోగ్య బీమా కంపెనీలో ఎల్ఐసీ మెజారిటీ వాటా (51 శాతం, అంతకు పైగా) మాత్రం కొనుగోలు చేయబోదని స్పష్టం చేశారు. మంగళవారం 'జీసీఏ25' కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాల్ని వెల్లడించారు.

ఎంత వాటా కొనుగోలు చేయాలనేది ఎల్ఐసీ బోర్డు నిర్ణయంతో పాటు లక్షిత ఆరోగ్య బీమా సంస్థ మార్కెట్ విలువపై ఆధారపడి ఉంటుందన్నారు. ప్రస్తుతం జీవిత కంపెనీలు ఆరోగ్య బీమా కవరేజీ ఆఫర్ చేసేందుకు అనుమతి లేదు. అయితే, బీమా కంపెనీలు జీవిత, ఆరోగ్య, సాధారణ బీమా సేవలందించేందుకు వీలుగా కాంపొజిట్ లైసెన్సులను ప్రవేశపెట్టాలని ఇండస్ట్రీ వర్గాలు కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేశాయి. ఇందుకు సంబంధించి ఈసారి బడ్జెట్లో ప్రకటన వెలువడవచ్చని మార్కెట్ వర్గాలు భావించినప్పటికీ, అది జరగలేదు.

స్టాండ్‌ఎలోన్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలో వాటా కొనుగోలు

ఎల్ఐసీ ఆరోగ్య బీమా విభాగంలోకి ప్రవేశించేందుకు మణిపాల్ సిగ్నాలో వాటా కొనుగోలుకు ప్రయత్నిస్తోందని, వాటా కొనుగోలు ఒప్పందం విలువ రూ.4,000 కోట్ల స్థాయిలో ఉండవచ్చని ఇటీవల మీడియాలో కథనాలు వచ్చాయి. ఆ వార్తలపై స్పందించిన ఎల్ఐసీ.. కేవలం ఆరోగ్య బీమా సేవలందిస్తోన్న స్టాండ్‌ఎలోన్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలో వాటా కొనుగోలుకు చర్చలు జరుపుతున్నట్లు వివరణ ఇచ్చింది.

100 ఏళ్ల ప్రభుత్వ బాండ్లను ప్రవేశపెట్టాలి..

వందేళ్ల కాలపరిమితితో కూడిన ప్రభుత్వ బాండ్ల (జీ-సెక్)ను ప్రవేశపెట్టాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ)ని ఎల్ఐసీ అభ్యర్థించింది. ప్రస్తుతం 40 ఏళ్ల వరకు టర్మ్ బాండ్ల జారీకి ఆర్‌బీఐ అనుమతించింది. 50 ఏళ్లు, 100 ఏళ్ల టర్మ్ బాండ్లను కూడా జారీ చేయాలని ఆశిస్తున్నట్లు ఎల్ఐసీ ఎండీ మొహంతి అన్నారు. ఇందుకోసం ఆర్‌బీఐతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతున్నామని, ఆర్‌బీఐ కూడా ఈ దిశగా ఆలోచన చేస్తోందన్నారు. పూర్తిగా జీవిత బీమా పాలసీలు విక్రయించే ఎల్ఐసీ.. పాలసీదారుల నుంచి సమీకరించిన ప్రీమియం సొమ్మును ప్రధానంగా ప్రభుత్వ దీర్ఘకాలిక బాండ్లు, ఈక్విటీలతో పాటు భిన్న ఆర్థిక సాధనాల్లో పెట్టుబడులుగా పెడుతుంది.

బిజినెస్

కియా, టాటా కార్ల ధరలు పెంపు

న్యూఢిల్లీ: కార్ల ధరలు ఏప్రిల్ 1 నుంచి పెంచుతున్నట్టు మెర్సిడెస్ బెంజ్, కియా, టాటా మోటార్స్ ప్రకటించాయి. ముడి సరుకుల ధరలు పెరగడంతో పెరిగిన ఉత్పత్తి వ్యయాలను కొంత మేరకైనా పూడ్చుకునేందుకు కార్ల ధరలు పెంచక తప్పడంలేదని కియా, టాటా మోటార్స్ ప్రకటించాయి. ఏప్రిల్ 1 నుంచి తమ కార్ల ధరలు 3 శాతం మేరకు పెంచుతున్నట్టు కియా ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ హర్‌దీప్ సింగ్ బ్రార్ తెలియచేశారు.

ఈవీలతో సహా అన్ని కార్ల ధరలు పెంపు: టాటా మోటార్స్ విద్యుత్ కార్ల నుంచి అన్ని రకాల కార్ల ధరలు ఏప్రిల్ 1 నుంచి పెంచబోతున్నట్టు ప్రకటించింది. మోడల్, వేరియెంట్‌ను బట్టి ఈ ధరల పెంపు ఉంటుందని తెలిపింది. అయితే ఎంత శాతం మేరకు పెంచుతున్నట్టు కంపెనీ వెల్లడించలేదు. టాటా మోటార్స్ కార్ల ధర పెంచడం ఈ ఏడాదిలో ఇది రెండోసారి.

రూపాయి బలహీనతే కారణం: మెర్సిడెస్

కరెన్సీ మార్కెట్లో రూపాయి బలహీనత కొనసాగినట్టయితే ఏప్రిల్ నుంచి కార్ల ధరలు పెంచక తప్పదని లగ్జరీ కార్ల కంపెనీ మెర్సిడెస్ బెంజ్ ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ అన్నారు. డిమాండ్ అంతగా లేని కారణంగా కనీసం రెండు త్రైమాసికాల పాటు అమ్మకాల్లో ఒత్తిడి కొనసాగుతుందని ఆయన చెప్పారు. గత 20 రోజుల కరెన్సీ కదలికలు ఆందోళన కలిగిస్తున్నాయంటూ యూరో మారకంలో రూపాయి ఇప్పటికే 95కి చేరిందని, ప్రస్తుతం తమ కార్ల ధరలు 90 స్థాయిలో ఉన్నాయని అయ్యర్ తెలిపారు. ఈ వ్యత్యాసాన్ని పూడ్చేందుకు తాము ధరలు పెంచక తప్పకపోవచ్చని అయ్యర్ చెప్పారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

19వ తేదీ			
హైదరాబాద్	415	విజయవాడ	435
వరంగల్	417	గోదావరి	415
చిత్తూరు	470	విశాఖపట్నం	415
		దజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	96	విజయవాడ	100
వరంగల్	96	గుంటూరు	100
కరీంనగర్	96	ఒంగోలు	100
మహబూబ్‌నగర్	96	చిత్తూరు	94
కర్నూలు	96	నెల్లూరు	99
విశాఖపట్నం	94	అనంతపురం	99
గోదావరి	100		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	90,000 ▲	82,500 ▲	1,13,000 ▲
విజయవాడ	90,200 ▼	86,000 ▲	1,05,000 ▲
విశాఖపట్నం	89,080 ▲	81,660 ▲	1,01,840 ▲
రాజమండ్రి	90,000 ▲	82,500 ▲	1,03,100 ▲
ప్రొద్దుటూరు	89,200 ▲	82,600 ▲	1,00,800 ▲
ముంబై	88,354 ▲	80,932 ▲	1,00,400 ▲

రిలయన్స్ క్యాపిటల్ టేకోవర్ పూర్తి

నేడు ఐఐహెచ్ఎల్‌కు యాజమాన్య బదిలీ

ముంబై: మూడేళ్ల పాటు కొనసాగిన దివాలా పరిష్కార ప్రక్రియ ద్వారా రిలయన్స్ క్యాపిటల్ కొనుగోలు పూర్తయిందని ఇండస్‌ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ లిమిటెడ్ (ఐఐహెచ్ఎల్) చైర్మన్ అశోక్ హిందూజా మంగళవారం ప్రకటించారు. దివాలా పరిష్కార పర్యవేక్షణదారు నుంచి రిలయన్స్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ హక్కుల బదిలీ బుధవారం జరగనుందని ఆయన వెల్లడించారు. రిలయన్స్ క్యాపిటల్‌ను ఐఐహెచ్ఎల్ రూ.9,650 కోట్లకు దక్కించుకుంది.

రెండేళ్లలో అన్ని వైడ్ బాడీ విమానాలకు కొత్త రూపం

ఎయిరిండియా సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్

న్యూఢిల్లీ: సంపూర్ణ ప్రక్షాళన బాటలో ఉన్న ఎయిరిండియా వారసత్వంగా వచ్చిన అన్ని వైడ్‌బాడీ విమానాలకు కొత్త రూపం కల్పించే కార్యక్రమాన్ని 2027 మధ్య నాటికల్లా పూర్తి చేయనుంది. ప్రపంచ విమానయాన మార్కెట్లో కనీసం వచ్చే నాలుగైదు సంవత్సరాల పాటు "సరఫరాల కొరత" కొనసాగుతుందని కంపెనీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ క్యాంప్‌బెల్ విల్సన్ చెప్పారు. నారో బాడీ విమానాలకు ఇంజన్ల కొరత, విమానాల ఫ్యూజిలేజ్‌లో ఉపయోగించే విడిభాగాలు, సీట్ల కొరత వంటివి ఇబ్బందికరంగా ఉన్న అంశాలని ఆయన తెలిపారు. అలాగే కొద్ది కాలం క్రితం ఎయిరిండియాలో విలీనమైన విస్తారా విమానాలకు కొత్తగా రంగులు వేసి అవసరమైన హంగులు చేసే పని ఏడాదిన్నర కాలంలో ముగుస్తుందని అన్నారు. విమానాలను కొత్త హంగులతో రీఫిట్ చేయడం తమ తొలి ప్రాధాన్యత అని ఆయన చెప్పారు. బోయింగ్ 777 విమానాల రీఫిట్ కార్యక్రమం గత ఏడాదే ప్రారంభం కావలసి ఉన్నప్పటికీ సీట్ల సరఫరాలో కొరత వల్ల జాప్యమైందని స్కిఫ్ట్ ఇండియా కార్యక్రమంలో మాట్లాడుతూ విల్సన్ తెలిపారు.

ఆల్ఫాబెట్ రూ.2.77 లక్షల కోట్ల డీల్

సైబర్ సెక్యూరిటీ స్టార్టప్ విజ్‌ను కొనుగోలు చేసిన గూగుల్ మాతృ సంస్థ

న్యూయార్క్: అమెరికన్ టెక్నాలజీ దిగ్గజం గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ భారీ కొనుగోలు చేపడుతోంది. సైబర్ సెక్యూరిటీ స్టార్టప్ 'విజ్'ను 3,200 కోట్ల డాలర్లకు (సుమారు రూ.2.77 లక్షల కోట్లు) చేజిక్కించుకోనుంది. ఈ డీల్ పూర్తిగా నగదు రూపంలో జరగనుంది. ప్రస్తుతం అమెజాన్, మైక్రోసాఫ్టే ప్రధాన పోటీదారులుగా ఉన్న క్లౌడ్ కంప్యూటింగ్ సేవల మార్కెట్‌లో పట్టు సాధించేందుకు ఆల్ఫాబెట్‌కు ఈ కొనుగోలు దోహదపడనుంది. "ఈ రోజుల్లో క్లౌడ్ సేవలందుకుంటున్న వ్యాపారాలు, ప్రభుత్వాలు మరింత పటిష్ఠమైన సెక్యూరిటీ సొల్యూషన్స్‌తోపాటు క్లౌడ్ కంప్యూటింగ్ సేవల కంపెనీల్లో గొప్ప చాయిస్ కోసం చూస్తున్నాయ"ని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ అన్నారు. గూగుల్ క్లౌడ్, విజ్ సమ్మేళనం క్లౌడ్ సెక్యూరిటీని అత్యంత బలోపేతం చేయడంతోపాటు పలు క్లౌడ్‌లను ఉపయోగించుకునే సామర్థ్యాన్ని పెంచనుందన్నారు. న్యూయార్క్ కేంద్రంగా నాలుగేళ్ల క్రితం ప్రారంభమైన విజ్.. క్లౌడ్ నెట్‌వర్క్ కోసం సెక్యూరిటీ పరిష్కారాలను డిజైన్ చేస్తుంది.

హైదరాబాద్‌లో స్మార్ట్‌వర్క్స్ విస్తరణ

మరో 2.2 లక్షల చదరపు అడుగుల స్థలం లీజుకి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కోవర్కింగ్ స్పేస్ విభాగంలో పెరిగిన డిమాండ్‌ను తట్టుకునేందుకు స్మార్ట్‌వర్క్స్ కోవర్కింగ్ స్పేసెస్ కంపెనీ హైదరాబాద్‌లో మరో 2.2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం గల స్థలాన్ని లీజుకి తీసుకుంది. గచ్చిబౌలిలోని డీఎల్ఎఫ్ సైబర్ సిటీలో ఈ స్థలం తీసుకున్నట్టు తెలిపింది. హైదరాబాద్‌లో ఇది తమకు నాలుగో సెంటర్ అని, దీంతో తమ అధీనంలోని స్థలం పరిమాణం 10 లక్షల చదరపు అడుగులకు పెరిగిందని పేర్కొంది.

టాఫే వైస్ చైర్మన్‌గా లక్ష్మీ వేణు

టాఫే (ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్‌మెంట్ లిమిటెడ్) వైస్ చైర్మన్‌గా లక్ష్మీ వేణు నియమితులయ్యారు. ప్రస్తుతం లక్ష్మీ టాఫే డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. కంపెనీ బోర్డు తనపై ఎంతో విశ్వాసం ఉంచి వైస్ చైర్మన్ బాధ్యతలు అప్పగించిందని, రానున్న రోజుల్లో కంపెనీని మరింత వృద్ధి పథంలోకి తీసుకువెళ్లేందుకు కృషి చేయనున్నట్లు లక్ష్మీ వెల్లడించారు. యూకేలోని యేల్ విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన లక్ష్మీ యూనివర్సిటీ ఆఫ్ వార్విక్ నుంచి ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్‌లో డాక్టరేట్‌ను అందుకున్నారు.



అఖిల భారత బీసీ మహిళా సెమినార్‌లో పాల్గొన్న తెలుగు ఎంపీలు, నేతలు

బీసీ మహిళలకు చట్టసభల్లో సబ్ కోటా ఇవ్వాలి

▸▸ అఖిల భారత బీసీ మహిళా సెమినార్‌లో తెలుగు ఎంపీల డిమాండ్

న్యూఢిల్లీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): 'పార్లమెంటులో ఆమోదం పొందిన మహిళా బిల్లులో జనాభా ప్రకారం బీసీ మహిళలకు సబ్ కోటా ఇవ్వాలి. అప్పుడే ఆ మహిళలకు రాజ్యాధికారం దక్కుతుంది. చట్టసభలలో మహిళలకు కేటాయించిన 33 శాతం రిజర్వేషన్లలో బీసీ మహిళలకు 50 శాతం సబ్ కోటా కేటాయించాలి' అని రెండు తెలుగు రాష్ట్రాల ఎంపీలు డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీ/తెలంగాణ భవన్‌లోని గురజాడ సమావేశ మందిరంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షురాలు మట్ట జయంతి గౌడ్ అధ్యక్షతన అఖిల భారత బీసీ మహిళా సదస్సులో ఎంపీలు ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌రావు, వద్దిరాజు రవిచంద్ర, ఈటల రాజేందర్, మాజీ ఎంపీ అజీజ్ పాషా పాల్గొన్నారు. బీసీ మహిళలకు సబ్ కోటా కోసం వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు.

కిసాన్ సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు

న్యూఢిల్లీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కిసాన్ సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని టీడీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన ఇఫ్కో కిసాన్ సెజ్ చైర్మన్ దిలీప్ సంఘాని, సీఈవో ఉదయ్ శంకర్ అవస్థితో భేటీ అయ్యారు. నెల్లూరు జిల్లా కోవ్వూరులో ఇఫ్కో కిసాన్ సెజ్ కోసం సేకరించిన 2,777 ఎకరాల్లో అభివృద్ధి కార్యకలాపాలను చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తన విజ్ఞప్తులకు చైర్మన్, సీఈవో సానుకూలంగా స్పందించారని మీడియాకు తెలిపారు.

కౌలు రైతులకూ అన్ని ప్రయోజనాలు: ఎంపీ లావు

న్యూఢిల్లీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): భూ యజమానులకు దక్కే ప్రయోజనాలన్నీ కౌలు రైతులకూ దక్కాలని టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు డిమాండ్ చేశారు. మంగళవారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ కౌలు రైతుల కోసం ఏపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త చట్టం గురించి ఆయన వివరించారు. అగ్రి స్టాక్, డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌లో కౌలు రైతులనూ దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వ పథకాలను రూపొందించాలని విజ్ఞప్తి చేయగా, కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సానుకూలంగా స్పందించారు.

ఐదేళ్లలో ఎన్‌బీహెచ్‌ఎం కింద ఏపీకి ఒక్క ప్రాజెక్టే

న్యూఢిల్లీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): జాతీయ తేనెటీగల పెంపకం, తేనె మిషన్(ఎన్‌బీహెచ్‌ఎం) కింద ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 298 ప్రాజెక్టులు మంజూరు చేసినట్లు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ తెలిపారు. ఏపీకి గత ఐదేళ్లలో ఎన్‌బీహెచ్‌ఎం కింద ఒక్క ప్రాజెక్టు మాత్రమే మంజూరయిందని తెలిపారు. మంగళవారం, లోక్‌సభలో టీడీపీ సభ్యుడు కేశినేని చిన్ని ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.

పాఠశాలల పనివేళల్లో స్వల్ప మార్పు

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు జరుగుతున్న పాఠశాలల పనివేళల్లో పాఠశాల విద్యాశాఖ స్వల్ప మార్పులు చేసింది. పరీక్షలు జరిగే రోజుల్లో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తుండగా, ఇక నుంచి మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాల జారీ చేసింది.

అంగన్వాడీలకు ఒంటిపూట బడులు ప్రారంభం

ఎండల తీవ్రత, పిల్లల భద్రత దృష్ట్యా రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో మంగళవారం నుంచి ఒంటిపూట బడులు ప్రారంభమయ్యాయి.

సీనరేజీ కాంట్రాక్టు 3 నెలలు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

గోదావరి, గుంటూరు ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన గనుల సీనరేజీ కాంట్రాక్టును ప్రైవేటు కంపెనీలకు అప్పగించారు. రెండేళ్ల కాలపరిమితితో కాంట్రాక్టు ఉంటుందని ముందుగానే ఒప్పందాలు చేసుకున్నారు. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చాక నాలుగు నెలలపైనే సీనరేజీ వసూళ్లను నిలిపివేసింది. దీని వల్ల ప్రభుత్వానికి భారీగా ఆదాయం పడిపోయింది. ఒకవైపు కాంట్రాక్టుల్లో అక్రమాలు ఏమైనా జరిగాయా అనేది తేల్చకుండా, మరోవైపు వాటిని కొనసాగించకుండా నెలల తరబడి పర్మిట్లను, వసూళ్లను నిలిపివేయడంతో ఇటు ప్రభుత్వానికి, అటు కంపెనీలకు భారీ నష్టం జరిగింది. సీనరేజీ కాంట్రాక్టు ఉన్న ఏడు జిల్లాలు, గనులశాఖ నియంత్రణలో ఉన్న మిగతా ఆరు ఉమ్మడి జిల్లాల పరిధిలో అన్నీ నిలిపివేయడం వల్ల సర్కారుకు దాదాపు రూ.1300 కోట్లపైనే ఆదాయం రాకుండాపోయింది. అసలు విషయాన్ని గుర్తించకుండా... కాంట్రాక్టు కంపెనీలే బకాయి పడ్డాయనేలా నివేదికలు రూపొందిస్తూ వచ్చారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' ఇటీవల 'సొంత ఆదాయానికి సర్కారు గండి' శీర్షికతో సవివరమైన కథనాన్ని ప్రచురించింది. ప్రభుత్వం దీనిపై స్పందించి గనుల శాఖ నుంచి నివేదిక కోరింది. అప్పటికే గనుల శాఖ కార్యదర్శి ప్రవీణ్ ఓ నివేదిక ఇచ్చారు. ప్రభుత్వం సీనరేజీ వసూళ్లను నిలిపివేసిన నేపథ్యంలో... తమకు అదనంగా మరో మూడు లేదా నాలుగు నెలలు కాంట్రాక్టు పొడిగింపు ఇవ్వాలని, 190 కోట్ల బకాయిలను మాఫీ చేయాలని కాంట్రాక్టు కంపెనీలు కోరుతున్నాయని ఆ నివేదికలో పేర్కొన్నారు. తొలుత ప్రభుత్వం ఈ నివేదికపై సత్వర నిర్ణయం తీసుకోలేదు. ఈలోగా చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో కాంట్రాక్టు రెండేళ్ల కాలపరిమితి ముగిసిపోయింది. సోమవారం నాటికి శ్రీకాకుళం జిల్లా కాంట్రాక్టు కాలపరిమితి ముగిసింది. దీంతో మూడు జిల్లాల్లో తిరిగి గనులశాఖ అధికారులే సీనరేజీ వసూలు చేస్తున్నారు. ఈ పరిణామాలపై గనుల శాఖ కార్యదర్శి మరోసారి సర్కారుకు నివేదించారు. దీంతో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన అత్యవసర సమావేశానికి గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ఇతర అధికారులు హాజరయ్యారు. గనులశాఖ చేసిన ప్రతిపాదనకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు గనుల శాఖ సీనరేజీ కాంట్రాక్టుకు మూడు నెలల పొడిగింపు, 190 కోట్ల బకాయిల మాఫీ కోరుతూ ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు సమర్పించనుంది.

ఇసుక అక్రమ తవ్వకాలపై సీఎం సీరియస్

రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సీరియస్ అయ్యారు. అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం మోపాలని గనుల శాఖను ఆదేశించారు. గుంటూరు జిల్లా పరిధిలో కృష్ణా నదిలో ఇసుక అక్రమ తవ్వకాలపై మంగళవారం 'ఆగని ఇసుక దందా' శీర్షికన సచిత్ర, సవివరమైన కథనం ప్రచురించింది. దీనిపై చంద్రబాబు ఆరాతీశారు. అడ్డగోలుగా ఇసుక తవ్వేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారంటూ సీఎం ప్రశ్నించినట్లు తెలిసింది. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేసులు నమోదు చేయాలని ఆదేశించినట్లు సమాచారం.

నిత్యావసరాల ధరల నియంత్రణకు చర్యలు

- ▸▸ ధాన్యంపై మార్కెట్ సెస్‌ను 2 నుంచి 1 శాతానికి తగ్గించేందుకు నివేదిక ఇవ్వండి
- ▸▸ అధికారులకు మంత్రివర్గ ఉపసంఘం ఆదేశాలు
- ▸▸ ద్రవ్యోల్బణం నియంత్రణకు ప్రత్యేక చర్యలు
- ▸▸ దేశ సగటు కంటే రాష్ట్రంలో తక్కువ నమోదు
- ▸▸ పౌరసరఫరాల మంత్రి మనోహర్ వెల్లడి



ధరల స్థిరీకరణపై సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, కేశవ్, సత్యకుమార్ తదితరులు

అమరావతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు, వినియోగదారుల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో ఉపసంఘం సమావేశమైంది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఆరోగ్య మంత్రి సత్యకుమార్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మార్కెట్‌లో నిత్యావసరాల ధరలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ.. ముఖ్యంగా బియ్యం, కందిపప్పు, వంట నూనె, టమాటా, ఉల్లి ధరలను స్థిరీకరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. వస్తు రవాణా చార్జీలలో సమస్యల పరిష్కారానికి రవాణా శాఖ తగిన చర్యలు తీసుకోవాలని మంత్రులు సూచించారు. ధాన్యంపై మార్కెట్ సెస్‌ను 2 నుంచి 1 శాతానికి తగ్గించేందుకు క్యాబినెట్ ఆమోదానికి నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. తృణధాన్యాల ఉత్పత్తి పెంచేందుకు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉమ్మడి జిల్లాల్లో ఉన్న ధరల నివేదిక కేంద్రాలను వచ్చే నెల నుంచి మొత్తం 26 జిల్లాల్లోనూ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఫలితంగా మూడు నెలలుగా ద్రవ్యోల్బణం రేటు రాష్ట్రంలో జాతీయ సగటు కన్నా తక్కువగా నమోదవుతోందని చెప్పారు. జాతీయ సగటు 3.61 శాతం ఉండగా.. రాష్ట్రంలో 2.44 శాతం నమోదైందని వివరించారు. తక్కువ ద్రవ్యోల్బణ రేటు నమోదవుతున్న రాష్ట్రాల్లో ఏపీ నాలుగో స్థానంలో ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి రోజూ సీపీ యాప్ ద్వారా సేకరిస్తున్న ధరలను విశ్లేషిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

తారకరామతీర్థ సాగర్‌ను సకాలంలో పూర్తిచేయండి

▸▸ ఇతర ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు కూడా.. చీఫ్ ఇంజనీర్లకు నిమ్మల ఆదేశం

అమరావతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల, విజయనగరం నియోజకవర్గాల దాహార్తి, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నీటి అవసరాలను తీర్చే తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టును వేగంగా పూర్తిచేయాలని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ఇతర ప్రాజెక్టులను కూడా సకాలంలో పూర్తి చేయాలన్నారు. మంగళవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, ఇతర ప్రాజెక్టులపై ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావుతో కలసి ఆయన అధికారులతో సమీక్షించారు. ఇప్పటికే పనులు ప్రారంభించిన ప్రాజెక్టులను సత్వరమే పూర్తిచేసేలా కార్యాచరణను అమలు చేయాలని చీఫ్ ఇంజనీర్లను ఆదేశించారు. రాష్ట్రంలో కాల్వ కట్టల ఆక్రమణల వల్ల 18,951 ఎకరాల ఆయకట్టు ప్రభావితమవుతుతోందని నిమ్మల చెప్పారు. అసెంబ్లీల్లో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు.

కృష్ణా ప్రాజెక్టులపై 2 వారాల్లో కౌంటర్ వేయండి

▸▸ కేంద్రం, ఏపీ ప్రభుత్వానికి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదిపై నిర్మించిన ప్రాజెక్టులను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) అధీనం చేసే అంశంపై రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రాన్ని, ఏపీ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆ ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగిస్తూ 2021లో కేంద్రం జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ రిట్ పిటిషన్ దాఖలు చేయగా.. తెలంగాణ తెచ్చిన జీవో 34ను రద్దు చేయాలని, దాని పేరుతో అపరిమితంగా విద్యుదుత్పత్తి చేస్తోందని ఏపీ కూడా పిటిషన్ వేసింది. రెండు పిటిషన్లనూ కలిపి మంగళవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. జీవో 34, విద్యుదుత్పత్తి అంశాలపై తెలంగాణ సమర్పించిన అఫిడవిట్‌పై రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఈ సందర్భంగా కేంద్ర సర్కారును, ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ తర్వాత వారంలో రీజాయిండర్ వేయాలని తెలంగాణకు సూచించింది. తదుపరి విచారణ ఏప్రిల్ 15న జరిగే అవకాశముంది.

విధుల్లో చేరని ఇద్దరు ఇంజనీర్లు సస్పెన్షన్

అమరావతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను ధిక్కరించి విధుల్లో చేరని ఇద్దరిపై సస్పెన్షన్ వేటు పడింది. ఐదు నెలల కిందట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎస్ .మల్లికార్జునరావు, ఎస్.లక్ష్మీనాయక్‌లను జలవనరుల శాఖ శ్రీశైలం జలాశయానికి బదిలీ చేసింది. అయితే వీరిద్దరు ఇప్పటిదాకా విధుల్లో చేరలేదు. దీంతో వారిని సస్పెండ్ చేస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు.

తూర్పుగోదావరిలో ఫారెస్ట్ అకాడమీ

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు తూర్పుగోదావరి జిల్లా దివాన్ చెరువు సమీపంలో రాష్ట్ర ఫారెస్ట్ అకాడమీ ఏర్పాటు కానున్నది. అక్కడి రక్షిత అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేస్తే సిబ్బందికి అనువుగా ఉంటుందని పవన్‌కల్యాణ్ అభిప్రాయపడ్డారు. దీనిపై కేంద్రానికి లేఖ రాయగా, దివాన్ చెరువు సమీపంలో ఏర్పాటు చేసుకోవచ్చని స్పష్టత ఇచ్చింది. అకాడమీ ఏర్పాటుకు వేగంగా చర్యలు చేపట్టాలని ఆ శాఖ ఉన్నతాధికారులకు పవన్ దిశానిర్దేశం చేశారని ఆయన కార్యాలయం మంగళవారం తెలిపింది.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం: గొట్టిపాటి

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తుల సమయంలో విద్యుత్ ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. వారి సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావుతో కలసి ఇంధన సంస్థల వెనుకబడిన వర్గాలకు చెందిన ఉద్యోగుల డైరీని మంత్రి గొట్టిపాటి ఆవిష్కరించారు.

చిత్రజ్యోతి

SINCE 1965



మెగాస్టారుకో ముద్దు

తనదైన నటనతో కోట్లాది మంది అభిమానుల హృదయాలను చూరగొన్నారు చిరంజీవి. ఒక్కసారి ఆయన్ను చూస్తే చాలు అనుకొనే అభిమానులకు కొదవలేదు. ఎన్నో ఏళ్లుగా తెరపైన చూస్తూ ఆరాధించిన మెగాస్టార్ కళ్లముందు ప్రత్యక్షమైతే అభిమానుల ఆనందానికి అవధులుండవు. ఇలాంటి ఓ అపురూపమైన దృశ్యానికి లండన్ ఎయిర్‌పోర్ట్ వేదికైంది. యూకే పార్లమెంట్‌లో సన్మానం కోసం చిరంజీవి లండన్ వెళ్లారు. ఆయనను చూడడానికి విమానాశ్రయానికి అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. చిరంజీవిని చూడగానే భావోద్వేగానికి గురైన ఓ మహిళా అభిమాని ఆయన్ను దగ్గరకు తీసుకొని బుగ్గను ఆత్మీయంగా ముద్దాడారు. 'మీ ఆనందమే నా ఆనందం' అన్నట్లు ఆ క్షణాలను చిరంజీవి సైతం సంతోషంగా ఆస్వాదిస్తున్నట్లు కనిపించారు. ప్రస్తుతం ఈ ఫొటో నెట్టింట వైరలవుతోంది. యూకే పార్లమెంట్ నేడు చిరంజీవిని సత్కరించనుంది. అలాగే బ్రిడ్జ్ ఇండియా సంస్థ జీవిత సాఫల్య పురస్కారం అందించనుంది.

ఈ తరానికీ నచ్చే చిత్రమిది



శివలెంక కృష్ణప్రసాద్

బాలకృష్ణ కథానాయకుడిగా సింగీతం శ్రీనివాస రావు దర్శకత్వంలో తెరకెక్కిన సైన్స్ ఫిక్షన్ చిత్రం 'ఆదిత్య 369'. ఈ సినిమా అప్పట్లో ఎంతటి ఘనవిజయాన్ని సాధించిందో తెలిసిందే. గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సమర్పణలో శ్రీదేవి మూవీస్ నిర్మించిన ఈ సినిమా రీరిలీజ్‌కు సిద్ధమైంది. ఏప్రిల్ 11న 'ఆదిత్య 369' సినిమాను విడుదల చేస్తున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ "నేటి సాంకేతికతకు తగ్గట్లు చిత్రాన్ని ఆధునీకరించాం. విడుదలై 34 ఏళ్లు అవుతున్నా ఈ సినిమాకు ఇప్పటికీ ఏ మాత్రం ఆదరణ తగ్గలేదు. ఇప్పటి తరానికీ గొప్పగా కనెక్ట్ అవుతుంది. మా శ్రీదేవి మూవీస్ సంస్థకు ఎంతో గుర్తింపు తెచ్చింది. ఈ సినిమా మళ్లీ థియేటర్లలో సందడి చేయడం నందమూరి అభిమానులకే కాదు, తెలుగు ప్రేక్షకులకూ మరిచిపోలేని కానుక' అన్నారు. ఈ చిత్రంలో రెండు విభిన్న పాత్రల్లో ప్రేక్షకులను అలరించారు బాలకృష్ణ. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'ఆదిత్య 999 మ్యాక్స్'ను తెరకెక్కిస్తాననీ.. తన తనయుడు మోక్షజ్ఞ కథానాయకుడిగా నటిస్తాడనీ బాలకృష్ణ ఓ సందర్భంలో వెల్లడించారు.

కల్కి 2.. సెట్స్‌పైకి వెళ్లేది అప్పుడే



నాగ్ అశ్విన్

'ఎవడే సుబ్రహ్మణ్యం' చిత్రం నేటి సమాజంలో ఉన్న పరిస్థితులకూ అద్దం పడుతుంది. ఇప్పుడు ఈ చిత్రానికి మరింత ప్రాధాన్యం పెరిగింది. మంచి సినిమాను చూసిన అనుభూతిని ప్రేక్షకులు పొందుతారు' అని దర్శకుడు నాగ్ అశ్విన్ పేర్కొన్నారు. 2015లో నాని హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన సినిమా 'ఎవడే సుబ్రహ్మణ్యం'. స్వప్న దత్, ప్రియాంక దత్ నిర్మించారు. దీనిని ఈనెల 21న థియేటర్లలో రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్ మీట్‌లో నాగ్ అశ్విన్ మాట్లాడుతూ 'కొన్ని సినిమాలపై మమకారం ఎక్కువ ఉంటుంది. 'ఎవడే సుబ్రహ్మణ్యం' చిత్రం కూడా అలాంటిదే. ప్రస్తుతం కల్కి-2 స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. ఈ ఏడాది చివరి నాటికి సెట్స్‌పైకి వెళ్తుంది. ప్రభాస్ స్క్రీన్ ప్రజెన్స్ పార్ట్-2లో ఎక్కువగానే ఉంటుంది. పదేళ్ల నా కెరీర్ సంతృప్తిగానే ఉంది. ఇప్పటివరకూ ఎవరూ ప్రయత్నించని కొత్త తరహా కాన్సెప్ట్‌తోనే నా సినిమాలు చేస్తున్నాను' అని అన్నారు.

అతీంద్రియ శక్తుల నేపథ్యంలో



సుశాంత్ కథానాయకుడిగా కొత్త చిత్రం ఖరారైంది. పృథ్వీరాజ్ చిట్టేటి దర్శకత్వంలో సంజీవని క్రియేషన్స్ బేనర్‌పై వరుణ్‌కుమార్, రాజ్‌కుమార్ నిర్మిస్తున్నారు. మంగళవారం సుశాంత్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను విడుదల చేశారు. సుశాంత్ విభిన్నమైన లుక్‌లో ఆకట్టుకున్నారు. అతీంద్రియ శక్తుల నేపథ్యంలో సాగే చిత్రమిదని పోస్టర్‌ను బట్టి తెలుస్తోంది. అనిరుధ్ కృష్ణమూర్తి స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: వైవీబీ శివసాగర్.

మీమ్స్... రీల్స్



సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. విజయవంతమైన 'మ్యాడ్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తోంది. ఈ నెల 28న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం మంగళవారం మరో గీతాన్ని విడుదల చేసింది. 'ఏసుకోండ్రా మీమ్స్.. చేసుకోండ్రా రీల్స్' అంటూ సాగే ఈ హుషారైన గీతానికి భీమ్స్ సిసిరోలియో సంగీతంతో పాటు స్వరాన్నందించారు. అనుదీప్ కె.వి రచించారు. ఈ చిత్రంలో ప్రియాంక జవాల్కర్, మురళీధర్ గౌడ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో హారికా సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించారు. సూర్యదేవర నాగవంశీ సమర్పిస్తున్నారు.

ఆకట్టుకునే నాన్న కథ



సీనియర్ నటుడు సత్యప్రకాశ్ ప్రధానపాత్ర పోషించిన చిత్రం 'నాన్నా మళ్లీ రావా'. నిర్దేశ్ దర్శకత్వంలో డా. ఉమారావు నిర్మించారు. ఇటీవలే చిత్రీకరణ పూర్తయింది. త్వరలో ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో సత్యప్రకాశ్ మాట్లాడుతూ 'ఇలాంటి సినిమాలు అరుదుగా వస్తాయి. కుటుంబ సమేతంగా చూడతగ్గ చిత్రమిది' అని అన్నారు. ఒక మంచి సినిమా తీసిన అనుభూతి దక్కింది అని దర్శకుడు చెప్పారు. తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని హంగులున్న చిత్రమిదని నిర్మాత చెప్పారు.



ప్రధాని మోదీతో ఇళయరాజా భేటీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఇసైజ్ఞాని ఇళయరాజా మంగళవారం ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ మేరకు ఫోటోలను తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. 'ప్రధానమంత్రి మోదీతో ఒక చిరస్మరణీయమైన సమావేశం. నా సింఫనీ 'వాలియంట్'తో సహా అనేక విషయాల గురించి మేం చర్చించుకున్నాం. ఆయన అభినందనలు, మద్దతుకు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. కాగా, ఈ నెల 8వ తేదీన లండన్‌లో ఇళయరాజా తన తొలి సింఫనీ అరంగేట్రాన్ని విజయవంతంగా నిర్వహించి పలువురి ప్రశంసలు పొందారు. ఈ కార్యక్రమాన్ని ముగించుకుని స్వదేశానికి వచ్చిన ఆయన.. తొలుత తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలసి కృతజ్ఞతలు తెలిపారు.

ఉపరాష్ట్రపతి ప్రశంస

ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాపై ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్ ప్రశంసల వర్షం కురిపించారు. లండన్ వేదికగా ఇళయరాజా సాధించిన ఘనత యావత్ దేశం గర్వించేలా చేసింది అంటూ కొనియాడారు. రాజ్యసభ సభ్యుడైన ఇళయరాజాకు రాజ్యసభ కూడా అభినందనలు తెలిపింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

హంతకుడి ఆత్మ కథ



సంతోష్ కల్వచెర్ల, క్రిషేక పటేల్ జంటగా నటించిన చిత్రం 'కిల్లర్ ఆర్టిస్ట్'. రతన్ రిషి దర్శకత్వంలో జేమ్స్ వాట్ కొమ్ము నిర్మించారు. ఈనెల 21న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో సంతోష్ మాట్లాడుతూ 'ట్రైలర్‌ను దర్శకుడు బోయపాటి గారికి చూపించాం. బాగుందని ఆయన ప్రశంసించారు. ఓటీటీలో చూడాల్సిన చిత్రం కాదిది. థియేటర్లలోనే చూడాలి. సంగీత దర్శకుడు సురేశ్ బొబ్బిలి సినిమాకు ప్రాణం పోశారు. సినిమా విజయవంతమవుతుందన్న నమ్మకం ఉంది' అని అన్నారు. నిర్మాత జేమ్స్ వాట్ కొమ్ము మాట్లాడుతూ 'ఈ సినిమా ఫలితం మీద చాలా మంది భవిష్యత్తు ఆధారపడి ఉంది' అని చెప్పారు. చిత్ర దర్శకుడు రతన్ రిషి మాట్లాడుతూ 'హత్య చేయడాన్ని కళగా భావించే ఓ వ్యక్తి జీవిత కథ ఇది. ఓ వాస్తవ ఘటన ఆధారంగా ఈ కథ రాసుకున్నాను' అని తెలిపారు.

కొత్తగా 2 వేల కోట్ల అప్పు

▸ మరో 5,600 కోట్ల రుణానికీ త్వరలో అనుమతి: మంత్రి కేశవ్

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి కొత్తగా మరో రూ. 2,000 కోట్ల అప్పులకు కేంద్రం మంగళవారం అనుమతి ఇచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సోమవారం వరకు రూ. 71,000 కోట్ల అప్పులకు కేంద్రం అనుమతివ్వగా రాష్ట్రం వాటిని వినియోగించింది. అదనంగా మరో రూ.8,000 కోట్ల అప్పు కావాలని కేంద్రానికి రాష్ట్రం విజ్ఞప్తి చేసింది. దీనిపై ఇంకా కేంద్రం పూర్తిస్థాయిలో నిర్ణయం తీసుకోలేదని అయితే తాత్కాలికంగా రూ.2 వేల కోట్ల అప్పులకు అనుమతి ఇచ్చిందంటూ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పారు. మరో రూ. 5,600 కోట్ల అప్పులకు కూడా త్వరలో అనుమతి వస్తుందన్నారు. విద్యుత్ సంస్కరణలకు సంబంధించిన ప్రోత్సాహకాలు ఇంకా రూ.1,600 కోట్లు రావాలని, వాటి కోసం కేంద్రాన్ని కోరినట్టు మంత్రి చెప్పారు. వైసీపీ ఐదేళ్లలో సాకి పథకం కింద కేవలం రూ. 4 వేల కోట్ల అప్పు తేగా 10 నెలల్లో రూ.7,000 కోట్లు తెచ్చామని చెప్పారు.

వెటర్నరీ విద్యార్థులకు ఉపకార వేతనం పెంపు

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం విద్యార్థులకు నెల వారీగా ఇచ్చే ఉపకార వేతనాలను ప్రభుత్వం పెంచింది. అండర్ గ్రాడ్యుయేట్స్‌కు ప్రస్తుతం ఇస్తున్న రూ.7,000ను రూ.10,500కు పెంచింది. పోస్టు గ్రాడ్యుయేట్స్‌కు రూ.9,000 నుంచి రూ.13,500 చేసింది. పీహెచ్‌డీ విద్యార్థులకు రూ.10వేల నుంచి రూ.15వేలకు పెంచింది.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

▸ మంత్రులు, కార్యదర్శులకు అంధుల సమాఖ్య వినతి

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జాతీయ అంధుల సమాఖ్య, రాష్ట్ర శాఖ ప్రతినిధి బృందం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు మంగళవారం అమరావతి సచివాలయంలో పలువురు మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులను కలిసి, వినతి పత్రాలు అందజేసినట్లు సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోపూరి రామసుబ్బయ్య మీడియాకు తెలిపారు. 'ఉద్యోగాలకు సంబంధించిన జీవో 77ను రద్దు చేసి, వర్టికల్ రిజర్వేషన్ అమలు చేయాలి. అంధ ఉపాధ్యాయులకు ఎన్నో ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న బదిలీ, రీ అపోర్షన్ మెంట్ నుంచి మినహాయింపులు, ఇతర వెసులుబాట్లను నూతన ఉపాధ్యాయ చట్టంలో పొందుపర్చాలి' అని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

సూపర్ సిక్స్‌పై కూటమికే స్పష్టత లేదు: వైసీపీ

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): 'కూటమి ప్రభుత్వం చట్టసభల్లోనే అబద్ధాలు చెప్తోంది. సూపర్ సిక్స్‌పై కూటమి నేతలకే స్పష్టత లేదు' అని వైసీపీ ఎమ్మెల్సీలు ఆర్ రమేశ్ యాదవ్, కేఆర్‌జే భరత్ ఎద్దేవా చేశారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో వారు మాట్లాడారు. '9నెలలైనా సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేయకుండా ఆర్థిక పరిస్థితి బాలేదని, సమయం కావాలని కాలయాపన చేస్తున్నార'ని విమర్శించారు.

'తాడిగడప'లో వైఎస్ఆర్‌ను తొలగించడాన్ని వ్యతిరేకిస్తున్నాం: షర్మిల

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ తాడిగడప మునిసిపాలిటీ పేరులో వైఎస్ఆర్ పదాన్ని తొలగించడంపై పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మంగళవారం ఎక్స్ వేదికగా స్పందించారు. 'నాడు అధికారంలో ఉండగా ఎన్‌టీఆర్ పేరు మార్చి వైసీపీ ప్రభుత్వం అభిమానుల మనోభావాలు దెబ్బతినేలా చేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వైఎస్ఆర్ పేరు చెరిపి ప్రతీకారం తీర్చుకుంటోంది. వైఎస్ఆర్ జిల్లాను తిరిగి వైఎస్ఆర్ కడప జిల్లాగా సవరించడంలో అభ్యంతరం లేకపోయినా... కృష్ణా జిల్లా, తాడిగడప మునిసిపాలిటీలో వైఎస్ఆర్ పేరును తొలగించడంపై తీవ్రంగా ఖండిస్తున్నాం' అని షర్మిల అన్నారు.

తానా సభలకు రండి: సీఎంకు ఆహ్వానం

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని డెట్రాయిట్‌లో జూలై 3 నుంచి 5 వరకు జరిగే తానా సమావేశాలకు రావాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలను తానా ప్రతినిధులు ఆహ్వానించారు. సీఎంను కలిసిన వారిలో తానా చైర్మన్ గంగాధర్ నాదెళ్ల, కాన్ఫరెన్స్ డైరెక్టర్ సునీల్ పాంత్రా, మాజీ అధ్యక్షుడు జయరాం కోమటి తదితరులున్నారు.

సీపీఐ పునర్నిర్మాణమే లక్ష్యం: డి.రాజా

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): సీపీఐ శత వార్షికోత్సవాలను పురస్కరించుకుని క్షేత్రస్థాయి నుంచి పార్టీని పునర్నిర్మించడమే లక్ష్యంగా ఈనెల 23 నుంచి ఏప్రిల్ 14 వరకు దేశవ్యాప్తంగా రాజకీయ అజెండాతో పార్టీ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా తెలిపారు. అన్ని రాష్ట్రాల్లో సభలు, సమావేశాల ద్వారా పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామని, పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణతో కలిసి మంగళవారం విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ శత వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా డిసెంబరు 24, 25 తేదీల్లో విజయవాడలో జాతీయ సెమినార్లు నిర్వహిస్తామన్నారు. డిసెంబరు 26న ఖమ్మంలో శత వార్షికోత్సవ ముగింపు సభ నిర్వహిస్తామని చెప్పారు. మస్క్ పెంటగాన్‌కు మద్దతు ఇస్తున్నారని, తద్వారా భారత రహస్యాలను తెలుసుకునే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా ప్రధాని మోదీ నోరు విప్పడం లేదని, దేశ భద్రతపై దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. మోదీ ప్రజా వ్యతిరేక విధానాలపై అన్ని లౌకిక పార్టీలను కలుపుకొని పోరాటాలకు సమాయత్తమవుతామన్నారు.

ఏపీలో కిసాన్ ఐడీల జారీ భేష్: శివరాజ్‌సింగ్

న్యూఢిల్లీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): 'ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్‌లో డిజిటల్ వ్యవసాయ విప్లవం ఏర్పడింది. దీంతో రైతులు తమ ప్రయోజనాలు, సేవలను సులువుగా పొందగలుగుతున్నారు' అని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. 'కేంద్ర ప్రభుత్వ డిజిటల్ వ్యవసాయ మిషన్ కింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చాలా సమర్థవంతంగా పని చేసింది. ఏపీలో కిసాన్ ఐడీ కార్డుల జారీ నిరంతరం భేషుగ్గా జరుగుతోంది' అని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

రెండు రోజుల పోలీసు కస్టడీకి తురకా కిశోర్

మాచర్లటౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిశోర్, అతని సోదరుడు శ్రీకాంత్‌ను మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు రెండు రోజుల పోలీసు కస్టడీకి అప్పగించింది. బుధ, గురువారాల్లో న్యాయవాది సమక్షంలో వారిని విచారించి, శుక్రవారం ఉదయం 10 గంటలకు కోర్టులో హాజరుపరచాలని జడ్జి ప్రశాంత్ ఆదేశించారు. దీంతో నెల్లూరు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న కిశోర్, శ్రీకాంత్‌లను పోలీసులు గురజాల స్టేషన్‌కు తీసుకొచ్చారు.

నంద్యాల జిల్లాలో 42.7 డిగ్రీలు

అమరావతి, విశాఖపట్నం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండ తీవ్రత కొనసాగింది. మంగళవారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటి నమోదయ్యాయి. నంద్యాల జిల్లా బండిఆత్మకూరు మండలం పెద్ద దేవళాపురంలో 42.7, కర్నూలు జిల్లా ఉలిందకొండలో 42.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 49 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. బుధవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లోని 58 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

'బెట్టింగ్ యాప్' ప్రమోటర్లపై ఈడీ నజర్!

హైదరాబాద్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్‌ల వ్యవహారంపై ఈడీ దృష్టి సారించింది. ఆ యాప్‌లను తమ టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా ప్రచారం చేసి, రూ.లక్షల్లో కమీషన్లు తీసుకుంటున్న వారి వివరాలను ఈడీ అధికారులు సేకరిస్తున్నారు. బెట్టింగ్ యాప్‌ల ప్రమోటర్లపై తెలంగాణలో నమోదైన అన్ని కేసుల వివరాలను మంగళవారం తెప్పించుకున్నారు. తమతమ వ్యక్తిగత సోషల్ మీడియా ఖాతాల ద్వారా బెట్టింగ్ యాప్‌లను ప్రోత్సహిస్తున్న పలువురిపై ఇప్పటికే హైదరాబాద్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ల వల్ల చాలామందికి రోజూ రూ.వేలు, లక్షల్లో డబ్బు వస్తోంది. ఈ క్రమంలో బెట్టింగ్ యాప్‌ల ప్రమోటర్ల ఆర్థిక లావాదేవీలపై ఈడీ దృష్టి సారించింది.



విజయవాడలో ప్రజాప్రతినిధుల క్రీడా పోటీలలో భాగంగా నిర్వహించిన క్రికెట్ మ్యాచ్‌లో బ్యాటింగ్ చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు



టగ్ ఆఫ్ వార్ పోటీలో రఘురామ రాజు, మంత్రులు, ఎమ్మెల్యేలు



క్రికెట్ మ్యాచ్‌లో విజయం సాధించిన మంత్రి నాదెండ్ల మనోహర్ టీం

600 ఎకరాలు.. 400 కోట్లు

పీలేరులో వైసీపీ భూఅక్రమాల చిట్టా

సీఎంవో ఆదేశాలతో ప్రత్యేక బృందాల విచారణ

ఐదేళ్ల వైసీపీ పాలనలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హవా కొనసాగిన ప్రాంతాల్లో భూకబ్జాలు విచ్చలవిడిగా సాగాయి. ఆయన సొంత నియోజకవర్గం పుంగనూరు పక్కనే ఉన్న అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గంలోనూ వైసీపీ నాయకుల అక్రమాలకు లెక్కలేదు. 600 ఎకరాల్లో అక్రమాలకు తెరలేపి రూ.400 కోట్లు దోచుకున్నారు. 'ఆంధ్రజ్యోతి' గతంలోనే దీనిని వెలుగులోకి తెచ్చినా.. అక్రమార్కులపైన, సహకరించిన అధికారులపైనా తూతూమంత్రంగా చర్యలు చేపట్టారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ అక్రమాలపై దృష్టి సారించిన ముఖ్యమంత్రి కార్యాలయం.. వాటిని వెలికి తీయాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ఆయన ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 84 మంది సిబ్బందితో చడీచప్పుడు లేకుండా విచారణ జరిగింది. త్వరలో కలెక్టర్ తన నివేదికను సీఎంకు సమర్పించనున్నారు. దీంతో వైసీపీ నాయకుల ముసుగులో ఉన్న భూఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

(రాయచోటి-ఆంధ్రజ్యోతి)

పీలేరు నియోజకవర్గంలో భూఆక్రమణల భాగోతం మళ్లీ తెరపైకి వచ్చింది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక పీలేరు మండలంలోని పీలేరు, దొడ్డిపల్లె, ఎర్రగుంటపల్లె, ముడుపులవేములు, గూడరేవుపల్లె, బోడుమల్లువారిపల్లె గ్రామ పంచాయతీల్లో పెద్దఎత్తున ప్రభుత్వ, డీకేటీ భూములు ఆక్రమణకు గురయ్యాయి. రియల్టర్ల అవతారమెత్తిన అనేక మంది వైసీపీ నాయకులు సుమారు 600 ఎకరాలను ఆక్రమించి.. వాటిలో ప్లాట్లు వేసి.. అమ్ముకుని రూ.400 కోట్లు దోచుకున్నారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' 2021లోనే వెలుగులోకి తెచ్చింది. అప్పట్లో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి కూడా ఈ అక్రమాలపై పూర్తి సాంకేతిక ఆధారాలతో జిల్లా ఉన్నతాధికారులకు, హైకోర్టు, లోకాయుక్తలకు ఫిర్యాదు చేశారు. లోకాయుక్త విచారణకు ఆదేశించింది. అప్పటి ఉమ్మడి చిత్తూరు జిల్లా కలెక్టర్ హరినారాయణ ఆదేశాల మేరకు నాటి మదనపల్లె సబ్‌కలెక్టర్ జాహ్నవి నేతృత్వంలో సుమారు 80 మంది అధికారులు 10 బృందాలుగా విడిపోయి దాదాపు నెల రోజులపాటు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక అందించారు. సదరు గ్రామ పంచాయతీల పరిధిలో సుమారు రూ.400 కోట్లు విలువజేసే 600 ఎకరాల భూమిలో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు పేర్కొన్నారు. పీలేరులో 100.74 ఎకరాలు, గూడరేవుపల్లెలో 165.60, దొడ్డిపల్లెలో 203.92, బోడుమల్లువారిపల్లెలో 102.99, ఎర్రగుంటపల్లెలో 1.21, ముడుపులవేముల పంచాయతీలో 26.91 ఎకరాలు.. మొత్తం 601.37 ఎకరాల్లో అవకతవకలు జరిగినట్లు సబ్‌కలెక్టర్ నివేదికలో పేర్కొన్నారు. వాటిలో 209.79 ఎకరాల పట్టా భూముల్లో అనధికార లేఔట్లు, 158.19 ఎకరాల చుక్కల భూముల్లో, 129.40 ఎకరాల ప్రభుత్వ భూమిలో అనధికార లేఔట్లు వేసి అక్రమాలకు పాల్పడ్డారని.. 103.99 ఎకరాల డీకేటీ భూములు అక్రమంగా చేతులు మారాయని స్పష్టం చేశారు. 2021 నవంబరులో ఇచ్చిన ఈ నివేదికలో.. ఎకరా రూ.40 లక్షల నుంచి రూ.కోటి దాకా పలుకుతోందని, సగటున ఎకరా రూ.70 లక్షలు వేసుకున్నా అన్యాక్రాంతమైన 129.40 ఎకరాల ప్రభుత్వ భూమి విలువ రూ.90.58 కోట్లు ఉంటుందని తెలిపారు.



అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గంలోని బోడుమల్లువారిపల్లె పంచాయతీలో భూఅక్రమాలపై విచారిస్తున్న అధికారులు (ఫైల్)

నామమాత్రపు చర్యలతో సరి..

సబ్‌కలెక్టర్ నివేదిక ఆధారంగా 2022లో రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమిషనర్ పీలేరు మండలంలో పనిచేసిన 12 మంది రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకున్నారు. వారందరినీ సస్పెండ్ చేయడమే కాకుండా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అయితే అప్పటి అధికార పార్టీ నేతల అండదండలతో వారందరినీ బదిలీలతో సరిపెట్టారు.

తాజాగా విచారణ

పీలేరు మండలంలో అక్రమాలు, ఆక్రమణలపై పెద్దఎత్తున ఫిర్యాదులు రావడంతో ముఖ్యమంత్రి కార్యాలయం వీటిపై విచారణ జరపాలని కలెక్టర్ శ్రీధర్‌ను ఆదేశించింది. దీంతో ఆయన గత నెల 13న ఆక్రమణలను స్వయంగా దగ్గరుండి కూల్చివేయించారు. ఆ సమయంలో అధికారులపై కొందరు తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు తెచ్చారు. వీటిని స్వయంగా గమనించిన కలెక్టర్ ఆగ్రహించి గతంలో జరిగిన అక్రమాల పని పట్టాలనుకున్నారు. గత సబ్‌కలెక్టర్ ఇచ్చిన నివేదికను బయటకు తీశారు. 84 మంది సిబ్బందితో కూడిన ఆరు బృందాలు 10 రోజులపాటు క్షేత్రస్థాయిలో పర్యటించి అన్యాక్రాంతమైన ప్రభుత్వ, డీకేటీ భూములను పరిశీలించాయి. అక్రమాలను నిగ్గుతేల్చి కలెక్టర్‌కు ప్రాథమిక నివేదిక ఇచ్చాయి. ఆయన మరిన్ని వివరాలతో తుదిమెరుగులు దిద్ది ఈ నెలాఖరులో జరిగే కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో ముఖ్యమంత్రికి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పూర్తిస్థాయి నివేదిక అందజేయనున్నట్లు తెలుస్తోంది.

ప్రతి జిల్లాలో క్రీడా స్టేడియం: స్పీకర్ అయ్యన్న

అట్టహాసంగా ప్రజాప్రతినిధుల క్రీడా పోటీలు

విజయవాడ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో క్రీడలను అభివృద్ధి చేయాలి. క్రీడాకారులను ప్రోత్సహించాలి. అందుకు ప్రతి జిల్లాలో స్టేడియంలు నిర్మించడానికి ప్రణాళికలు రూపొందించాం' అని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రజాప్రతినిధుల క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం పోటీలను అయ్యన్న పాత్రుడు ప్రారంభించారు. 'రాష్ట్రంలో ప్రస్తుతం ఎక్కడా క్రీడలు కనిపించడం లేదు. రాష్ట్రంలో ఎంతో మంది మంచి క్రీడాకారులున్నారు. క్రీడలకు పూర్వవైభవం తీసుకురావడం కోసం ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉంది. ప్రతి జిల్లాలో స్టేడియంలు నిర్మించి క్రీడలకు పూర్వవైభవం తీసుకొస్తాం' అని స్పీకర్ అన్నారు. ఉపసభాపతి రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ.. 'ప్రతి ఒక్కరిలోను క్రీడాస్ఫూర్తి ఉండాలి. ఇలాంటి క్రీడా పోటీల్లో ప్రజాప్రతినిధులు పాల్గొనడం వల్ల నియోజకవర్గాల్లో క్రీడలను ప్రోత్సహించే అవకాశం వస్తుంది' అన్నారు. ఈ పోటీల్లో సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ గాయపడ్డారు. మంత్రి రాంప్రసాదరెడ్డి, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరిగింది. జట్టులో ఉన్న విజయ్ కుమార్ ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు బంతి కోసం పరిగెత్తుతూ పడిపోయారు. మొత్తం 6 జట్లు క్రికెట్ మ్యాచ్ ఆడాయి. అందులో నాదెండ్ల మనోహర్, పల్లా శ్రీనివాస్, ఎం.రాంప్రసాద్‌రెడ్డి జట్లు గెలిచాయి. మహిళల టగ్ ఆఫ్ వార్ పోటీలో గుమ్మిడి సంధ్యారాణి, వంగలపూడి అనిత జట్లు తలపడగా.. గుమ్మిడి జట్టు గెలిచింది. పురుషుల టగ్ ఆఫ్ వార్ పోటీలో మొత్తం నాలుగు జట్లు తలపడ్డాయి. గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రఘురామకృష్ణరాజు జట్లు గెలుపొందాయి. కబడ్డీలో అయ్యన్న, అచ్చెన్న జట్లు పోటీపడగా.. అచ్చెన్న జట్టు గెలిచింది. వాలీబాల్‌లో అయ్యన్న జట్టు, త్రోబాల్‌లో భూమా అఖిల ప్రియ జట్టు గెలిచాయి.

'పే టూ ప్లే' విధానం రద్దు: రాంప్రసాద్‌రెడ్డి

గత వైసీపీ ప్రభుత్వం క్రీడా ప్రాంగణాల్లో 'పే టూ ప్లే' విధానాన్ని ప్రవేశపెట్టిందని, దీనిని రద్దు చేసి క్రీడా కారులకు ఉచితంగా క్రీడలు ఆడుకునేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రవాణా, క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి వివరించారు. మంగళవారం శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు.

సామాన్యుడికి ఊరట అక్కర్లేదా?

▸ బిల్లులు సకాలంలో కట్టలేదని భారీగా పెనాల్టీలు

▸ కానీ, కోరగానే ప్రభుత్వానికి ఉపశమనం

▸ కార్యాలయాలు, స్థానిక సంస్థలకు సర్‌చార్జీ మాఫీ.. ఈఆర్‌సీ ఆదేశాలు

అమరావతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సకాలంలో బిల్లులు చెల్లించలేదంటూ పెనాల్టీలను సామాన్య విద్యుత్ వినియోగదారులపై మోపుతున్నారు. ఏవో సాకులతో ట్రూఅప్ చార్జీలను బాదుతున్నారు. వాటిని సామాన్యుడు కడుతూనే ఉన్నాడు. కానీ, ఇదే సమస్యను ఎదుర్కొన్న సర్కారుకు మాత్రం ఇట్టే ఊరట లభించింది. అసలేం జరిగిందంటే...రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు గత ఏడాది డిసెంబరునాటికి రూ.9,010.94 కోట్లను డిస్కమ్‌లకు బకాయి పడ్డాయి. దీనిపై అపరాధ రుసుము రూ.3158.45 కోట్లుగా డిస్కమ్‌లు ఖరారు చేశాయి. దీంతో మొత్తం బకాయి రూ.12,169.38 కోట్లకు చేరింది. ఇందులో ఒక్క 2024-25 సంవత్సరంలోనే బకాయిల మొత్తం రూ.4,782.33 కోట్లు ఉండగా, అందులో పెనాల్టీ రూ.1,605.80 కోట్లు. ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు చెల్లించాల్సిన బకాయిల్లోంచి సర్‌చార్జీలను మాఫీ చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ సంస్థకు (ఏపీఈఆర్‌సీ) ఆర్థిక శాఖ లేఖ రాసింది. దీనిపై మంగళవారం ఈఆర్‌సీ సానుకూలంగా స్పందించింది. సర్‌చార్జీలను రద్దు చేసింది.

డబ్బులిస్తామని రప్పించి.. కిడ్నాపర్ల ఆట కట్టించి..

▸ కర్ణాటక కిడ్నాపర్ల ముఠా అరెస్టు

▸ ముగ్గురిని కాపాడిన శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు

పుట్టపర్తి రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసై, డబ్బు కోసం ముగ్గురిని కిడ్నాప్ చేసిన కర్ణాటక ముఠాను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వారు డిమాండ్ చేసిన డబ్బులు ఇస్తామని బాధితుడితో చెప్పించి.. వారిని రప్పించి చాకచక్యంగా అరెస్టు చేశారు. వారి నుంచి మూడు తుపాకులు, ఏడు తూటాలు, రెండు వాహనాలు, కత్తి,రూ.1.5 లక్షలు నగదు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసు కథనం ప్రకారం, శ్రీసత్యసాయి జిల్లా గుడిబండ మండలం బీటీపల్లి గ్రామానికి చెందిన మనోహర్ కర్ణాటకలోని మధుగిరి తాలుకా పుట్టినహళ్లి గ్రామంలో అదృష్టభైరవి ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఆయన వద్ద మహిమలున్నాయని భావించిన ఈ ముగ్గురు గుప్త నిధులు తవ్వించాలని భావించారు. అయితే, ఇందుకు మనోహర్ ఒప్పుకోలేదు. దీంతో 6న మనోహర్, అతని సోదరుడు రాకేశ్, డ్రైవర్ మనును కిడ్నాప్ చేసి కొడగు జిల్లా పశ్చిమ కనులకు తరలించారు. డబ్బులు ఇవ్వాలని తుపాకీలతో బెదిరించారు. మనోహర్ తన అసిస్టెంట్ రవి ద్వారా బంగారం అమ్మించి, రూ.11 లక్షలు తెప్పించి ఇచ్చాడు. ఈ క్రమంలో డబ్బులు తెచ్చిన రవిని కూడా కిడ్నాపర్లు బంధించారు. రూ.11 లక్షలు చాలవని, రూ.5 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తనను వదిలిపెడితే ఆస్తులు అమ్మి డబ్బులు తెచ్చిస్తానని నమ్మించి ఈ నెల 13న బయటపడ్డాడు. ఈ నెల 14న స్వగ్రామానికి చేరుకున్న మనోహర్ గుడిబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సూచన మేరకు డబ్బులిస్తానని ముఠా సభ్యులను ఈ నెల 17న వారిని మడకశిరకు మనోహర్ రప్పించాడు. వారు రాగానే పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కేసును ఛేదించిన పోలీసులను ఎస్పీరత్న అభినందించారు.

సీఎం సమక్షంలో.. గేట్స్‌తో నేడే ఏపీ ఒప్పందాలు

ఉదయం మోదీతో బాబు భేటీ?

న్యూఢిల్లీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు బుధవారం ఢిల్లీలో గేట్స్ ఫౌండేషన్‌తో కీలక ఒప్పందాలు కుదుర్చుకోనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఒబెరాయ్ హోటల్‌లో గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్‌ను ఆయన కలుస్తారు. వారిద్దరి సమక్షంలో ఆరోగ్య సంరక్షణ, విద్య, పరిపాలన, వ్యవసాయం, ఉపాధి రంగాల్లో అవగాహన పత్రంపై సంతకాలు జరుగుతాయని అధికార వర్గాలు తెలిపాయి. అంతకుముందు ఉదయం ఆయన పార్లమెంటులో ప్రధాని మోదీని కలుసుకునే అవకాశాలు ఉన్నాయి. రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రారంభించేందుకు ఆయన్ను ఆహ్వానించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. అలాగే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తో కూడా సమావేశమవుతారని.. పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకం తాలూకు డీపీఆర్‌ను అందిస్తారని తెలుస్తోంది. కాగా.. గేట్స్ ఫౌండేషన్‌తో ఆరోగ్య డేటా వ్యవస్థలు, టెలిమెడిసిన్, తక్కువ ఖర్చుతో వైద్య పరీక్షలు, వైద్య ఉపకరణాలు.. డిజిటల్ విద్య, జాతీయ విద్య సదస్సు, విద్యా రంగంలో సాంకేతిక పరిజ్ఞాన పరికరాలు, ప్రజాసేవలు, వ్యవసాయంలో ఉపగ్రహ డేటా ద్వారా పారదర్శకంగా సబ్సిడీ పంపిణీ, ఉత్పాదకత, వివిధ రంగాల్లో ఉపాధి కల్పనపైనా ఒప్పందాలు కుదరనున్నాయి. ఈ రంగాలన్నిటిలో ప్రధానంగా ఏఐను అన్వయించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది.

దీర్ఘదృష్టి ఉన్న నేత: రాందేవ్

కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కుమారుల వివాహ రిసెప్షన్‌కు టీడీపీ ఎంపీలతో కలిసి చంద్రబాబు హాజరయ్యారు. అక్కడ ఎదురైన బాబా రాందేవ్ ఆయన్ను ఆప్యాయంగా పలుకరించారు. ఆరోగ్యంగా కనిపిస్తున్నారని ప్రశంసించారు. ఈ దేశంలో అభివృద్ధి పట్ల దీర్ఘదృష్టి ఉన్న నాయకుడంటూ ఆయన్ను అక్కడు న్న ఇతర సాధువులకు పరిచయం చేశారు. కాగా.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా ఈ రిసెప్షన్‌కు హాజరయ్యారు.



శివరాజ్‌సింగ్ చౌహాన్ కుమారుల వివాహ రిసెప్షన్‌లో చంద్రబాబు

పలుకుబడిని వాడుకోండి

ఎంపీలకు చంద్రబాబు దిశానిర్దేశం

వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు టీడీపీకి ఎంత గౌ రవం లభించిందో ప్రస్తుతం మోదీ హయాంలో కూడా అంతే గౌరవం లభిస్తోందని సీఎం చంద్రబాబు అన్నారు. మం గళవారం రాత్రి ఢిల్లీలో ఆయన టీడీపీ ఎంపీల తో సమావేశమయ్యారు. కేంద్రంలో ఉన్న పలుకుబడిని వినియోగించుకుని.. వివిధ శాఖల కింద రాష్ట్రానికి రావలసిన నిధులను రాబట్టాలని వారిని ఆదేశించారు. ఎన్డీయే భాగస్వామిగా అధికార పక్షంలో ఉన్నామని తెలుసుకుని లక్ష్మణ రేఖను దాటకుండా చూసుకోవాలని హితవు చెప్పారు.

రాజధాని పనులపై చంద్రబాబు సమీక్ష

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పనుల పునఃప్రారంభంపై ప్రధాని నరేంద్ర మోదీ ముందు ఉంచాల్సిన ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మున్సిపల్ మంత్రి నారాయణ కలసి ఉన్నతాధికారులతో చర్చించారు.

ఏపీలో కొరియా పెట్టుబడులు

ముసాయిదా ఒప్పందంపై సంతకాలు

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్, ఇతర రంగాల్లో ప్రభుత్వం కొరియా పెట్టుబడులను ఆహ్వానిస్తోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. మంగళవారం సచివాలయంలో కొరియా ప్రతినిధి బృందంతో చర్చలు జరిపారు. రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కూడా చర్చల్లో పాల్గొన్నారు. రాష్ట్రంలో పీపీపీ మోడల్‌లో స్కిల్ అకాడమీ ఏర్పాటు, కస్టమైజ్డ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్‌లో కొరియన్ కంపెనీ సహకారం, కొరియన్ ఎంఎస్ఎంఈ పారిశ్రామిక సముదాయం అభివృద్ధి, ఆగ్రో, ఫుడ్ ప్రాసెసింగ్, మెరైన్, రొయ్యల ప్రాసెసింగ్, ప్యాకింగ్ తదితర 25 కీలక పరిశ్రమల్లో కొరియన్ పెట్టుబడులను ఆకర్షించడం, రాష్ట్రం నుంచి కొరియాకు ప్రీమియం మామిడి ఎగుమతులను పునరుద్ధరించడం, హస్తకళలు, ఆయుర్వేదం, ప్రాసెస్ చేసిన ఆహారాల ప్రీమియం బ్రాండ్లను కొరియన్ మార్కెట్‌లో విస్తరించడం తదితర అంశాలపై చర్చించారు. ఏపీలో తయారీ, శిక్షణ కేంద్రాలను నెలకొల్పేందుకు కొరియన్ సోలార్ కంపెనీలతో భాగస్వామ్యం, బ్యాటరీల తయారీ, సాంకేతికత బదిలీ కోసం కొరియా-భారత్‌ల మధ్య సహకారంపై కూడా చర్చించారు. ఈ చర్చల అనంతరం పలు రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు కొరియా బృందం రాష్ట్ర ప్రభుత్వంతో ముసాయిదా ఒప్పందంపై సంతకాలు చేసినట్లు మంత్రి భరత్ వెల్లడించారు.

అశోక్ లేల్యాండ్ బస్సులు ఇక ఏపీ నుంచే

(మొదటి పేజీ తరువాయి)

సాయంత్రం 5 గంటలకు లాంఛనంగా ప్రారంభించనున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూపుదిద్దుకున్న మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో అశోక్ లేల్యాండ్‌కు రాష్ట్ర ప్రభుత్వం భూములు కేటాయించింది. ఇందులో ఆ సంస్థ ఎలక్ట్రికల్ బస్ బాడీ బిల్డింగ్ ప్లాంట్ నెలకొల్పింది. దీనిని అంగరంగ వైభవంగా ప్రారంభోత్సవం చేసేలోపు అధికారంలోకి వైసీపీ వచ్చింది. అప్పటి నుంచి గత ప్రభుత్వం అశోక్ లేల్యాండ్‌కు తగిన సహకారం ఇవ్వలేదు. కొవిడ్ అనంతర పరిస్థితులు కూడా ప్లాంట్ కార్యకలాపాలకు ఆటంకంగా మారాయి. కూటమి ప్రభు త్వం వచ్చాక అశోక్ లేల్యాండ్ సంస్థ ప్లాంట్ ప్రారంభానికి చర్యలు చేపట్టింది. ఎలక్ట్రికల్ బస్సులే కాకుండా అన్ని రకాల బస్సులకు బాడీ బిల్డింగ్ చేసే దిశగా ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. అమరావతి రాజధాని ప్రాంత పరిధిలో ప్రారంభం కాబోతున్న మొట్టమొదటి ఆటోమొబైల్ ప్లాంటు ఇది. మల్లవల్లి అశోక్ లేల్యాండ్‌లో ఫేజ్ -1లో 600 మందికి, ఫేజ్ -2 లో 1200 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. 75 ఎకరాల్లో విస్తరించిన ఈ ప్లాంటులో అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలతో బస్సులకు బాడీ బిల్డింగ్ చేస్తారు. ఈ ప్లాంట్‌లో 7 మీటర్ల నుంచి 13.5 మీటర్ల వరకు బీఎస్- 6 మోడళ్ల బస్సులను ఉత్పత్తి చేస్తారు. ఈ ప్లాంటు ఫేజ్-1, 2లలో సంవత్సరానికి 2,400 బస్సుల ఉత్పత్తి సామర్థ్యంతో పనిచేస్తుంది. అశోక్ లేల్యాండ్ ప్రపంచంలో బస్సుల ఉత్పత్తిలో 4వ స్థానంలోనూ, ట్రక్కుల ఉత్పత్తిలో 13వ స్థానంలోనూ ఉంది. ఇటీవల భారతదేశంలో 34వ ఉత్తమ బ్రాండ్‌గా ర్యాంక్‌ను పొందింది.



శాసనసభ వద్ద స్పీకర్ అయ్యన్న, డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో మంత్రులు, ఎమ్మెల్యేల గ్రూప్ ఫొటో



శాసనసభలో అరకు కాఫీ స్టాల్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్న, డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు, పక్కన సీఎం చంద్రబాబు, మంత్రి సంధ్యారాణి, డిప్యూటీ సీఎం పవన్, కూన, మురళి, బుచ్చయ్య, కామినేని, ఉమ తదితరులు

అసెంబ్లీలో అరకు కాఫీ స్టాల్

» డిప్యూటీ సీఎం పవన్‌కు కాఫీ ఇచ్చిన సీఎం చంద్రబాబు

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు అసెంబ్లీలో అరకు కాఫీ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. అరకు కాఫీకి మనమే ప్రచారం కల్పించాలని, వెంటనే అసెంబ్లీ ప్రాంగణంలో అరకు కాఫీ స్టాల్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ మేరకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు అరకు కాఫీ స్టాల్‌ను అసెంబ్లీలో ఏర్పాటు చేయించారు. దీనిని మంగళవారం ఉదయం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు కలిసి ప్రారంభించారు. స్టాల్ ప్రారంభం అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు సీఎం చంద్రబాబు స్వయంగా కాఫీ అందించారు.

పురుషులకూ స్వయం సహాయక గ్రూపులు: నారాయణ

అమరావతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక సంఘాల మాదిరిగానే పురుషుల కోసం ప్రత్యేక సంఘాలకు మార్గదర్శకాలు సిద్ధం చేశామని, వీటిని గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తామని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తెలిపారు. మంగళవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో పురుషుల కోసం సహాయక సంఘాల ఏర్పాటుపై ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పారు. పురుషులకు కూడా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. తొలుత దేశంలో 25 నగరాల్లో ప్రారంభించాలని నిర్ణయించి, ఏపీలో విజయవాడ, విశాఖపట్నంలో నగరాల్లో ఈ సంఘాల ఏర్పాటుకు అనుమతిచ్చిందన్నారు. దీనిని గ్రామీణ ప్రాంతాలకు విస్తరించేందుకు కేంద్రంతో మాట్లాడతామన్నారు.

బుడమేరుకు శాశ్వత పరిష్కారం: నిమ్మల

అమరావతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో విజయవాడకు బుడమేరు వరద రాకుండా నాలుగు రకాలుగా పటిష్ఠ ప్రణాళికలు సిద్ధం చేశామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. బుడమేరు ఆక్రమణలపై మంగళవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే సుజనా చౌదరి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పారు. వందేళ్లలో చూడని విధంగా 50 వేల క్యూసెక్కుల నీరు బుడమేరులోకి వచ్చి చేరిందని మంత్రి అన్నారు.

ఖనిజ ఆదాయ నష్టం రూ.19,245 కోట్లు: కొల్లు

అమరావతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ అసమర్థ పాలనలో (2019 నుంచి 2024 వరకు) అంచనా వేసిన ఖనిజ ఆదాయ నష్టం రూ. 19,245 కోట్లు అని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. మంగళవారం శాసన మండలిలో టీడీపీ సభ్యులు ప్రశ్నోత్తరాల్లో అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం తెలిపారు. ప్రభుత్వ శ్వేత పత్రంలో కేవలం 5, 6 అంశాల్లోనే రూ.20 వేల కోట్ల దుర్వినియోగాన్ని గుర్తించిన విషయం వాస్తవమేనా? దీనిపై తీసుకున్న చర్యలు ఏమిటి అని టీడీపీ సభ్యులు ప్రశ్న సంధించగా మంత్రి సమాధానమిచ్చారు.

55 మంది రైతుల ఆత్మహత్య: అచ్చెన్న

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): గతేడాది జూన్ నుంచి ఇప్పటి వరకు వ్యవసాయ సంబంధ కారణాల వల్ల 55 మంది రైతుల ఆత్మహత్యలు నమోదయ్యాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు శాసనమండలిలో మంగళవారం వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. బాధిత రైతులు, కౌలు రైతుల కుటుంబాలకు రూ.7లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందించనున్నట్లు తెలిపారు. కాగా, ఉద్యానవన సాగులో స్ప్రింక్లర్లు, డ్రిప్ ఏర్పాటు చేసుకునే రైతులందరికీ నూటికి నూరు శాతం ఉచితంగా అందిస్తున్నామని మంత్రి శాసన మండలిలో వైసీపీ సభ్యుల ప్రశ్నకు సమాధానమిచ్చారు.

ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా ఒంటిమిట్ట: దుర్గేష్

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఒంటిమిట్ట రామాలయాన్ని ఆధ్యాత్మిక పర్యాటకం పరిధిలోకి తీసుకువచ్చే ప్రతిపాదన ఉందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. మంగళవారం శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. దేవుని కడప, పుష్పగిరి, బ్రహ్మంగారి మఠం, గండి, యాగంటి, నందవరం, మహానంది దేవాలయాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ప్రతి గింజా కొంటాం.. ఆందోళన వద్దు: నాదెండ్ల

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు. నెల్లూరు జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో ఎదుర్కొంటున్న సమస్యలపై ఆ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో మంత్రి నాదెండ్ల మంగళవారం అసెంబ్లీలోని తన చాంబర్‌లో చర్చలు జరిపారు. నెల్లూరు జిల్లాలో ఇప్పటి వరకు 15 వేల టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేసి.. 24 గంటల్లోపే రైతుల ఖాతాల్లో నగదు జమ చేసినట్లు మంత్రి తెలిపారు.

ఇక మీ సేవలు ప్రజా క్షేత్రంలో..: మోషేన్ రాజు

» పదవీకాలం ముగిసిన ఏడుగురు ఎమ్మెల్సీలకు ఘన వీడ్కోలు

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేస్తున్న ఎమ్మెల్సీలు ఇకపై వారి సేవలను ప్రజాక్షేత్రంలో ఉపయోగించాలని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు కోరారు. ఈ నెల 29వ తేదీతో పదవీకాలం ముగియనున్న ఎమ్మెల్సీలు యనమల రామకృష్ణుడు, కేఎస్ లక్ష్మణరావు, పర్చూరి అశోక్‌బాబు, దువ్వారపు రామారావు, బి తిరుమల నాయుడు, ఇళ్ల వెంకటేశ్వరరావు, పాకలపాటి రఘువర్మలకు శాసనమండలి మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికింది. ఈ సందర్భంగా శాసన మండలి చైర్మన్, కూటమి, వైసీపీ సభ్యులు వారి సేవలను కొనియాడారు.

టీజీటీ టీచర్ల సమస్యలు పరిష్కరిస్తాం: డోలా

టీజీటీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయులు స్పష్టం చేశారు. మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో సొసైటీల్లో టీజీటీ-పీఎస్ పోస్టుల స్థాయి పెంపుపై కూన రవికుమార్, పల్లె సింధూరరెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిచ్చారు. గత ప్రభుత్వం నియమించిన కమిటీ నివేదిక వచ్చిన తర్వాత వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. 010 కింద జీతాలు ఇవ్వడానికి ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వలేదన్నారు.

వాట్సాప్ ద్వారా 500 సేవలు!

» జూన్ 30 నాటికి అందుబాటులోకి తెస్తాం

» ప్రపంచంలోనే మెరుగ్గా 'మనమిత్ర' సేవలు

» అసెంబ్లీలో వాట్సాప్ గవర్నెన్స్‌పై లోకేశ్



ప్రజల జేబులో ప్రభుత్వ కార్యాలయం

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రపంచంలోనే మెరుగ్గా నిర్వహిస్తామని, ఈ ఏడాది జూన్ 30నాటికి 500 రకాల ప్రభుత్వ సేవలను మన మిత్రలో వాట్సాప్ ద్వారా అందిస్తామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ చెప్పారు. మంగళవారం అసెంబ్లీలో వాట్సాప్ గవర్నెన్స్‌పై స్వల్పకాలిక చర్చ సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 1983లో ఎన్టీఆర్ సీఎం అయిన వెంటనే పటేల్-పట్వారీ వ్యవస్థను రద్దు చేసి పరిపాలనను ప్రజల ముందుకు తీసుకెళ్లారని గుర్తు చేశారు. ప్రజల వద్దకు పాలన, ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకోవాలని చంద్రబాబు పదే పదే చెప్పేవారని తెలిపారు. పాదయాత్రలో ప్రజలను కలిసినప్పుడు ప్రభుత్వ కార్యాలయాల ముందు పడిగాపులు పడాల్సి వస్తోందని తన దృష్టికి తెచ్చారని లోకేశ్ వివరించారు. బటన్ నొక్కితే సినిమా టిక్కెట్లు, ఆహారం, నిత్యావసర వస్తువులు, ట్యాక్సీ వంటి అన్ని సేవలూ ఇంటికి వస్తున్నప్పుడు ప్రభుత్వ సేవలు ఎందుకు రావని ప్రజలు తనను ప్రశ్నించారని ఆయన చెప్పారు. ఆఫీసులకు వెళ్తే డబ్బులు ఇవ్వాల్సి వస్తుందని, గంటల తరబడి వేచిఉండాల్సి వస్తుందని, అందుకే సామాన్య ప్రజలు అక్కడకు వెళ్లడానికి ఇష్టపడటం లేదని అన్నారు. మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాలలో ఎక్కువ ఎంపీటీసీలు టీడీపీ-జనసేన గెలుచుకున్నా... ఎంపీపీగా బీసీ మహిళకు రిజర్వేషన్ వస్తే ఆనాటి ఎమ్మెల్యే ఆమెకు కులధృవీకరణ పత్రం అందకుండా అడ్డుపడి, పదవికి దూరం చేసిన విషయాన్ని లోకేశ్ ప్రస్తావించారు. వ్యవస్థలో మార్పు తీసుకురావాలని ఆ రోజే తాను సంకల్పించానన్నారు. అప్పటి నుంచే తనలో వాట్సాప్ గవర్నెన్స్ ఆలోచన మొదలైందన్నారు.

మనమిత్రతో కీలక సంస్కరణలకు నాంది

విజిబుల్ గవర్నెన్స్-ఇన్విజబుల్ గవర్నెన్స్ నినాదం ద్వారా ప్రజల దైనందిన జీవితంలో అధికారులు, రాజకీయ నాయకుల అవసరం ఉండకూడదన్నదే తన లక్ష్యమని లోకేశ్ చెప్పారు. బేసిక్ సర్వీసెస్, వివిధ రకాల సర్టిఫికెట్ల జారీలో అధికారుల పాత్ర లేకుండా చేయాలనే ఆలోచన చేశానని, అందరి ఫోనుల్లో ఉన్న వాట్సాప్ ద్వారా మనమిత్ర పేరుతో ప్రజల చేతిలోకి పాలన తెచ్చే లక్ష్యంతో సేవలు ప్రారంభించామని మంత్రి చెప్పారు. పౌరసేవలకు గేమ్ ఛేంజర్‌గా మన మిత్ర పేరుతో సేవలకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రస్తుతం 200 సేవలను మనమిత్ర ద్వారా అందిస్తున్నామని, సీఎం చంద్రబాబు సూచన మేరకు టీటీడీ అధికారులతో చర్చించి 30 రోజుల్లో టీటీడీకి సంబంధించి అన్నీ సర్వీసులను మనమిత్ర ప్లాట్‌ఫాంపైకి తీసుకురాబోతున్నామని లోకేశ్ తెలిపారు. ఈ నెలాఖరుకు 300 రకాల ప్రభుత్వ సేవలు వాట్సాప్ ద్వారా అందుబాటులోకి తీసుకురాబోతున్నామని తెలిపారు. జూన్ 30 నాటికి 500 సర్వీసులు మనమిత్ర ద్వారా అందుబాటులోకి తెస్తామని మంత్రి లోకేశ్ చెప్పారు. నూతన విధానంలో వివిధ రకాల సర్టిఫికేట్లు ట్యాంపరింగ్‌కు ఆస్కారం లేకుండా క్యూఆర్‌కోడ్ అనేబుల్ సర్టిఫికేట్లు అందజేస్తామని లోకేశ్ తెలిపారు. త్వరలో విద్యార్థుల పరీక్షల ఫలితాలు కూడా వాట్సాప్ ద్వారానే వారి ఫోన్లకు పంపిస్తామన్నారు.

మీసేవ కేంద్రాల ద్వారా సమాంతర సేవలు

పాదయాత్ర సమయంలో తనను మీసేవ ఆపరేటర్లు కలిశారని, గత ప్రభుత్వం మీసేవ కేంద్రాల సేవలను కుదించిన విషయాన్ని తన దృష్టికి తెచ్చారని లోకేశ్ వివరించారు. ప్రస్తుతం మీసేవ కేంద్రాలు కూడా ఐటీ పరిధిలోకి వచ్చాయని, మీసేవలను కూడా అందుబాటులోకి తెస్తామని ఆపరేటర్లకు హామీ ఇస్తున్నామని మంత్రి చెప్పారు. సమాంతరంగా సచివాలయాలు, వాట్సాప్, మీసేవల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందిస్తామన్నారు. వందరోజుల్లో మనమిత్ర 2.0 ఏఐ ద్వారా వాయిస్ ఎనేబుల్ విధానం అందుబాటులోకి తెస్తామన్నారు.

ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించాలి: లోకేశ్

ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలు విధిగా నిబంధనలు పాటించాలని విద్యాశాఖ మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. పాఠశాలలు, కళాశాలల్లో వ్యాయామ విద్యా బోధన (ఫిజికల్ ఎడ్యుకేషన్) ముఖ్యమని అన్నారు. మంగళవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలో టెక్నో, డిజిటల్ స్కూల్స్‌కు అపార్ట్‌మెంట్ స్కూల్ కాన్సెప్ట్ ఉందా? అని అడిగారు. ప్రయివేటు స్కూల్స్ ప్రమాణాలు పాటించడం లేదని, నియమ నిబంధనలు పాటించడంలేదని, ఆటస్థలాలు ఉండడం లేదని, వీటిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై మంత్రి లకేశ్ బదులిస్తూ పాఠశాల విద్యలో మార్పులు చేయాలంటే జీవో88లో మార్పులు చేయాల్సి ఉందన్నారు. ఇకపై అనుమతుల జారీని ఆన్‌లైన్ చేద్దామని చెప్పారు.

చేనేతలకు అండగా ఉంటాం

చేనేతలకు ఉచిత విద్యుత్ హామీని అమల్లోకి తెస్తూ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేయడంపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లు 'ఎక్స్' వేదికగా వేర్వేరు ప్రకటనల ద్వారా తమ ఆనందాన్ని పంచుకున్నారు. తమ ప్రభుత్వం చేనేతలకు అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 'చేనేత కార్మికుల ఇళ్లకు విద్యుత్‌ను ఉచితంగా ఇచ్చేందుకు మంత్రిమండలి నిర్ణయించింది. దీని వల్ల 93 వేల మంది నేతన్నల కుటుంబాలకు, 10,534 మరమగ్గాలకు ప్రయోజనం చేకూరుతుంది' అని చంద్రబాబు పేర్కొన్నారు. అలాగే వారికి జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. 'ఒక హామీ నెరవేర్చితే ఏదో నా బాధ్యత తీరిపోయినట్లు కాదు.. భారం దించుకున్నట్లు కాదు. లక్షలాది బతుకులకు అది వెలుగు దారి కావాలనే నా ఆశయం నెరవేరుతుందనే ఆనందం ఇది' అంటూ లోకేశ్ ఉద్వేగంగా స్పందించారు.

క్లిక్.. క్లిక్‌లో కిసుక్కులు!

» పవన్ కల్యాణ్‌తో బొత్స కరచాలనం

» మీతో ఫొటో దిగడం అదృష్టం

» బాబుతో మండలి జకియా వ్యాఖ్య

» అడిగి మరీ సీఎంతో ఫొటో దిగిన లక్ష్మణరావు

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ప్రాంగణంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల గ్రూప్ ఫొటోల కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ ఫొటోసెషన్ సందర్భంగా పలు ఆసక్తికర అంశాలు చోటుచేసుకున్నాయి. ఫొటోసెషన్ ముగించుకుని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లోపలికి వెళుతుండగా, మండలిలో శాసనసభాపక్ష నేత బొత్స సత్యనారాయణ, వైసీపీ ఎమ్మెల్సీలు ఆయనకు ఎదురువచ్చారు. పవన్‌తో బొత్స కరచాలనం చేశారు. 'బాగున్నారా.. ఆరోగ్యం ఎలా ఉంది' అంటూ పవన్‌ను ఆయన పరామర్శించారు. 'మిమ్మల్ని కలిసేందుకు కొల్లేరు రైతులు వస్తామని అంటున్నా'రని బొత్స చెప్పగా, 'ఈ రోజు ఢిల్లీ వెళుతున్నా'నని పవన్ సమాధానమిచ్చారు. ఢిల్లీ నుంచి రాగానే కలవవచ్చని అన్నారు.

కంగుతిన్న వైసీపీ సభ్యులు

మండలి సభ్యులతో ఫొటో దిగే సమయంలో 'మీతో ఫొటో దిగడం నా అదృష్టం' అంటూ మండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానం... చంద్రబాబుతో అన్నారు. ఈ వ్యాఖ్యలతో అక్కడే ఉన్న వైసీపీ ఎమ్మెల్సీలు ఒక్కసారిగా కంగుతిన్నారు. జకియా వైసీపీ నుంచి మండలికి ఎన్నిక కావడమే దీనికి కారణం. ఇటీవల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఆలపాటి రాజా చేతిలో ఓటమి పాలైన కేఎస్ లక్ష్మణరావు, చంద్రబాబుతో విడిగా ఫొటో దిగారు. ఫొటోసెషన్ అనంతరం సీఎం వద్దకు వెళ్లిన ఆయన.. మీతో విడిగా ఫొటో దిగాలని కోరడంతో, అందుకు ఆయన సమ్మతించారు.

మైక్ ఎవరూ ఇవ్వరు..మీరే తీసుకోవాలి

ఎమ్మెల్సీల ఫొటో సెషన్ సందర్భంగా.. మండలిలో చైర్మన్ తమకు సరిగా మైక్ ఇవ్వట్లేదని మోషేన్ రాజు సమక్షంలోనే చంద్రబాబుకు మంత్రి లోకేశ్ ఫిర్యాదు చేయగా, 'మైక్ ఎవ్వరూ ఇవ్వరు. పట్టుబట్టి మీరే తీసుకోవా'లని సీఎం సరదాగా సమాధానం ఇచ్చారు. ఫొటో సెషన్ సమయంలో తనకు ముందు వరుసలో అవకాశం ఉందా అని బొత్స అనుమానం లేవనెత్తారు. మండలిలో చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ స్పందిస్తూ.. 'మండలిలో ప్రతిపక్ష నేతగా మీకు ముందు వరుసలో సీటు ఉంద'ని ఆహ్వానించారు. కానీ బొత్స పొరపాటున వేరే కుర్చీలో కూర్చున్నారు.

పరీక్ష హాలులో కాదు..

'వలస' వెళ్లి పొలంలో!

» చిన్నారికి వచ్చిన పెద్ద కష్టం

» పది పరీక్షలు రాయాల్సిన చేతులతో మిర్చి కోతలు



ఆ విద్యార్థిని పేరు... సన్నక్కి చిన్నారి! పదో తరగతి పరీక్షలు రాయాల్సింది! కానీ... గుంటూరు జిల్లా పేరేచెర్ల పొలాల్లో మిర్చి కోస్తోంది! వలస కష్టం ఈ చిన్నారి చదువును చిదిమేసింది. కర్నూలు జిల్లా కోసిగి మండలం చింతకుంట గ్రామానికి చెందిన సన్నక్కి చిన్న మారెప్ప, కమలమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. వీరు ఈ ఏడాది జనవరిలో సొంత ఊరు వదిలి పేరేచర్లలో మిరప కోత పనుల కోసం వలస వెళ్లారు. పదో తరగతి చదువుతున్న చిన్నారిని సైతం తమతో తీసుకెళ్లారు. పది పరీక్షలు ఎంత కీలకమో చిన్నారికి తెలిసినప్పటికీ... తల్లిదండ్రులకు తోడుగా వెళ్లక తప్పలేదు. ఇది ఒక్క చిన్నారి కథ మాత్రమే కాదు. ఎంతోమంది విద్యార్థుల వ్యథ! కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం నుంచి ఏటా భారీగా జనం వలసలు వెళ్తుంటారు. తమతోపాటు పిల్లలనూ తీసుకెళ్తుండటంతో... వారి చదువులు దెబ్బతింటున్నాయి. - కోసిగి, ఆంధ్రజ్యోతి

ప్రైవేటు వర్సిటీల చట్టానికి సవరణ

» సెంచూరియన్ వర్సిటీకి ప్రత్యేక అనుమతులు

» అసెంబ్లీలో బిల్లు పెట్టిన లోకేశ్.. ఏకగ్రీవ ఆమోదం

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఉన్నత విద్యకు అత్యంత ప్రాధాన్యమిస్తోందని, 2016లోనే ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటుకు ప్రత్యేక చట్టం తీసుకువచ్చిందని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. మంగళవారం అసెంబ్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు విశ్వవిద్యాలయాల సవరణ బిల్లును ఆయన ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2016లో సెంచూరియన్ యూనివర్సిటీ విశాఖపట్నానికి వచ్చిందన్నారు. ట్రస్ట్ ఒడిశాలో ఉండడంతో ఫండ్స్ రావడం లేదన్నారు. వారు సీయూటీఎంను ఏపీ కింద ఏర్పాటు చేయాలని కోరారు. ఇన్‌కం ట్యాక్స్ కూడా సీయూటీఎం ఏపీ కింద ఉంటే బాగుంటుందని వాళ్లు అడిగారు. దానికి అనుమతులిస్తూ ప్రభుత్వం చట్ట సవరణ చేస్తోందన్నారు. విదేశీ విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు కొన్ని చట్టాల్ని సవరణ చేయాలన్నారు. అసెంబ్లీ తర్వాత అన్ని సంస్థలతో సమావేశాలు ఏర్పాటు చేసుకుని దేశంలోని టాప్ వర్సిటీని ఏపీకి తీసుకువస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు విశ్వవిద్యాలయాల సవరణ చట్టాన్ని సభ ఆమోదించాలని కోరారు. ఈ బిల్లును శాసన సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

అర్బన్ అథారిటీలకు ప్రత్యేక అధికారాలు

» ఏపీ మహా నగర, పట్టణాభివృద్ధి సంస్థల చట్టానికి సవరణల బిల్లుకు ఆమోదం

రాష్ట్రంలో అర్బన్ అథారిటీలకు ప్రాధాన్యమిస్తూ ఆంధ్రప్రదేశ్ మహానగర ప్రాంత, పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థల సవరణ బిల్లును మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ప్రవేశపెట్టారు. ఈ బిల్లును సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. బిల్లుపై విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ వీఎంఆర్‌డీఏ రైతులను, రైతుల వద్ద నుంచి ప్లాట్స్ కొన్న వారిని ఇబ్బందులను పెడుతోందని చెప్పారు. దీనిపై ఒక కమిటీ వేయాలని కోరారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ వీఎంఆర్‌డీ సమస్యలపై ప్రత్యేకంగా విచారణ చేస్తామన్నారు. స్థానిక సంస్థలకు భవన నిర్మాణ అనుమతులు ఇచ్చే అధికారం ఇస్తున్నామన్నారు.

బెట్టింగ్ యాప్‌లపై ఫైటింగ్!

(మొదటి పేజీ తరువాయి)

ఆర్థిక వ్యవస్థను, యువత భవిష్యత్తును ధ్వంసం చేస్తున్న బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండండి. కాసులకు కక్కుర్తిపడి బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న ఇన్‌ఫ్లూయెన్సర్లపై పోలీసులకు ఫిర్యాదు చేయండి" అని సజ్జనార్ ఇచ్చిన పిలుపునకు ఫలితం వస్తోంది. 'సే నో టూ బెట్టింగ్ యాప్స్' హ్యాష్ ట్యాగ్‌తో బెట్టింగ్ నివారణ ఉద్యమాన్ని కొనసాగిద్దామంటూ పిలుపునిచ్చారు. "ఎంతో మంది అమాయకుల ప్రాణాలు తీస్తున్న బెట్టింగ్ మహమ్మారిని అరికట్టడానికి ఎవరి అనుమతీ అక్కర్లేదు. సమాజంలో మార్పు తీసుకురావాలనుకుంటే ఇలానే ముందుకు సాగండి. మనమంతా కలిసి సోషల్ మీడియాలో బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి వ్యతిరేకంగా పోరాడదాం. అనేక మంది ప్రాణాలను కాపాడదాం. ఈ సందేశాన్ని విస్తృతంగా చేరవేయండి" అనే సజ్జనార్ మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా ప్రచారంలోకి వచ్చాయి. ఫలితంగా మోసపూరిత యాప్‌లకు ప్రచారం చేస్తున్న 11 మంది ఇన్‌ఫ్లూయెన్సర్లపై ఒకేరోజు పోలీసులు కేసులు నమోదు చేశారు. సజ్జనార్ తాజా ఉద్యమంతో ఇన్‌ఫ్లూయెన్సర్లు దిగొచ్చారు. ఇకపై బెట్టింగ్ యాప్‌ల ప్రచారం చేయబోమని ప్రకటిస్తున్నారు.

ప్రమోషన్లతో సంపాదన ఇలా..

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో బెట్టింగ్ యాప్‌ల ప్రమోటర్లపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్‌తో తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు వస్తున్నాయి. దీంతో కొందరు డబ్బు సంపాదనకు దీన్ని సులువైన మార్గంగా ఎంచుకుంటున్నారు. అదేసమయంలో వారి ప్రచారం చూసి.. బెట్టింగ్ యాప్‌ల్లో డబ్బులు పెట్టి సర్వం కోల్పోతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. తర్వాత రుణ భారం ఎక్కువ కావడంతో తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న ఘటనలు ఉన్నాయి. ఈ యాప్‌ల్లో ఓ వ్యక్తి చేసిన డిపాజిట్‌పై పర్సంటేజీలు, కమీషన్లను ప్రమోటర్లకు ఇస్తున్నారు. ఈ ప్రచారం ద్వారా కొందరు రోజుకు రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. బెట్టింగ్ యాప్‌ల ప్రచారం ద్వారా ఎంత ఎక్కువ మందితో డిపాజిట్ చేయిస్తే అంత ఎక్కువ కమీషన్ వస్తుంది. దీంతో ఎక్కువమంది ఈ యాప్‌లకు ప్రచారం చేస్తున్నారు. ఇన్‌ఫ్లూయెన్సర్లు చాలామంది టెలిగ్రామ్‌లో గ్రూపులు సృష్టిస్తున్నారు. తర్వాత ఆ గ్రూపులో బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్నారు. మొదట యాప్‌లో జాయిన్ అయితే బోనస్ వస్తుందంటూ బెట్టింగ్ యాప్‌లో రిజిస్ట్రేషన్ అయ్యేలా ఆకర్షిస్తుంటారు. .

నటి మంచు లక్ష్మి ప్రమోషన్

కొందరు సినీ నటులు కూడా బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్నారు. తాజాగా నటి మంచు లక్ష్మి యోలో24/7 యాప్‌ను ప్రమోట్ చేసినట్లు వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఆమెపై కేసు నమోదు చేసేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు.

స్కూళ్లు.. సవాళ్లు

(మొదటి పేజీ తరువాయి)

పాఠశాల స్థాయిలో 76,564 మంది విద్యార్థులు తగ్గారు. ప్రాథమిక పాఠశాలల్లో ఏకంగా 1,21,700 మంది విద్యార్థులు తగ్గిపోవడం గమనార్హం. దీంతో పాఠశాల విద్య క్రమంగా వృద్ధిరేటుకు వ్యతిరేక దిశలో సాగుతోందని నిపుణులు చెబుతున్నారు.

ప్రభుత్వ-ప్రైవేటు.. అంతే!

వైసీపీ ప్రభుత్వం పాఠశాల విద్యపై చేసిన ప్రయోగాలతో కొన్నేళ్లుగా స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. గత ఐదేళ్లలో పాఠశాల స్థాయిలో లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల నుంచి వెళ్లిపోయారని మంత్రి లోకేశ్ పలుమార్లు ప్రకటించారు. అయితే, వారిలో అందరూ ప్రైవేటు బడులకు వెళ్లలేదని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలో 58,592 పాఠశాలలున్నాయి. వాటిలో 45 వేలు ప్రభుత్వ పాఠశాలలు. అన్నిట్లో కలిపి 2023-24 విద్యా సంవత్సరంలో 71,14,839 మంది విద్యార్థులు చదివారు. 2024-25లో ఆ సంఖ్య 68,51,745కు తగ్గింది. అంటే 2,63,094 మంది విద్యార్థులు అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేటు స్కూళ్లలో ఎక్కడా లేరు. ఇక, వైసీపీ హయాంలో విద్యార్థుల సంఖ్య భారీ స్థాయిలో పడిపోయింది. 2020-21లో 73,12,852 మంది విద్యార్థులు పాఠశాలల్లో చదివారు. 2023-24 నాటికి వీరిలో 1,98,013 మంది తగ్గిపోయారు. గత ప్రభుత్వ చర్యల ఫలితంగా 2024-25 విద్యా సంవత్సరంలోనూ తగ్గుదల కొనసాగింది.

జననాల రేటు తగ్గుదల

ప్రతి సంవత్సరం పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు బడి నుంచి బయటికి వెళ్తారు. మరోవైపు ఒకటో తరగతిలో కొత్తగా చేరే విద్యార్థులతో ఆ సంఖ్య భర్తీ అవుతుంది. కానీ, గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో జననాల రేటు తగ్గుతూ వస్తోంది. 2015-16లో జననాల రేటు 1.7గా ఉంటే, 2019-20 నాటికి అది 1.5కు పడిపోయింది. అది ఒకటో తరగతిలో చేరికలపై ప్రభావం చూపుతోంది. మరోవైపు ఒకసారి బడిలో చేరిన విద్యార్థి ఆపై తరగతికి వెళ్లకపోవడంపైనా ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకటో తరగతిలో చేరిన తర్వాత పిల్లలు ప్రతి ఏటా ఆ తర్వాత తరగతికి ప్రమోట్ అవుతారు. అలా పైతరగతులకు వెళ్లకుండా ప్రాథమికోన్నత పాఠశాలల్లో 64,830 మంది, ఉన్నత పాఠశాలల్లో 76,564 మంది తగ్గిపోయారు. వారు అటు ప్రైవేటు, ఇటు ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కడా చదవడం లేదు. ఓవైపు కొత్తగా ఒకటో తరగతిలో చేరేవారి సంఖ్య తగ్గుతుంటే, మరోవైపు చదువుతున్న పిల్లలు బడి మానేయడం ప్రతికూల ఫలితాలను ఇస్తోంది.

పాఠశాలల్లో విద్యార్థుల నమోదు వివరాలు

కేటగిరీ	2021-22	2022-23	2023-24	2024-25
ప్రాథమిక	25,81,655	51,60,307	20,16,512	18,94,812
ప్రాథమికోన్నత	9,94,760	9,75,047	9,21,615	8,56,785
ఉన్నత	36,58,662	40,57,970	41,76,712	41,00,148
మొత్తం	72,35,077	71,93,324	71,14,839	68,51,745

బాలికల సంఖ్యా తగ్గింది

పాఠశాలల్లో బాలికల సంఖ్య మరింత తగ్గిపోతోంది. 2023-24లో పాఠశాలల్లో చదివే బాలికల సంఖ్య 34,14,383గా ఉంటే, 2024-25లో 33,14,129కి తగ్గింది. 2013-14లో 35.44 లక్షల మంది బాలికలు పాఠశాలల్లో విద్యనభ్యసిస్తే, ఇప్పుడు ఆ సంఖ్య పెరగకపోగా 2 లక్షలకు పైగా తగ్గింది. 2023-24తో పోలిస్తే ఈ విద్యా సంవత్సరంలో తొమ్మిది, పది తరగతుల్లో 36,934 మంది తగ్గిపోయారు. 1 నుంచి 5 తరగతుల్లో ఏకంగా 72,180 మంది బాలికలు తగ్గారు.

దెబ్బకొట్టిన జగన్ ప్రయోగాలు

- విద్యా రంగంలో చేసే సంస్కరణలు విద్యార్థులను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేలా ఉండాలి. కానీ వైసీపీ ప్రభుత్వం చేసిన ప్రయోగాలు పాఠశాల విద్యను అస్తవ్యస్తం చేశాయి.
- ప్రధానంగా జీవో 117 ద్వారా తరగతులను విలీనం చేయడం విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపింది. ఆరేడేళ్ల వయసులో బలవంతంగా పిల్లల్ని బడులు మార్చడం తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బంది పెట్టింది. అలా బడి మారే క్రమంలో కొందరు మొత్తానికే చదువుకు దూరమయ్యారు.
- సబ్జెక్టు టీచర్ల విధానంపై తీసుకొచ్చిన అనాలోచిత విధానం ప్రాథమికోన్నత పాఠశాలలను దెబ్బతీసింది.
- 1 నుంచి 7 తరగతులు ఉండే ప్రాథమికోన్నత పాఠశాలల్లో 3 నుంచే విద్యార్థులకు సబ్జెక్టు టీచర్లతో బోధిస్తామని చెప్పిన జగన్ ప్రభుత్వం విద్యార్థులు సంఖ్య తక్కువ ఉన్న పాఠశాలల్లో 6, 7 తరగతులకు కూడా సెకండరీ గ్రేడ్ టీచర్లను ఇచ్చింది.
- సాధారణంగా ప్రాథమిక పాఠశాల దాటి ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు 6వ తరగతి నుంచి సబ్జెక్టు టీచర్లే బోధిస్తారు. కానీ, 3 నుంచే సబ్జెక్టు టీచర్లు అని చెప్పి చివరికి విద్యార్థులు తక్కువగా ఉన్నారనే కారణంతో 6, 7 తరగతుల కూడా సబ్జెక్టు టీచర్లను తొలగించడం గందరగోళానికి దారితీసింది.

వంశీకి మూడోసారి రిమాండ్

» ఫోర్జరీ కేసులో ఏప్రిల్ 1 వరకు రిమాండ్ విధించిన గన్నవరం కోర్టు



విజయవాడ/గన్నవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): విజయవాడ జిల్లా జైలులో ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి వరుస రిమాండ్లు షాక్ ఇస్తున్నాయి. గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో ఫిర్యాదుదారును కిడ్నాప్ చేసిన కేసులో వంశీ రిమాండ్‌లో ఉన్న విషయం తెలిసిందే. ఇదిలా ఉండగానే టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో విజయవాడలోని సీఐడీ కోర్టు కొద్దిరోజుల క్రితం రిమాండ్ విధించింది. తాజాగా ఫోర్జరీ సంతకాలు చేసి, నకిలీ పత్రాలు సృష్టించి ఒకరి భూమిని మరొకరి చేతుల్లో పెట్టిన కేసులో ఆయనకు గన్నవరం కోర్టు వచ్చేనెల 1వరకు రిమాండ్ విధించింది. ఫోర్జరీ, బెదిరింపులపై ఉంగుటూరు మండలం తేలప్రోలుకు చెందిన రైల్వే కాంట్రాక్టర్ శనగల శ్రీధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఆత్కూరు పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై పోలీసులు గన్నవరం కోర్టులో పీటీ వారెంట్ దాఖలు చేయగా అనుమతి ఇచ్చింది. విజయవాడ జిల్లా జైలులో ఉన్న వంశీని పోలీసులు మంగళవారం మధ్యాహ్నం గన్నవరం ఎనిమిదో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. ఆయనకు ఏప్రిల్ ఒకటో తేదీ వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి శిరీష ఆదేశాలు ఇచ్చారు. జైలులో ఇనుప మంచం ఇచ్చారని, వెన్ను నొప్పితో బాధపడుతున్నప్పటికీ కనీసం కుర్చీ ఇవ్వలేదని న్యాయాధికారి దృష్టికి వంశీ తీసుకెళ్లారు. తనకు మొత్తటి దుప్పటి, దిండు ఇప్పించాలని కోరారు. సౌకర్యాలపై విజయవాడ కోర్టులో పిటిషన్ దాఖలు చేసుకోవాలని న్యాయాధికారి చెప్పారు. అనంతరం వంశీని విజయవాడ జిల్లా జైలుకు తరలించారు.

చిత్తూరు జిల్లాలో 264 మంది పోలీసులు బదిలీ

చిత్తూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేనివిధంగా చిత్తూరు జిల్లాలో మంగళవారం ఏకంగా 264 మంది పోలీసులు బదిలీ కావడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇటీవల పుంగనూరులో టీడీపీ కార్యకర్త రామకృష్ణను వైసీపీ నేత వెంకట్రమణ దారుణంగా నరికి చంపిన విషయం తెలిసిందే. తనకు ప్రాణహాని ఉందని మృతుడు రామకృష్ణ చెప్పిన పాత వీడియో బయట పడడంతో పోలీసుల వైఫల్యం గురించి పైస్థాయి వరకూ వెళ్లింది. ఈ నేపథ్యంలో చిత్తూరు పోలీసులపై ప్రభుత్వ పెద్దలు ఆగ్రహించడంతోపాటు పుంగనూరు సీఐ శ్రీనివాసులును సస్పెండ్ కూడా చేశారు.

పీఠం వెనుక మోసం

(మొదటి పేజీ తరువాయి)

వైసీపీ పెద్దలు అడ్డుకున్నారు. నేరుగా నాటి సీఎం కార్యాలయం నుంచి రెవెన్యూ అధికారులకు ఫోన్‌లు వెళ్లాయి. తమాషాలు చేస్తున్నారా... పీఠం భూముల గురించి మీకెందుకు...అంటూ హెచ్చరించారు. దీంతో అధికారులు మౌనంగా ఉండిపోయారు.

ప్రభుత్వం మారాక...

2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం వచ్చాక రెవెన్యూ అధికారులు మరోసారి పాత ఫైళ్లను తిరగేశారు. భీమిలిలో ఇచ్చిన విలువైన భూములను వాణిజ్య అవసరాలకు వాడుకోవద్దని రెవెన్యూశాఖ అభ్యంతరం పెట్టింది. తర్వాత ఆ భూ కేటాయింపులనే రద్దుచేసింది. అనంతరం పెందుర్తి మండలం చినముసిడివాడలో శారదాపీఠం చుట్టు ఉన్న ప్రభుత్వ భూములపై సర్వే నిర్వహించారు. సర్వే నంబర్ 87/1, 90, 91/1, 91/3, 91/9లోని భూముల్లో శారదా పీఠం ఉంది. ఇదే సర్వేనంబర్ల పరిధిలో ప్రభుత్వ భూములున్నాయి. ప్రభుత్వ భూముల లెక్క తేల్చడానికి గత ఏడాది నవంబరులో రెవెన్యూ అధికారులు ప్రయత్నించగా పీఠం పెద్దలు అడ్డుకున్నారు. రెవెన్యూ ఉన్నతాధికారులను పీఠానికి సంబంధించిన మనుషులు నిరోధించారు. దీంతో రెవెన్యూ అధికారులు ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి సర్వే నిర్వహించారు. గూగుల్ చిత్రాలు, ఎఫ్ఎంబీ (ఫీల్డ్ మెజర్‌మెంట్ బుక్స్)ను ఉపయోగించి ఆక్రమణల గుట్టు తేల్చారు. ఆ తర్వాత తమ వద్ద ఉన్న ఫెయిర్ అడంగల్‌లోని రికార్డులను పరిశీలించి ప్రభుత్వ భూములకు మార్కింగ్ చేయగా, భారీగా ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నట్లుగా తేలింది. క్షేత్రస్థాయిలో సర్వే చేస్తే... ఆక్రమణల గుట్టు మరింత రట్టు అయ్యే అవకాశముంది. ప్రాథమిక పరిశీలన ప్రకారం...

- సర్వే నంబర్ 87/1లో ఇనాం భూమి ఉంది. విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ ఆమోదించిన లేవుట్ ప్లాన్‌లో 30 అడుగుల రోడ్డు (ఎల్‌పీ నం. 11/86) ఉంది. ఈ సర్వే నంబర్‌లో 35 సెంట్ల భూమిని పీఠం ఆక్రమించుకున్నట్లుగా తేల్చారు. ఇందులో పీఠం కార్యాలయం, అతిథి గృహం, స్వామీజీ పీఠం ఏర్పాటుచేశారు. బీటీ రోడ్డు, ప్రధాన గేటును ఏర్పాటు చేశారు.
- సర్వే నంబర్ 90లో 22 సెంట్ల భూమిని పీఠం తన అధీనంలోకి తీసుకుంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఈ భూమి రహదారి. దీన్ని పీఠం ఆక్రమించుకొని ఆలయం నిర్మించింది. పెద్ద బీటీ రోడ్డు వేసింది. పీఠం నిర్మించిన కమ్యూనిటీ హాల్ సగం ఈ భూమిలోనే ఉన్నదని గుర్తించారు.
- సర్వే నంబర్ 91/2లో సర్కారు పుంజగా (ప్రభుత్వ భూమి) రికార్డులో గల 2.96 ఎకరాల భూమి ఉంది. 91/3 సర్వే నంబర్‌లో 1.30 ఎకరాల భూమి ఉంది. 1.38 ఎకరాల భూమిని పీఠం హస్తగతం చేసుకున్నట్లు గుర్తించారు. ఈ భూమిలో వేదపాఠశాల, విద్యార్థులు, ఉపాధ్యాయుల వసతిగృహాలు నిర్మించినట్లు నిర్ధారించారు.
- సర్వే నంబర్ 91/9లో 4.15 ఎకరాల భూమి ఉంది. ఇందులో మూడు ఆలయాలు నిర్మించారు. పీఠం నిర్మించిన కమ్యూనిటీ హాల్ సగం ఇందులోనే ఉంది. కొంత భూమిని ఓపెన్ స్థలంగా వాడుకుంటున్నారు.
- 1.50 ఎకరాల భూమిని పీఠం కబ్జా చేసినట్లు గుర్తించారు. మరో గెడ్డ కూడా పీఠంలో కలిసిందని అధికారులు చెబుతున్నారు. ఈ రెండింటిని కలిపితే రెండున్నర ఎకరాల భూమి ఆక్రమణకు గురైనట్లుగా భావించాల్సి ఉంటుందని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి.

పీఠంలోకి అడుగుపెట్టగలరా?

జగన్ ప్రభుత్వంలో పీఠం పరిసరాల్లోకి వెళ్లేందుకు రెవెన్యూ అధికారులు ప్రయత్నించగా నాటి ప్రభుత్వ పెద్దలు అడ్డుకున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉంది. గత నవంబరులో భూముల సర్వేకు అధికారులు వెళ్లగా పీఠం ప్రతినిధులు అడ్డుకున్నారు. దీంతో గూగుల్ మ్యాప్స్, ఇతర శాటిలైట్ ఇమేజెస్, రెవెన్యూ రికార్డుల ఆధారంగా సాంకేతిక టెక్నాలజీ ఉపయోగించి పీఠం ఆక్రమణలపై ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. అయితే, పీఠం లోపలకు వెళ్లి సర్వే చేయగలిగితే మరిన్ని ఆక్రమాలు బయటపడే అవకాశం ఉంది. ఆక్రమించిన భూముల పరిమాణం కూడా పెరిగే వీలుంది. కానీ, ఇది అయ్యేపనేనా? ప్రభుత్వం తన అధికారాన్ని ఉపయోగించి పీఠంలోకి వెళ్లి సర్వే చేయడానికి సిద్ధమవుతుందా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.



ఏపీ లోకాయుక్త వార్షిక నివేదికను గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు అందజేస్తున్న లోకాయుక్త పి.రజని

లోకాయుక్తపై ప్రజల్లో విశ్వాసం పెరిగింది

» ఏడాదిలో 2,597 ఫిర్యాదులు.. 98% పరిష్కారం

» గవర్నర్‌కు వార్షిక నివేదిక అందజేసిన లోకాయుక్త రజని

కర్నూలు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఏపీ లోకాయుక్త-2024 వార్షిక నివేదికను లోకాయుక్త (ఎఫ్ఏసీ) పి.రజనీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు అందజేశారు. ఆ నివేదికలోని అంశాలు, ఏడాదిలో లోకాయుక్త సాధించిన విజయాలు, ప్రజల్లో పెరిగిన విశ్వాసం, అవగాహన.. తదితర అంశాలపై మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి వివిధ వర్గాల ప్రజలు నుంచే కాకుండా, పత్రికల్లో వచ్చిన కథనాలను సుమోటోగా 2,597 ఫిర్యాదులు స్వీకరించి, 98 శాతం పరిష్కారం చూపామని తెలిపారు. అత్యధికంగా కర్నూలు జిల్లా నుంచి, అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో అధికారులు అక్రమంగా చెల్లింపులు, దుర్వినియోగం చేసిన రూ.61.28 కోట్లు రికవరీ చేసి ప్రభుత్వ ఖజానాకు చెల్లించారు. రూ.52.78 కోట్లు కేంద్ర ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టినట్లు గుర్తించాం. రూ.2 కోట్ల వరకు ఉపాధి హామీ నిధులు దుర్వినియోగం చేశారు. పర్యావరణం, భూ సమస్యల పరిష్కారంలో క్రియాశీల పాత్ర పోషించాం. భూ ఆక్రమణలు, ఇసుక అక్రమ తవ్వకాలు నిరోధించేందుకు లోకాయుక్త పటిష్ఠ చర్యలు తీసుకుంది. భూముల మ్యుటేషన్, భూ రికార్డుల్లో అనధికారిక మార్పులు చేర్పులపై వచ్చిన ఫిర్యాదులు పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాం. విశాఖలో కమ్యూనిటీ ప్రయోజనాల కోసం కేటాయించిన ఇంటి ప్లాట్లను విశాఖ పట్నం అర్బన్ డెవలెప్‌మెంట్ అథారిటీ (ఉడా), రెవెన్యూ ఉద్యోగులు అక్రమంగా ఇతరులకు కేటాయించడం, విక్రయించారనే ఆరోపణలు రావడంతో ఫిర్యాదు స్వీకరించి, ఏసీబీ చార్జిషీట్ దాఖలు చేయడమే కాకుండా సంబంధిత సేల్ డీడ్‌లను రద్దు చేయడానికి చట్టపరమైన చర్యలు ప్రారంభించారని పేర్కొన్నారు. ప్రజలకు లోకాయుక్త సేవలను విస్తృతం చేయడానికి లోకాయుక్త చట్టాలపై ప్రజల్లో అవగాహన పెంచుతున్నామన్నారు. అవినీతి నిరోధకానికి, ప్రజా ఫిర్యాదులను పరిష్కరించడంలో ఏపీ లోకాయుక్త అంకితభావం, జవాబుదారీతనంతో పని చేస్తుందని వెల్లడించారు.

నాతో మాట్లాడించింది 'సాక్షి' మీడియానే!

» స్క్రిప్టు, ఫొటోలు నాకు వారే ఇచ్చారు: పోసాని

గుంటూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): "చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌లపై నాతో మాట్లాడించింది సాక్షి మీడియా వాళ్లే. అందులో తన పాత్ర ఏమీ లేదు" అని సీఐడీ విచారణలో సినీ నటుడు పోసాని కృష్ణమురళి చెప్పినట్టు తెలిసింది. గత వైసీపీ హయాంలో హైదరాబాద్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి చంద్రబాబుపై పోసాని అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారంతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయంటూ టీడీపీ కార్యకర్త బండారు వంశీకృష్ణ గత అక్టోబరు 9న సీఐడీ అదనపు డీజీకి ఫిర్యాదు చేశారు. దీంతో గుంటూరు సీఐడీ అధికారులు పోసానిపై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 12న కర్నూలు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న పోసానిని సీఐడీ అధికారులు పీటీ వారెంట్‌పై గుంటూరు తీసుకువచ్చి కోర్టులో హాజరు పరచగా కోర్టు ఆయనకు రిమాండ్ విధించింది. కాగా, ఆ కేసులో మరిన్ని వివరాలు, ఆధారాలు రాబట్టాల్సి ఉందన్న సీఐడీ అధికారుల అభ్యర్థన మేరకు పోసానిని మంగళవారం ఒకరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య కోర్టు కస్టడీకి అనుమతించింది. దీంతో మంగళవారం ఉదయం 10 గంటలకు సీఐడీ అధికారులు గుంటూరు జిల్లా జైలు నుంచి పోసానిని అదుపులోకి తీసుకున్నారు. తొలుత జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు చేయించాక సీఐడీ కార్యాలయానికి తరలించి డీఎస్పీ గోలి లక్ష్మయ్య ఆధ్వర్యంలో పోసానిని విచారించారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు తిరిగి జిల్లా జైలుకు తరలించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు విచారణలో అధికారుల ప్రశ్నలు, పోసాని సమాధానాలు ఇవీ..



సీఐడీ: హైదరాబాద్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి చంద్రబాబు ఇతర నేతలపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి మీవద్ద ఉన్న ఆధారాలు ఏమిటి?

పోసాని: ఆరోజు నేను మాట్లాడిన అంశానికి సంబంధించి నాకేమీ తెలీదు. సాక్షి మీడియా వాళ్లే మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. వారిచ్చిన స్క్రిప్ట్‌నే చదివా. వారిచ్చిన ఫొటోలనే చూపించా.

సీఐడీ: మీకు ఫొటోలు, స్క్రిప్టు ఇచ్చిన సాక్షి మీడియా వాళ్లు ఎవరు?

పోసాని: వారెవరో తెలీదు. నాకు గుర్తు లేదు. కానీ, వారు ఇచ్చిన స్క్రిప్టును నిర్ధారించుకోకుండానే మాట్లాడా. నేను ఎవరినీ తిట్టలేదు. అది మార్ఫింగ్ వీడియో.

సీఐడీ: గతంలో కూడా అనేకసార్లు మీరు ఇలానే మాట్లాడినట్లు వీడియోలు వచ్చాయి కదా?

పోసాని: నా కుటుంబం గురించి మాట్లాడడం వల్లే నేను కూడా ఆవేశంలో అలా మాట్లాడాల్సి వచ్చింది.

సీఐడీ: గత వైసీపీ ప్రభుత్వంలో లబ్ధి పొందడం వల్లే ఈ విధంగా ఆ పార్టీకి, ప్రభుత్వానికి అనుకూలంగా ప్రత్యర్థులపై అనుచిత వ్యాఖ్యలు చేశారా?

పోసాని: వైసీపీ ప్రభుత్వంలో నేనెలాంటి లబ్ధీ పొందలేదు. రెండేళ్ల కాల పరిమితి ఉన్న ఎఫ్‌డీసీ చైర్మన్ పదవిలో నేను 8 నెలలు మాత్రమే కొనసాగా. నెలకు రూ.మూడున్నర లక్షల జీతం వచ్చింది. అంతకుమించి నాకు ఎలాంటి లబ్ధీ జరగలేదు. వైసీపీ కోసం నేనే రూ.కోట్లు ఖర్చు చేశా.

సాక్షి మీడియాకు సీఐడీ నోటీసులు!

హైదరాబాద్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేయించి చంద్రబాబుతో పాటు ఇతర నేతలపై సాక్షి మీడియా వారే తనతో అనుచిత వ్యాఖ్యలు చేయించారని పోసాని వెల్లడించిన నేపథ్యంలో సీఐడీ అధికారులు సాక్షి మీడియాకు నోటీసులు జారీ చేయాలని నిర్ణయించారు. ఆరోజు మీడియా సమావేశం ఏర్పాటు చేయించింది ఎవరు? పోసానికి స్క్రిప్టు రాసి ఇచ్చింది ఎవరు? మార్ఫింగ్ ఫొటోలు అందించింది ఎవరు? ఆరోజు పోసాని నిర్వహించిన ప్రెస్‌మీట్‌ను కవర్ చేసింది ఎవరు? తదితర వివరాలు తెలియజేయాలంటూ నోటీసులు ఇవ్వనున్నారు.

'అమ్మ దొంగ' అరెస్ట్

» సత్తుపల్లి పోలీసులకు చిక్కిన అంతర్రాష్ట్ర దొంగ

» రూ.45లక్షల విలువైన సొత్తు రికవరీ

సత్తుపల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): అమ్మకు ఓ చీర కొని పెడదామని చోరీలు మొదలుపెట్టి అంతర్రాష్ట్ర దొంగగా ఎదిగిన ఓ కేటుగాడిని ఖమ్మం జిల్లా సత్తుపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలను ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ సత్తుపల్లిలో మంగళవారం విలేకరులకు వివరించారు. ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చిత్తాపూర్‌కు చెందిన తిరువీధుల సురేందర్ తన తల్లికి చీర కొనివ్వాలనే కోరికతో మొట్టమొదటిసారి రూ.300 చోరీ చేశాడు. తర్వాత దొంగతనాలను వృత్తిగా మార్చుకుని అంతర్రాష్ట్ర దొంగయ్యాడు. తెలంగాణ, ఏపీల్లో 90 చోరీ కేసుల్లో నిందితుడుగా ఉన్నాడు. గత నవంబరులో రాజమండ్రి జైలు నుంచి విడుదలైన సురేందర్.. తెలుగు రాష్ట్రాల్లో తిరుగుతూ వరుసగా మూడు నెలల వ్యవధిలోనే 43 చోరీలు చేశాడు. ఈ నెల 10న సత్తుపల్లిలో సురేందర్‌ను గుర్తించిన నరేష్ అనే కానిస్టేబుల్ అతనిని అనుసరించాడు. ఇది గమనించిన సురేందర్.. నరేష్‌పై కత్తితో దాడి చేసి పరారయ్యాడు. కొత్తూరు సమీపంలోని స్మశాన వాటిక వద్ద అతడిని మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సురేందర్ దగ్గర 461.18గ్రాముల బంగారు, 426గ్రాముల వెండి ఆభరణాలు, రూ.3.33లక్షల నగదు, ఒక మొబైల్‌ఫోన్, రెండు ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మొత్తం సొత్తు విలువ రూ.45లక్షలు ఉంటుంది. కొన్ని ఆయుధాలనూ సీజ్ చేశారు.

విజయసాయిరెడ్డికి మళ్లీ సీఐడీ పిలుపు!

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డికి సీఐడీ మరోసారి నోటీసులు ఇవ్వనుంది. కాకినాడ సెజ్, పోర్టు యజమాని కేవీ రావును బెదిరించి వాటాలను బదిలీ చేయించుకున్న వ్యవహారంలో విచారణ కోసం మళ్లీ రావాలని త్వరలో శ్రీముఖం పంపనుంది. తనను బెదిరించి కాకినాడ పోర్టులో, సెజ్‌లో వాటాలు రాయించుకున్నారంటూ కేవీ రావు.. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సీఐడీకి ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు సంస్థ పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసింది. దర్యాప్తులో భాగంగా ఈ నెల 12న విజయవాడలో సీఐడీ అధికారులు పిలిచి విచారించగా మొత్తం విక్రాంత్ రెడ్డే చేశారని విజయసాయిరెడ్డి కుండబద్దలు కొట్టారు. ఇంకోవైపు.. తనపై సీఐడీ జారీ చేసిన లుకవుట్ సర్క్యులర్‌ను రద్దు చేయాలని ఆయన ఇటీవల ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై కోర్టు నోటీసులు జారీ చేయగా.. సీఐడీ కౌంటర్ దాఖలు చేసింది. కేసులో దర్యాప్తు కొనసాగుతోందని, విజయసాయిరెడ్డిని మరోమారు ప్రశ్నించాల్సి ఉందని అందులో పేర్కొంది.

నాపై కేసును కొట్టివేయండి

» హైకోర్టును ఆశ్రయించిన వైసీపీ నేత కొడాలి నాని

అమరావతి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): 'పోలీస్ శాఖను, వారి విధులను అవమానించేలా వ్యాఖ్యలు చేశానంటూ గత ఏడాది జూన్ 8న మచిలీపట్నం పట్టణ పోలీసులు నమోదు చేశారు. ఆ కేసును కొట్టివేయండి. తదుపరి చర్యలు నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వండి' అని వైసీపీ నేత కొడాలి నాని అభ్యర్థించారు. ఈమేరకు మంగళవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'ఫిర్యాదుదారుగా ఉన్న ఎస్ఐ కేసు దర్యాప్తు అధికారిగా ఉండడానికి వీల్లేదు. వ్యక్తిగత కక్షతోనే నాపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నవే. 41(ఏ) ప్రకారం నోటీసులిచ్చి వివరణ తీసుకొనేలా ఆదేశించండి' అని పిటిషన్‌లో కోరారు.

విశాఖ ఉక్కుపై అదే మాట!

» కేంద్ర ఆర్థిక శాఖ నుంచి మళ్లీ పాత సమాధానమే

» పెట్టుబడుల ఉపసంహరణ నిర్ణయం మారలేదని స్పష్టీకరణ

విశాఖపట్నం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల హక్కుగా ఏర్పడిన విశాఖ ఉక్కు కర్మాగారం విషయంలో కేంద్రం తన పట్టు, బెట్టులను వీడడం లేదు. విశాఖ స్టీల్ నుంచి 100 శాతం పెట్టుబడులను ఉపసంహరించాలని కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ(సీసీఈఏ) 2021, జనవరి 27న తీసుకున్న నిర్ణయానికే కట్టుబడినట్టు తాజాగా మరోసారి వెల్లడించింది. విశాఖ ఉక్కు కార్మిక సంఘం నాయకుడు పాడి త్రినాథరావు గత నెల, ఈ నెల మొదటి వారాల్లో కేంద్ర ఆర్థిక శాఖకు రెండు లేఖలు రాశారు. "విశాఖ స్టీల్‌లో 100 శాతం పెట్టుబడుల ఉపసంహరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారా? లేదా? తెలియజేయండి" అని ఆయా లేఖల్లో కోరారు. వాటికి కేంద్ర ఆర్థిక శాఖ మంగళవారం త్రినాథరావుకు సమాధానం పంపింది. సీసీఈఏ గతంలో తీసుకున్న నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేసింది. అంటే.. విశాఖ ఉక్కుకు సంబంధించి 100 శాతం పెట్టుబడుల ఉపసంహరణకే కేంద్రం పట్టుదలతో ఉన్నట్టు స్పష్టమైంది. ఈ వ్యవహారంపై కార్మిక సంఘాలు భగ్గుమంటున్నాయి.

సాయం చేస్తూనే..

'స్టీల్‌ప్లాంటును విక్రయించే ఆలోచన విరమించుకున్నారా లేదా' అంటూ విశాఖపట్నం నుంచి పలువురు కేంద్రాన్ని గతంలోనూ ప్రశ్నించారు. ఎప్పుడు ఎవరు అడిగినా.. 100 శాతం విక్రయించాలని నిర్ణయించినట్టు కేంద్రం నుంచి సమాధానం వస్తోంది. కీలకమైన స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేవీడీ ప్రసాద్ కూడా ఇదే అంశంపై ప్రశ్నించగా.. ఆయనకు సైతం గత ఏడాది జనవరి 29న ఇదే సమాధానం అందింది. స్టీల్‌ప్లాంటును ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేసేందుకు కేంద్రం ఇటీవల రూ.11,450 కోట్ల ఆర్థిక సాయం చేసింది. స్టీల్‌ప్లాంటుకు మళ్లీ పూర్వ వైభవం తీసుకువస్తామని కేంద్ర ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాసవర్మ ఇక్కడి కార్మికులకు భరోసా ఇచ్చారు. మరోవైపు కార్మికుల సంఖ్యను భారీగా తగ్గించేస్తున్నారు. ఉద్యోగులకు వీఆర్ఎస్ ఇచ్చి పంపడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో కేంద్రం వైఖరిపై కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆశా కార్యకర్త కుటుంబం వెలి

» ఉద్యోగానికి రాజీనామా చేయలేదని శ్రీకాకుళంలో గ్రామపెద్దల నిర్వాకం

సంతబొమ్మాళి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఉద్యోగానికి రాజీనామా చేయలేదని ఆశా కార్యకర్త కుటుంబాన్ని గ్రామపెద్దలు గ్రామం నుంచి వెలివేశారు. ఈ సంఘటన శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం గెద్దలపాడులో చోటుచేసుకుంది. నుత్తు చంద్రమ్మ బోరుభద్ర పీహెచ్‌సీ పరిధిలోని గెద్దలపాడులో 2014 నుంచి ఆశా వర్కర్‌గా పనిచేస్తున్నారు. ఐదు రోజుల క్రితం కొందరు గ్రామపెద్దలు ఆశా కార్యకర్త, అంగన్వాడీ కార్యకర్త పోస్టులకు బహిరంగ వేలం నిర్వహించారు. అప్పటికే అంగన్వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న హరిదేవిని గ్రామం నుంచి వెలివేస్తామని బెదిరించి బలవంతంగా రాజీనామా చేయించారు. వేలంలో రూ.2లక్షలు చెల్లించేందుకు ముందుకొచ్చిన వేరొకరికి ఆ పోస్టుని కట్టబెట్టినట్టు సమాచారం. ఆశా కార్యకర్త పోస్టును ఒక మహిళ వేలంలో రూ.1.9 లక్షలకు పాడుకున్నట్లు తెలిసింది. దీంతో ప్రస్తుతం పనిచేస్తున్న చంద్రమ్మను కూడా రాజీనామా చేయాలని గ్రామపెద్దలు హుకుం జారీ చేశారు. చంద్రమ్మ ఒప్పుకోలేదు. దీంతో గ్రామ పెద్దలు కన్నెర్ర చేశారు. గ్రామస్థులెవరూ ఆమె కుటుంబంతో మాట్లాడకూడదని, వారికి సహాయం చేయకూడదని, వారిని శుభకార్యాలకు పిలవకూడదని సోమవారం గ్రామంలో దండోరా వేయించారు. తనకు జరిగిన అన్యాయంపై చంద్రమ్మ యూనియన్ నాయకులతో కలిసి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారికి ఫిర్యాదు చేశారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.